ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

https://prajakalam.com
RNI No.TELTEL/2010/33275

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
&
Public Notice
Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

శుక్రవారం | 27-12- 2024 | సంపుటి: 15 , సంచిక: 268, నిజామాబాద్ పేజీలు: 12, వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

Circulated to Hyderabad,Ranagareddy,Nizamabad, Warangal, Mulugu, Shadnagar, Yadadri, Nalgonda, karimnagar, khammam, Medak, Sangareddy, Siddipet, Medchal, Jagityal,Vemulawada



మన్మోహన్ సింగ్ మరణంతో దేశం ఓ గొప్ప నాయకుడిని కోల్పోయింది. సాధారణ కుటుంబంలో జన్మించిన ఆయన గొప్ప ఆర్థికవేత్తగా ఎదిగారు. దేశ ప్రజల జీవితాలను మెరుగు పరిచేందుకు విశేష కృషి చేశారు

**- నరేంద్ర మోదీ**



దూరదృష్టి కలిగిన రాజనీతిజ్ఞుడిని దేశం కోల్పోయింది. ఆయన ఆర్థిక విధానాలు దేశంలో పేదరికాన్ని తగ్గించాయి.

**- మల్లికార్జున ఖర్గే**



గురువును, మార్గదర్శకుడిని కోల్పోయాను. అపార జ్ఞానం, సమగ్రతతో ఆయన దేశాన్ని నడిపించారు.

**- రాహుల్ గాంధీ**

మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు. దేశ ఆర్థికవ్యవస్థను సంస్కరించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. దేశానికి ఆయన చేసిన సేవ, రాజకీయ జీవితం, వినయంతో కూడిన నడవడిక ఎప్పటికీ గుర్తుండిపోతాయి


**- ద్రౌపది ముర్ము, రాష్ట్రపతి**

## సంస్కరణల రూపశిల్పి..

# అస్తమయం

## వృద్ధాప్య సమస్యలతో మాజీ ప్రధాని

# మన్మోహన్ సింగ్ తుదిశ్వాస



**గురువారం రాత్రి 9:51 గంటలకు ఎయిమ్స్‌లో మృతి**

**హుటాహుటిన ఆస్పత్రికి సోనియాగాంధీ, ప్రియాంక**

**బెళగావి నుంచి ఢిల్లీకి చేరుకున్న రాహుల్ గాంధీ, ఖర్గే**

**రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ సంతాపం**

**అధికారిక లాంఛనాలతో మన్మోహన్ అంత్యక్రియలు**

**ఏడు రోజులు సంతాపదినాలుగా ప్రకటించిన కేంద్రం**

న్యూఢిల్లీ, డిసెంబరు 26: దేశ రాజకీయ యవనికపై ఒక శకం ముగిసింది! కుదేలైన భారత ఆర్థిక వ్యవస్థను ఆర్థిక మంత్రిగా గాడిలో పెట్టిన సంస్కరణల రూపశిల్పి.. ప్రధానిగా ప్రగతిపథంలో పరుగులు తీయించిన ఆర్థికవేత్త ఇక లేరు!! మౌనమే భాషగా ఉంటూనే రెండు పర్యాయాలు.. దేశాన్ని సమర్థంగా పరిపాలించిన రాజనీతిజ్ఞుడు.. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ (92) కన్నుమూశారు. గత కొన్ని నెలలుగా వృద్ధాప్య సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన గురువారం సాయంత్రం తన నివాసంలో అపస్మారక స్థితికి చేరుకున్నారు. రాత్రి 8.06 గంటల సమయంలో కుటుంబసభ్యులు ఆయన్ను ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)కు తరలించారు. ఎమర్జెన్సీ వార్డులో వైద్యులు ఆయనను కాపాడడానికి ఎంతగా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయిందని... రాత్రి 9:51 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచారని ఎయిమ్స్ ఆస్పత్రి ఒక ప్రకటనలో వెల్లడించింది. మన్మోహన్‌సింగ్‌కు భార్య గురుచరణ్, ముగ్గురు కుమార్తెలు ఉపీందర్, అమృత్, దమన్ ఉన్నారు. మన్మోహన్‌ను ఆస్పత్రిలో చేర్పించారన్నవార్త తెలిసిన వెంటనే.. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, ఆ పార్టీ ఎంపీ ప్రియాంక గాంధీ హుటాహుటిన ఎయిమ్స్‌కు చేరుకుని ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ఇక.. కర్ణాటకలోని బెలగావీలో జరుగుతున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీలో పాల్గొన్న పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ.. మన్మోహన్ మరణవార్త తెలియగానే ఢిల్లీకి పయనమయ్యారు. ఆయన గౌరవార్థం.. పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సహా వచ్చే ఏడు రోజులపాటు నిర్వహించతలపెట్టిన అన్ని

తరువాయి 2వ పేజీలో...

## దేశ నిజమైన వాస్తుశిల్పుల్లో ఒకరు

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణ వార్త తనను తీవ్రంగా కలచివేసిందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నిష్కళంకమైన పాలన, అత్యున్నత మానవతావాది అయిన మన్మోహన్ సింగ్ ఆధునిక భారతదేశానికి నిజమైన వాస్తుశిల్పుల్లో ఒకరని కొనియాడారు. దేశంలో ఆర్థిక సంస్కరణల అమలుతోపాటు దేశ అభివృద్ధికి




ఆయన తీసుకున్న అనేక చరిత్రాత్మక నిర్ణయాలను చరిత్ర సదా గుర్తు పెట్టుకుంటుందని ఆయన అన్నారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకాన్ని ప్రవేశపెట్టి గ్రామీణ పేదల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని మంత్రి దుద్దిళ్ల శ్రీ?ధర్ బాబు పేర్కొన్నారు. దూరదృష్టి గల నాయకుడు, ప్రఖ్యాత ఆర్థికవేత్త, రాజనీతిజ్ఞుడు మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని మంత్రి సీతక్క అన్నారు. మన్మోహన్ సంస్కరణల రూపశిల్పి అని దేశాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించిన గొప్ప ఆర్థిక మేధావి అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల కోసం

# 80 లక్షల దరఖాస్తులు

**- 40లక్షల గృహాలు సర్వే చేసి రికార్డు చేశాం**

**- సంక్రాంతికి 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేస్తాం**

**- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి**

దమ్మపేట, డిసెంబరు 26: రాబోయే 4 సంవత్సరాల్లో పేదలకు 20లక్షల గృహాలు మంజూరు చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 80లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించనున్న ఇందిరమ్మ మోడల్ గృహానికి మంత్రి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వానికి ఎన్ని ఇబ్బందులున్నా ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి తీరతామన్నారు. ఇందిరమ్మ గృహాల కోసం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో 10రోజులుగా సర్వే చేస్తున్నారని, ఇప్పటి వరకు సుమారుగా 40లక్షల గృహాలు యాప్ ద్వారా సర్వే చేసి రికార్డు చేశామన్నారు. సంక్రాంతి పర్వదినానికి తొలి విడతగా 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేస్తామని, ప్రతి నియోజకవర్గానికి 3500 గృహాలు కేటాయిస్తామని తెలిపారు. అంతకు ముందు నాచారం, గన్నేపల్లి గ్రామాలలో రూ. 20లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాలను ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి మంత్రి ప్రారంభించారు.

**మహిళా కూలీలతో పొంగులేటి మాటామంతీ**

అశ్వారావుపేట మండలంలో మంత్రి పొంగులేటి పర్యటన సందర్భంగా ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. గురువారం కేశప్పగూడెం సమీపంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ములకలపల్లి వెళ్తుండగా మార్గమధ్యంలో వేరుశెనగచేనులో పనిచేస్తున్న కూలీలను చూసి వారి దగ్గరకు వెళ్లారు. 'అక్కల్లారా చెల్లెమ్మల్లారా బాగున్నారా... మీకు సొంత ఇళ్లు ఉన్నాయా..' అంటూ పలకరించారు. 'ఇంతకీ నేనెవరో తెలుసా? మీ ఇంట్లో వాచీలో బొమ్మ ఉంటుంది గుర్తు పట్టారా...?' అంటూ కూలీలను పకలరించారు. ఇందుకు వారు స్పందిస్తూ 'తెలుసు, మీరు మంత్రి శ్రీనన్న..' అని బదులిచ్చారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ 'గాజులు వేయించుకోండి...' అంటూ వారికి కొంత నగదు ఇచ్చి ముందుకు కదిలారు.



## ఇకపై సినిమా బెనిఫిట్ షోలకు

# అనుమతించం

## సీఎంగా చట్టాన్ని అమలు చేస్తా : సీఎం రేవంత్

**అసెంబ్లీలో చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నా.. చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తాం.. పద్ధతిగా ఉండండి**

**సీఎం పేరు చెప్పనందుకే కేసు అని ప్రచారం చేస్తారా?.. ఎప్పుడో ఆ స్థాయి దాటాం.. మీరెందుకు ఖండించలే?**

**సామాజిక బాధ్యతను సినీ పరిశ్రమ గుర్తుపెట్టుకోవాలి.. డ్రగ్స్, గంజాయి నిరోధానికి ప్రచారం చేయాలి**

2లో

## కామారెడ్డిలో మూకుమ్మడి

# ఆత్మహత్యలు?

**మృతుల్లో బిక్కనూరు ఎస్సై, మహిళా కానిస్టేబుల్, మరో యువకుడు**

**అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్దచెరువులో ఘటన**

**తొలుత కానిస్టేబుల్, యువకుడి మృతదేహాలు చెరువు నుంచి వెలికితీత**

**తాజాగా ఎస్సై మృతదేహం కూడా.. మృతికి గల కారణాలపై దర్యాప్తు**



2లో



## 17 మందికి బాల పురస్కారాలు

**ప్రదానం చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**

న్యూఢిల్లీ, డిసెంబరు 26: వివిధ రంగాల్లో అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించి, అద్భుత విజయాలు సాధించిన 17 మంది చిన్నారులు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా గురువారం 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్' అందుకున్నారు. 'వీర్ బాల్ దివస్' సందర్భంగా.. కళలు, సంస్కృతి, ధైర్యసాహసాలు, నూతన ఆవిష్కరణలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, సామాజిక సేవ, క్రీడలు, పర్యావరణం.. ఇలా ఏడు విభాగాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రపతి ఈ పురస్కారంతో సత్కరించారు. దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఏడుగురు బాలురు, 10 మంది బాలికలు అవార్డులతో పాటు పతకం, సర్టిఫికెట్, ప్రశంసాపత్రాలను అందుకున్నారు.

## గ్రూప్-1 పోస్టుల భర్తీకి

# తొలగిన అడ్డంకి

**జీవో 29పై దాఖలైన పిటిషన్ల కొట్టివేత**

**ఆ లెక్కన ఇప్పుడు మరింత ఆలస్యమైంది**

**అదే అంశంపై మళ్లీ విచారణ సబబు కాదు**

హైదరాబాద్, డిసెంబరు 26 (ప్రజాకలం ప్రతినిధి): గ్రూప్-1 మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేసిన విధానం సబబేనని హైకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. జీవో 55 స్థానంలో జీవో 29 అమలును.. మెయిన్స్ పరీక్షలకు అభ్యర్థుల ఎంపికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. గ్రూప్-1 చుట్టూ అలుముకున్న వివాదాలకు ముగింపు పలికి.. ఎంపిక ప్రక్రియకు అడ్డంకులను తొలగించింది. జీవో 29 అమలు, జీవో 96, తెలంగాణ స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్-1996లోని రూల్ 22(2)(ఏ), (బీ) చట్టబద్ధతను సవాల్ చేస్తూ.. దాఖలైన ఎనిమిది వేర్వేరు పిటిషన్లపై విచారణ జరిపిన జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ జి.రాధారాణిల డివిజన్ బెంచ్ గురువారం తుది తీర్పునిచ్చింది. పిటిషన్ దాఖలులో 'ఆలస్యం' కారణంగా హైకోర్టు సింగిల్ జడ్జి, డివిజన్ బెంచ్, సుప్రీంకోర్టు కొట్టివేసిన అంశంపై మళ్లీ విచారణ జరపడం సబబు కాదని వ్యాఖ్యానించింది. "2024 ఫిబ్రవరి 19న కొత్త నోటిఫికేషన్ జారీ అయ్యాక.. దాదాపు ఆర్నెల్ల తర్వాత సింగిల్ జడ్జి వద్ద పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిని సింగిల్ జడ్జి ధర్మాసనం అక్టోబరు 15న కొట్టివేసింది. వాటిపై అప్పీళ్లను అక్టోబరు 18న డివిజన్ బెంచ్ కొట్టివేసింది. పిటిషనర్లు సుప్రీంకోర్టును



ఆశ్రయించగా.. ఈ నెల 6న కొట్టివేసింది. సింగిల్‌బెంచ్ 'ఆలస్యం' అనే కారణాన్ని స్పష్టంగా పేర్కొన్నాక.. ఇప్పుడు మరింత ఆలస్యం జరిగింది. ఒకసారి తీవ్ర ఆలస్యంపై నిర్ధారణ జరిగాక.. మళ్లీ అదే అంశంపై విచారణ సబబు కాదు" అని ధర్మాసనం స్పష్టం చేసింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు పదిరోజుల క్రితం వాదనల సందర్భంగా.. "గతంలో హైకోర్టు ప్రాథమిక పరీక్షను మళ్లీ నిర్వహించాలని చెప్పిందే తప్ప.. పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసి, కొత్త నోటిఫికేషన్ ఇవ్వమని చెప్పలేదు.

తరువాయి 2వ పేజీలో...

## సంస్కరణల రూపశిల్పి..

# అస్తమయం

మొదటి పేజీ తరువాయి...కార్యక్రమాలనూ రద్దు చేసుకుంటున్నట్టు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. 2025 జనవరి 3న పార్టీ కార్యకలాపాలు మళ్లీ ప్రారంభమవుతాయని కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ తెలిపారు. అప్పటిదాకా పార్టీ జెండాను అవనతం చేస్తామని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. కాగా.. మన్మోహన్ సింగ్ పార్థివ దేహాన్ని గురువారం రాత్రే ఎయిమ్స్ ఆస్పత్రి నుంచి ఆయన నివాసానికి తరలించారు. మన్మోహన్ మృతిపట్ల సంతాపం తెలిపిన ప్రధాని మోదీ.. ఆయనకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఆ ఏర్పాట్లపై చర్చించేందుకు కేంద్ర క్యాబినెట్ శుక్రవారం ఉదయం 11 గంటలకు సమావేశం కానుంది. కాగా.. ఆయన గౌరవార్థం కేంద్రం ఏడురోజులు జాతీయ సంతాపదినాలుగా ప్రకటించింది.

**మోహనా.. మోహనా..**

నెహ్రూ అంతటి వ్యక్తే స్వయంగా పిలిచినా.. 'నేను పాఠాలు చెప్పుకొంటాను తప్ప, రాజకీయాల్లోకి రాను' అన్న మన్మోహన్.. ప్రస్తుత పాకిస్థాన్‌లోని గహ్‌లో 1932 సెప్టెంబరు 26న గురుముఖ్ సింగ్ కోహ్లీ, అమృత్‌కౌర్ దంపతులకు జన్మించారు. చిన్నవయసులోనే తల్లి చనిపోవడంతో.. మన్మోహన్ తన అమ్మమ్మ జమ్నాదేవి వద్దే పెరిగారు. చిన్నతనంలో అందరూ ఆయనను ముద్దుగా మోహనా.. మోహనా అని పిలిచేవారు. ఆయన పెరిగిన ఊళ్లో స్కూలు కూడా లేదు. రోజూ స్నేహితుడితో కలిసి 5 కిలోమీటర్లు నడిచి వెళ్లి చదువుకున్నారు. పదో ఏడు వచ్చేదాకా ఆయన విద్యాభ్యాసం ఉర్దూ మాధ్యమంలోనే జరిగింది. అందుకే.. ఆయన జీవితమంతా తన హిందీ ప్రసంగాలను కూడా ఉర్దూలోనే రాసుకుని చదివేవారు (కొన్నికొన్నిసార్లు తన మాతృభాష అయిన పంజాబీలో రాయడానికి గురుముఖి లిపిని వాడేవారు). దేశ విభజన సమయంలో ఆయన కుటుంబం పాకిస్థాన్ నుంచి ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ నగరానికి వచ్చింది. ఆ తర్వాత ఏడాదికే.. అంటే 1948లో అమృత్‌సర్‌కు వెళ్లి అక్కడ స్థిరపడింది. మన్మోహన్ అక్కడే హిందూ కాలేజీలో చేరారు. పంజాబ్ యూనివర్సిటీలో ఆర్థిక శాస్త్రంలో డిగ్రీ (1952లో), పీజీ (1954లో) పూర్తి చేశారు. 1957లో కేంబ్రిడ్జి వర్సిటీలో ఆర్థికశాస్త్రంలో ఆనర్స్ పూర్తిచేశారు. పాఠశాల స్థాయి నుంచి కేంబ్రిడ్జి దాకా.. చదువులో ఆయన ఎప్పుడూ టాపరే. స్కాలర్‌షిప్పుతోనే ఆయన చదువులన్నీ సాగాయి.

డాక్టరేట్ చేసిన తొలి భారత ప్రధాని కూడా ఆయనే. మానవ జీవితాలను రాజకీయాలు ఎలా ప్రభావితం చేస్తాయనే విషయాన్ని తాను కేంబ్రిడ్జి వర్సిటీలో ఉన్న రోజుల్లోనే తెలుసుకున్నానని మన్మోహన్ 2005లో ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. కేంబ్రిడ్జిలో ఉన్నత విద్య పూర్తిచేసుకున్న అనంతరం భారతదేశానికి తిరిగివచ్చిన ఆయన.. పంజాబ్ వర్సిటీలో విద్యార్థులకు పాఠాలు చెప్పారు. మళ్లీ 1960లో ఇంగ్లండ్‌కు వెళ్లి ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలో డీఫిల్ చేశారు. 'ఇండియాస్ ఎక్స్‌పోర్ట్ పెర్ఫార్మెన్స్, 1951-1960, ఎక్స్‌పోర్ట్ ప్రాస్పెక్ట్స్ అండ్ పాలసీ ఇంప్లికేషన్స్' అనే అంశంపై డాక్టొరల్ థీసిస్ రాశారు. దరిమిలా ఆ థీసిస్ ఆధారంగానే.. 'ఇండియాస్ ఎక్స్‌పోర్ట్ ట్రెండ్స్ అండ్ ప్రాస్పెక్ట్స్ ఫర్ సెల్ఫ్ సస్టెయిన్డ్ గ్రోత్' అనే పుస్తకం రాశారు. డీఫిల్ పూర్తయ్యాక మళ్లీ ఇండియాకు తిరిగొచ్చి పంజాబ్ వర్సిటీలో రీడర్‌గా పనిచేశారు. 1963 నుంచి 1965 దాకా ఆర్థిక శాస్త్ర ఆచార్యుడిగా వ్యవహరించారు. 1966 నుంచి 1969 దాకా 'యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్'కు పనిచేశారు. ఆర్థికవేత్తగా ఆయన ప్రతిభను గుర్తించిన అప్పటి కాంగ్రెస్ ఎంపీ లలిత్‌నారాయణ్ మిశ్రా.. ఆయన్ను విదేశీ వాణిజ్య శాఖలో సలహాదారుగా నియమించారు. బ్యూరోక్రాట్‌గా మన్మోహన్ ప్రస్థానం అలా ప్రారంభమైంది. 1969 నుంచి 1971 దాకా 'ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్'లో ప్రొఫెసర్‌గా అంతర్జాతీయ వాణిజ్యానికి సంబంధించిన పాఠాలు బోధించారాయన.

**ప్రభుత్వంలోకి..**

1972లో ఆర్థిక శాఖ ప్రధాన ఆర్థిక సలహాదారుగా.. 1976లో ఆర్థిక శాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. 1980-1982 నడుమ ప్రణాళిక సంఘంలో పనిచేసిన మన్మోహన్‌ను.. 1982లో నాటి కేంద్ర ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్‌గా నియమించారు. 1985 దాకా ఆయన ఆ పదవిలో కొనసాగారు. 1985-87 నడుమ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. 1987 నుంచి 1990 దాకా జెనీవాలోని ఎకనమిక్ పాలసీ థింక్ ట్యాంక్ 'సౌత్ కమిషన్'కు సెక్రటరీ జనరల్‌గా వ్యవహరించారు. 1990 నవంబరులో భారత్‌కు తిరిగొచ్చి.. అప్పటి ప్రధాని చంద్రశేఖర్‌కు ఆర్థిక వ్యవహారాల సలహాదారుగా పనిచేశారు. 1991లో ప్రభుత్వం ఆయన్ను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్‌గా నియమించింది. 1991 జూన్‌లో.. మైనారిటీ ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన నాటి ప్రధాని పీవీ నరసింహారావు దేశాన్ని సంస్కరణల పథంలో నడపాలంటే మన్మోహన్ వంటి ఆర్థికవేత్త అవసరమని భావించి ఆయనకు ఆర్థిక శాఖ బాధ్యతలు అప్పగించారు! తొలుత ఆ విషయాన్ని ప్రిన్సిపల్ సెక్రటరీ ద్వారా మన్మోహన్‌కు పీవీ తెలియపరచగా.. ఆయన దాన్ని అంత సీరియస్‌గా తీసుకోలేదు. దాంతో పీవీ.. వెంటనే చక్కగా తయారై రాష్ట్రపతి భవన్‌కు రావాలంటూ మన్మోహన్‌ను ఆదేశించారు. అలా రాష్ట్రపతి భవన్‌కు వెళ్లిన మన్మోహన్‌తో మంత్రిగా ప్రమాణం చేయించి.. ఆర్థిక శాఖను అప్పజెప్పారు! ఆయన ఆర్థిక శాఖ పగ్గాలు చేపట్టేనాటికి మన దేశ ద్రవ్యలోటు జీడీపీలో 8.5 శాతానికి.. కరెంటు ఖాతా లోటు 3.5శాతానికి దగ్గర్లో ఉన్నాయి. మన విదేశీ మారక నిల్వలు కేవలం 2వారాల దిగుమతులకు సరిపడా మాత్రమే (దాదాపు 100 కోట్ల డాలర్లు) ఉన్నాయి!! అలాంటి ఆర్థిక వ్యవస్థను ఆయన.. ప్రధాని పీవీ సహకారంతో సంస్కరణల పథంలో నడిపించి గాడిన పెట్టారు. పర్మిట్‌రాజ్‌కు చుక్క పెట్టి.. ఆర్థికవ్యవస్థను సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ(ఎల్‌పీజీ) బాట పట్టించి దేశ ఆర్థిక ముఖచిత్రాన్నే మార్చేశారు. 2009లో ప్రధానిగా ఆయన తొలి పదవీకాలం పూర్తిచేసే సమయానికి మన విదేశీ మారక నిల్వలు ఏకంగా 600 బిలియన్ డాలర్లకు చేరాయంటే.. నాడు ఆర్థిక మంత్రిగా ఆయన తీసుకున్న నిర్ణయాలే అందుకు పునాదిరాళ్లనడంలో సందేహం లేదు.

**ప్రధానిగా..**

అనూహ్య పరిస్థితుల్లో 2004 మే 22న ప్రధానమంత్రిగా పగ్గాలు చేపట్టిన మన్మోహన్ సింగ్.. 2014 దాకా ఆ పదవిలో కొనసాగారు. ఆర్థిక మంత్రి హోదాలో కొనసాగించిన పాత ఒరవడినే అందిపుచ్చుకుని సంస్కరణల పథంలో ముందుకు సాగారు. దీంతో అనతికాలంలోనే మన ఆర్థిక వృద్ధిరేటు పెరగడం ప్రారంభించి.. 2007లో అత్యధికంగా 9శాతం మైలురాయిని దాటింది. ఆయన హయాంలో వచ్చిన జాతీయ ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు చట్టం దేశచరిత్రలోనే కొత్త అధ్యాయలను లిఖించాయి! వాజపేయి హయాంలో ప్రారంభించిన స్వర్ణచతుర్భుజి వంటి కార్యక్రమాలను మన్మోహన్ సర్కారు కొనసాగించడంతో అభివృద్ధి ఎక్కడా కుంటుపడలేదు. 2009లో ఆయన హయాంలోనే విద్యాహక్కుచట్టం అమల్లోకి వచ్చింది. ఏపీ (ఉమ్మడి), బిహార్, గుజరాత్, ఒడిశా, పంజాబ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో 8 ఐఐటీ విద్యాసంస్థలు ప్రారంభమయ్యాయి. అలా పదేళ్లపాటు ప్రధానిగా దేశాన్ని ప్రగతిపథంలో నడిపిన మన్మోహన్ సింగ్ పదవీకాలం 2014 మే 17న ముగిసింది. 1991 అక్టోబరు 1 నుంచి 2024 దాకా 33 ఏళ్లపాటు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగిన ఆయన రాజకీయ ప్రస్థానం.. ఈ ఏడాది ఏప్రిల్ 3వ తేదీతో ముగిసింది. దేశ తొలి సిక్కు ప్రధానిగా.. నెహ్రూ తర్వాత ఐదేళ్ల పదవీకాలం పూర్తయ్యాక మళ్లీ ప్రధాని పదవి చేపట్టిన తొలి నేతగా.. నెహ్రూ, ఇందిరాగాంధీ, మోదీ తర్వాత ఎక్కువకాలం ప్రధాని పదవిలో ఉన్న నాయకుడిగా.. ఎన్నో ఘనతలు సాధించిన ఆయన దేశ ప్రజల మనోయవనికలపై తనదైన చెరగని ముద్ర వేశారు!

# కామారెడ్డిలో మూకుమ్మడి ఆత్మహత్యలు?

**మృతుల్లో బిక్కనూరు ఎస్సై, మహిళా కానిస్టేబుల్, మరో యువకుడు**
**అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్దచెరువులో ఘటన**
**తొలుత కానిస్టేబుల్, యువకుడి మృతదేహాలు చెరువు నుంచి వెలికితీత**
**తాజాగా ఎస్సై మృతదేహం కూడా.. మృతికి గల కారణాలపై దర్యాప్తు**



కామారెడ్డి, డిసెంబరు 26 (ప్రజాకలం ప్రతినిధి): ప్రేమ వ్యవహారమో ? వివాహేతర సంబంధమో ? మరేదైనా కారణమో స్పష్టత లేదు కానీ... ఓ ఎస్సై, ఓ మహిళా కానిస్టేబుల్, మరో యువకుడు కామారెడ్డి జిల్లాలోని ఓ చెరువులో శవాలై కనిపించారు. మూకుమ్మడి ఆత్మహత్యలుగా భావిస్తున్న ఈ ఘటన కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం కుప్రియల్ గ్రామ శివారులోని అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్దచెరువు వద్ద బుధవారం జరిగింది. ఈ ఘటనలో బీబీపేట పోలీసు స్టేషన్ మహిళా కానిస్టేబుల్ శ్రుతి(25), బీబీపేట సొసైటీ కాంట్రాక్ట్ కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్ (28) మృతదేహాలను పోలీసులు బుధవారమే గుర్తించారు. బుధవారం నుంచి ఆచూకీ లేకుండా పోయిన భిక్కనూరు ఎస్సై సాతెల్లి సాయికుమార్ (32) మృతదేహం గురువారం ఉదయం లభ్యమైంది. కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను సంబంధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు. మెదక్ జిల్లా కొల్చారం గ్రామానికి చెందిన సాయికుమార్ 2018లో ఎస్సై అయ్యారు. ప్రస్తుతం భిక్కనూరు ఎస్సైగా ఉన్న సాయికుమార్ గతంలో సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం, కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం, బీబీపేట పోలీసుస్టేషన్లలో ఎస్సైగా పని చేశారు. సాయికుమార్‌కు భార్య లక్ష్మి, కొడుకు శ్రీహన్ష్ ఉన్నారు. 2014 బ్యాచ్‌కు చెందిన శ్రుతి గతంలో ఓ వ్యక్తిని వివాహం చేసుకుని విడాకులు తీసుకుంది. మూడేళ్లుగా బీబీపేట పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తుంది.

**ప్రేమ వ్యవహారమేనా ?-** బుధవారం మధ్యాహ్నం వరకు విధుల్లో ఉన్న ఎస్సై సాయికుమార్ ఆ తర్వాత తన సొంత కారులో కామారెడ్డి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లి శ్రుతి, నిఖిల్‌ను కలిసినట్టు పోలీసులు ప్రాథమిక విచారణలో తేలింది. అక్కడి నుంచి ఈ ముగ్గురు కలిసి అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్దచెరువు వైపు వెళ్లినట్లు గుర్తించారు. బీబీపేట పోలీసు స్టేషన్‌లో పని చేసినప్పటి నుంచి సాయికుమార్‌కు శ్రుతితో పరిచయం ఉందని, ఇరువురి మధ్య వివాహేతర సంబంధం ఉందనే ప్రచారమూ ఉంది. సాయికుమార్‌కు భిక్కనూరుకు బదిలీ అయిన తర్వాత శ్రుతికి నిఖిల్ దగ్గరయ్యాడని, ఇరువురు పెళ్లి చేసుకోవాలని అనుకున్నారని తెలుస్తోంది. ఈ క్రమంలో బుధవారం వీరి మధ్య వాగ్వాదం జరగ్గా క్షణికావేశంలో శ్రుతి చెరువులో దూకే యత్నం చేయగా సాయికుమార్, నిఖిల్ ఆమెను అడ్డుకున్నారని ఘటనాస్థలిలో లభించిన ఆనవాళ్ల ఆధారంగా పోలీసులు అనుకుంటున్నారు. అయినా వారిని విడిపించుకుని శ్రుతి చెరువులోకి దూకగా.. ఆమెను కాపాడేందుకు సాయికుమార్, నిఖిల్ కూడా నీళ్లలోకి దూకి పిచ్చి మొక్కలు, నాచు తీగల మధ్య చిక్కుకుపోయి ఊపిరాడక ప్రాణాలు కోల్పోయి ఉంటారని భావిస్తున్నారు. మృతదేహాలకు పిచ్చి మొక్కలు, నాచు తీగలు చుట్టుకుని ఉండడంతో ఈ అంచనాకు వచ్చారు. అయితే, ముగ్గురూ చనిపోవడంతో వారి ఫోన్ కాల్ డేటా ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ముగ్గురి మరణానికి గల కారణాన్ని త్వరలోనే వెల్లడిస్తామని జిల్లా ఎస్పీ సింధూ శర్మ గురువారం విలేకరులతో అన్నారు. కాగా, శ్రుతి ముఖంపై గాయాలున్నాయని సాయికుమార్, నిఖిల్ కలిసి ఆమెను హత్య చేసి ఉంటారని శ్రుతి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఇక, ఎస్సై సాయికుమార్ మృతదేహానికి నివాళులర్పించిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.

**అసలు ఏం జరిగిందంటే ?**

ఎస్సై సాయికుమార్, కానిస్టేబుల్ శ్రుతి, కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్ మరణాలపై భిన్నకథనాలు వినిపిస్తున్నాయి. బుధవారం విధులకు హాజరైన శ్రుతి రాత్రయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆమె తల్లి పోలీసులను ఆశ్రయించారు. శ్రుతి ఫోన్ స్విచ్ఛాఫ్ లో ఉండడంతో మొబైల్ సిగ్నల్స్ ఆధారంగా ఆమె చివరిగా పెద్ద చెరువు వద్ద ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. అక్కడికి వెళ్లి చూడగా శ్రుతి, నిఖిల్‌కు చెందిన వస్తువులతో పాటు భిక్కనూరు ఎస్సై కారు ఉన్నాయి. అర్ధరాత్రి అయినా చెరువులో గాలించగా శ్రుతి, నిఖిల్ మృతదేహాలు దొరికాయి. సాయికుమార్ ఆచూకీ లభించకపోవడంతో అనే అనుమానాలు తలెత్తాయి. అయితే, గురువారం ఉదయం సాయికుమార్ మృతదేహం కూడా అదే చెరువులో దొరికింది.

## గ్రూప్-1 పోస్టుల భర్తీకి

# తొలగిన అడ్డంకి

మొదటి పేజీ తరువాయి...

పాత దాన్ని రద్దు చేసి, కొత్త నోటిఫికేషన్ ఇవ్వడమే కాకుండా పోస్టులను 503 నుంచి 563కు పెంచారు. గేమ్ రూల్స్‌ను మధ్యలో మారుస్తూ.. చట్టవిరుద్ధంగా జీవో 29ను తీసుకొచ్చారు. గతంలో జీవో 55ని సమర్థించిన ప్రభుత్వం.. ఇప్పుడు జీవో 29ను అమలు చేయడం చెల్లదు. రిజర్వుడ్ కేటగిరీ అభ్యర్థికి ఎక్కువ మార్కులు వస్తే జనరల్ కోటాలో బెర్త్ దక్కాలి. మధ్యలో రూల్స్‌ను మార్చడం వల్ల 1:50 నిష్పత్తికి విరుద్ధంగా ఎక్కువ మంది అభ్యర్థులు మెయిన్స్‌కి ఎంపికయ్యారు" అని పేర్కొన్నారు. ప్రభుత్వం, టీజీపీఎస్సీ తరఫున న్యాయవాదులు తమ వాదనలను వినిపిస్తూ.. కొత్త ప్రభుత్వం ఇచ్చిన కొత్త నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని దాఖలైన పిటిషన్లను హైకోర్టు సింగిల్, డివిజన్ బెంచ్‌లు, సుప్రీంకోర్టు కొట్టేసిన తర్వాత.. మళ్లీ వివాదానికి తావులేదని పేర్కొన్నారు. "కొత్త ప్రభుత్వం జారీచేసిన జీవో 29.. సుప్రీంకోర్టు 'బాలోజీ బదావత్' కేసులో ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా.. చట్టానికి లోబడి ఉంది. కోర్టు తీర్పులకు అనుగుణంగానే 1967 నుంచి కొత్త జీవోలు వస్తున్నాయి. జనరల్ విభాగంలో ఎంపికైన చిట్టచివరి వ్యక్తి కంటే.. రిజర్వుడు అభ్యర్థికి ఎక్కువ మార్కులు వస్తే.. సదరు అభ్యర్థికి కచ్చితంగా జనరల్ విభాగంలోనే బెర్త్ దక్కుతుంది" అని స్పష్టంచేశారు. వాదనలను విన్న ధర్మాసనం.. "ఇంతకుముందు రౌండ్ లిటిగేషన్‌లో పిటిషన్ల దాఖలులో తీవ్ర ఆలస్యం, అశ్రద్ధ జరిగిందని ఇదే కోర్టు స్పష్టంచేసిన తర్వాత.. అంతకంటే ఆలస్యంగా దాఖలైన ప్రస్తుత పిటిషన్లను అనుమతించడంలో అర్థం లేదు. కొత్త నోటిఫికేషన్‌ను రద్దు చేసి, 2022 నాటి పాత నోటిఫికేషన్‌ను పునరుద్ధరించడం.. అందులో పేర్కొన్న ఎంపిక ప్రక్రియను అనుసరించాలని ఆదేశించడం కుదరనే కుదరదు.

ఈ తరహా స్వభావం ఉన్న కేసుల్లో ఒక్క రోజు ఆలస్యం కూడా లెక్కలోకి వస్తుంది. ఎందుకు ఆలస్యం జరిగింది? అనేదానికి పిటిషనర్లు సరైన వివరణ ఇవ్వలేదు" అని వ్యాఖ్యానించింది. పిటిషన్‌లను కొట్టివేస్తూ.. తుది తీర్పు వెలువరించింది.

**త్వరలో ఫలితాలు?**

కేసు అడ్డంకి తొలగిపోయిన నేపథ్యంలో టీజీపీఎస్సీ త్వరలో ఫలితాలను విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. భారీ సంఖ్యలో అభ్యర్థులు పరీక్షకు హాజరైన నేపథ్యంలో.. వాల్యుయేషన్‌కు నెలల సమయం పడుతుంది. అయితే.. టీజీపీఎస్సీ ఆగమేఘాల మీద ఆ ప్రక్రియను పూర్తిచేస్తున్నట్లు తెలుస్తోంది. నిజానికి ఫిబ్రవరి లేదా మార్చిలో మెయిన్స్ ఫలితాలు వస్తాయనే అంచనాలున్నా.. త్వరలో వాటిని విడుదల చేసే దిశలో టీజీపీఎస్సీ అడుగులు వేస్తున్నట్లు తెలిసింది.

**గ్రూప్-1 కేసు సాగిందిలా..**

బీఆర్ఎస్ హయాంలో 2022 ఏప్రిల్‌లో 503 పోస్టులతో గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల

అదే ఏడాది అక్టోబరు 16న ప్రిలిమ్స్ నిర్వహణ. ఆ తర్వాత లీకేజీ కారణంతో పరీక్షల రద్దు

2023 జూన్‌లో రెండోసారి ప్రిలిమ్స్ నిర్వహణ. బయోమెట్రిక్ తీసుకోలేదనే కారణంతో.. రద్దు చేసిన హైకోర్టు. తర్వాత ప్రభుత్వం మార్పు

2024 ఫిబ్రవరి 19న ప్రభుత్వం పాత నోటిఫికేషన్‌ను రద్దుచేసి.. మరో 63 పోస్టులను చేరుస్తూ.. 563 పోస్టులతో కొత్త నోటిఫికేషన్‌ను విడుదల చేసింది

ఈ ఏడాది జూన్ 9న ప్రిలిమ్స్ నిర్వహణ. మెయిన్స్‌కు అభ్యర్థుల ఎంపిక. అక్టోబరు 21 నుంచి 27 వరకు మెయిన్స్ షెడ్యూల్ ఖరారు

కొత్త నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ జూలై 31న హైకోర్టు సింగిల్ బెంచ్ వద్ద పిటిషన్ల దాఖలు. అక్టోబరు 15న ఆ పిటిషన్లను కొట్టివేసిన ధర్మాసనం

ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన అప్పీళ్లను అక్టోబరు 18న కొట్టివేసిన డివిజన్ బెంచ్. డివిజన్ బెంచ్‌లో ఎనిమిది పిటిషన్లు

సుప్రీంకోర్టును ఆశ్రయించిన పిటిషనర్లు.. ఈ నెల 6న కొట్టేసిన ధర్మాసనం

ఈ నెల 26న జీవో 29, ఇతర అంశాలపై దాఖలైన 8 పిటిషన్ల కొట్టివేతతో.. ఫలితాల విడుదలకు మార్గం సుగమం



## ఇకపై సినిమా బెనిఫిట్ షోలకు

# అనుమతించం

## సీఎంగా చట్టాన్ని అమలు చేస్తా : సీఎం రేవంత్

**అసెంబ్లీలో చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నా.. చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తాం.. పద్ధతిగా ఉండండి**
**సీఎం పేరు చెప్పనందుకే కేసు అని ప్రచారం చేస్తారా?.. ఎప్పుడో ఆ స్థాయి దాటాం.. మీరెందుకు ఖండించలే?**
**సామాజిక బాధ్యతను సినీ పరిశ్రమ గుర్తుపెట్టుకోవాలి.. డ్రగ్స్, గంజాయి నిరోధానికి ప్రచారం చేయాలి**

హైదరాబాద్, డిసెంబరు 26 (ప్రజాకలం ప్రతినిధి):: ఇకపై సినిమా బెనిఫిట్ షోలకు అనుమతులు ఇవ్వబోమని.. అసెంబ్లీలో ఈమేరకు తాను చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సినీ పెద్దలకు తేల్చిచెప్పారు. అయితే.. చిత్ర పరిశ్రమకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుందని, పరిశ్రమ కూడా సామాజిక బాధ్యత నిర్వర్తించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. అల్లు అర్జున్ కేసు విషయాన్ని ప్రస్తావించిన సీఎం.. బన్నీ తన పేరును మర్చిపోవడం వల్ల కేసు పెట్టారంటూ తప్పుడు ప్రచారం చేశారని, తాను ఆ స్థాయిని ఎప్పుడో దాటివచ్చేశానని పేర్కొన్నారు. 'ఆ తప్పుడు ప్రచారాన్ని మీరెందుకు ఖండించలేదు?' అని ఇండస్ట్రీ పెద్దలను రేవంత్ సూటిగా ప్రశ్నించినట్టు తెలిసింది. పరిశ్రమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తరఫున మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేస్తున్నామని.. పరిశ్రమ తరఫున కూడా ఒక కమిటీని ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. గురువారం హైదరాబాద్, బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్‌రాజు ఆధ్వర్యంలో పలువురు సినిమా ప్రముఖులు సీఎం రేవంత్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో సీఎంతోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర డీజీపీ జితేందర్ ఉన్నారు. పరిశ్రమ సమస్యలతోపాటు పలు అంశాలపై సినీ ప్రముఖులు తమ అభిప్రాయాలను రేవంత్‌కు తెలిపారు. అనంతరం మాట్లాడిన ముఖ్యమంత్రి.. తమ ప్రభుత్వం పరిశ్రమకు ఎప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సినిమా స్టూడియోలకు స్థలాలు, పరిశ్రమవారికి నివాస స్థలాలు, ఫిల్మ్‌నగర్, చిత్రపురి కాలనీ, కార్మికులకు ఇండ్లు, ఇతర సౌకర్యాలను గతంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలే అందించాయని గుర్తుచేశారు. అదే సహకారాన్ని, ఆ వారసత్వాన్ని తాము కూడా కొనసాగిస్తామని భరోసానిచ్చారు. తెలుగు సినిమా పరిశ్రమకు ప్రపంచవ్యాప్తంగా ఒక బ్రాండ్ క్రియేట్ చేయాలని నిర్ణయం తీసుకున్నామని, పరిశ్రమ బాగుండాలని కోరుకుంటున్నామని అన్నారు. ఐటీ, ఫార్మా రంగాలు ఎంత ముఖ్యమో.. సినీ రంగం కూడా ప్రభుత్వానికి అంతే ముఖ్యమని తెలిపారు. రాష్ట్రంలో సినీ పరిశ్రమకు ప్రభుత్వం తరఫున అవార్డులు ఇవ్వడం లేదని తెలిసి 'గద్దర్' పేరిట అవార్డులను ఇచ్చేలా కొత్త ఒరవడిని తీసుకొచ్చామని.. ప్రభుత్వానికి, పరిశ్రమకు అనుసంధానకర్తగా ఉండేందుకు దిల్‌రాజును ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించామని గుర్తుచేశారు. దేశంలోని కాస్మోపాలిటన్ నగరాల్లో హైదరాబాద్ ఉత్తమమైనదని.. ఇక నుంచి హాలీవుడ్, బాలీవుడ్ వాళ్లు కూడా హైదరాబాద్‌కు వచ్చేలా చర్యలు చేపడుతామని చెప్పారు. ఇందుకోసం త్వరలో హైదరాబాద్‌లో పెద్ద సదస్సు ఏర్పాటుచేసి ఇతర సినిమా పరిశ్రమలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఎకో టూరిజం, టెంపుల్ టూరిజాన్ని ప్రమోట్ చేయాలని.. గంజాయి, డ్రగ్స్ నిరోధంతో పాటు సామాజిక అంశాలపైనా సినిమా పరిశ్రమ ప్రచారం చేయాలని సూచించారు. "సినిమా వాళ్లు ఫంక్షన్లు చేసుకోవచ్చు మాకు ఏమీ అభ్యంతరం లేదు, అన్ని అనుమతులూ ఇస్తాం. కానీ అభిమానులను నియంత్రించే వ్యవహారాన్ని నిర్వాహకులు, సెలబ్రిటీలే చూసుకోవాలి. బౌన్సర్లు పోలీసు అధికారులనే అడ్డుకుంటున్నారు. దానిని ఎట్టి పరిస్థితుల్లో సహించం. అలా అడ్డుకుంటే బౌన్సర్ల తో పాటు.. సెలబ్రిటీలపైనా కేసులు పెడతాం" అని కూడా సీఎం అన్నట్టు సమాచారం.

**అది నా బాధ్యత**

సినీ పరిశ్రమ అభివృద్ధికి మొదటి తరంలో నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్), మర్రి చెన్నారెడ్డి, రెండో తరంలో చంద్రబాబు, వైఎస్ సహకరించారని సీఎం గుర్తుచేశారు. ఇప్పుడు మూడో తరంలో ఉన్న తమ ప్రభుత్వం కూడా అదే సహకారాన్ని అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా సినీ కార్మికుల సంక్షేమానికి ప్రభాకర్‌రెడ్డి చేసిన సేవలను సీఎం గుర్తుచేసుకున్నారు. ఇండస్ట్రీలో చిరంజీవి కష్టపడి కిందిస్థాయి నుంచి ఎదుగుతూ మెగాస్టార్ స్థాయికి చేరారని, తాను కూడా కిందిస్థాయి నుంచి సీఎం స్థాయి వరకు ఎదిగానని అన్నారు. ఎవరి లక్ష్యాలు, గమ్యాలు వారికి ఉన్నాయి కాబట్టే ఇక్కడవరకు చేరుకోగలిగామని, ఎవరి స్టైల్ వారికి ఉంటుందని వ్యాఖ్యానించారు. సినిమా వారికి రాజకీయాలతో సంబంధంలేదని, ఆ సంగతి తాము చూసుకుంటామని సీఎం ఒక దశలో కొంత ఘాటుగా చెప్పినట్టు తెలిసింది. ముఖ్యమంత్రిగా చట్టాన్ని అమలుచేయాల్సిన బాధ్యత తనపై ఉందని.. అందరినీ సమానంగా చూడడమే తప్ప, ఎవరిపైనా తనకు వ్యక్తిగత ఇష్టాయిష్టాలు లేవని ఈ భేటీలో ఆయన స్పష్టం చేశారు. ఒక్క తెలుగుకే పరిమితం కాకుండా అన్ని భాషల సినిమాల నిర్మాణానికీ ఇక్కడ అవకాశం ఉండేలా అందరం కలిసి అభివృద్ధి చేద్దామన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో, ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని సినీ పరిశ్రమకు పిలుపునిచ్చారు. అల్లు అర్జున్, రామ్‌చరణ్, రానా చిన్నప్పటి నుంచి తనకు తెలుసని.. ఇప్పుడు సూపర్‌స్టార్లుగా ఎదిగిన ఆ ముగ్గుర్నీ చూస్తుంటే సంతోషంతోపాటు గర్వంగా కూడా ఉందని సీఎం పేర్కొన్నారు. తమ ప్రభుత్వం 8 సినిమాలకు ప్రత్యేక జీవోలు ఇచ్చిందని, 'పుష్ప' సినిమాకు పోలీసు భద్రత ఇచ్చామని గుర్తుచేశారు. అయినా.. ప్రభుత్వానికి, పరిశ్రమకు మధ్యదూరం పెరిగిందనే ప్రచారం జరుగుతోందని.. అలాంటి ప్రచారానికి ఆస్కారం ఇవ్వొద్దని సూచించారు. ఇలాంటి ప్రచారం వల్ల ప్రభుత్వానికంటే పరిశ్రమకే ఎక్కువ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు.



గళం మీద కలం మాది

మీ ప్రాంతంలో ఏ సమస్యనైనా పరిష్కరించడానికి 'ప్రజాకలం' మీకు తోడుగా ఉంటుంది. మీ సమస్యల వివరాలను, పోటోలను మాకు వాట్సప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

జగిత్యాల: 94403 52123
పెద్దపల్లి :9849007793,9121348522
మెట్‌పల్లి : 95535 39999
రుద్రంగి : 86888 05981
బుగ్గారం : 99897 94948
గోదావరిఖని : 99899 35750
సిరిసిల్ల : 9014368563

◆ కరీంనగర్ ◆ జగిత్యాల ◆ పెద్దపల్లి ◆





ప్రజాకలం

◆ ఉమ్మడి కరీంనగర్ ◆

శుక్రవారం, డిసెంబర్ 27, 2024




## మోటార్ల వైర్లు దొంగలించిన గుర్తు తెలియని వ్యక్తులు



గొల్లపెల్లి డిసెంబర్ 26 ప్రజాకలం ప్రతినిధి మండలంలోని లోత్తునూర్ గ్రామ శివారు వద్ద ఉన్నా వాగు దగ్గర రైతుల మోటార్ల కరెంట్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు బుదవారం రాత్రి సమయంలో దొంగలించారు ఉదయాన్నే రైతులు పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి మోటార్ స్విచ్ ఆన్ చేయగా స్టార్ట్ కాకపోవడంతో రైతులు చూడగా వైర్లు కట్ చేసి ఉన్నాయి మిగతా రైతులు చూడగా వారివి కూడా లేకపోవడంతో రైతులు ఆశ్చర్యానికి గురైయ్యారు సుమారు పదిహేను నుండి ఇరవై రైతుల మోటర్ల వైర్లు దొంగలించారు

## పేదలకు వరం సీఎం సహాయ నిధి

**- సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణి చేసిన సుజిత్ రావు**



మెట్ పల్లి: ప్రతినిధి డిసెంబర్ 26 (ప్రజా కలం) నిరుపేదలకు సీఎం సహాయనిధి వరంలాంటిదని సుజిత్ రావు అన్నారు.గురువారం మెట్ పల్లి లోని వారి నివాసంలో సీఎం సహాయ నిధి చెక్కులను ఇద్దరి లబ్ధిదారులకు రూ 1,00,000 ఒక లక్ష రూపాయల విలువ గల చెక్కులను టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు లబ్ధిదారులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్,మహమ్మద్ రహీమ్,కల్లెద గంగాధర్,బైండ్ల శ్రీకాంత్,మొగిలి రాజేందర్,అల్లా బకాష్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా వేం నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు




మెట్ పల్లి: ప్రతినిధి డిసెంబర్ 26 (ప్రజా కలం) పట్టణంలోని సుజిత్ రావు నివాసంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్,పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఖుతుబ్ పాషా,జిల్లా సేవాదళ్ అధ్యక్షులు అందె మారుతీ,జిల్లా యూత్ కాంగ్రెస్ మీడియా కోఆర్డినేటర్ కూన రాకేష్,జిల్లా ఎన్ ఎస్ యూ ఐ వర్కింగ్ ప్రెసిడెంట్ బిర్కుల విజయ్ పటేల్ ఎన్ ఎస్ యూ ఐ జిల్లా ఉపాధ్యక్షులు పోల్కం శివ, నియోజకవర్గ ఎన్ ఎస్ యూ ఐ వర్కింగ్ ప్రెసిడెంట్ గద్దల భరత్ రాజ్, ఎన్ ఎస్ యూ ఐ పట్టణ ఉపాధ్యక్షులు సమీర్ సర్కార్,యండి జాఫర్,బైండ్ల శ్రీకాంత్,కోరే రాజ్ కుమార్,మోక్షిత్,మణిదీప్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ ఎస్ యూ ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజెన్లకు ప్రభుత్వం భరోసానిచ్చింది

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



మెట్ పల్లి: (కోరుట్ల) డిసెంబర్ 26: (ప్రజా కలం):ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తల్లిదండ్రుల,వృద్ధుల పోషణ సంక్షేమ చట్టాన్ని పకడ్బందీగా అమలుకు చర్యలు చేపట్టిందని వేములవాడ ఎమ్మెల్యే ,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.గురువారం కోరుట్ల పట్టణంలోని జీ.ఎస్.గార్డెన్స్ లో తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ఆధ్వర్యంలో ముద్రించిన సీనియర్ సిటీజేన్స్ పిలుపు ప్రారంభ మాస పత్రికలను వేములవాడ ఎమ్మెల్యే ,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి రెవెన్యూ డివిజన్ లో ఆర్డీవో ల ఆధ్వర్యంలో ట్రిబ్యునల్స్ ద్వారా నిరాదరణకు గురైన తల్లిదండ్రులైన వృద్ధుల కేసులను సత్వరంగా పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు.జగిత్యాల జిల్లాలో వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను పోషించాల్సిన పిల్లలు నిరాదరిస్తున్న సందర్భాల్లో సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ఆధ్వర్యంలో వారి సంఘ ప్రతినిధులు చేస్తున్న సేవలను ప్రభుత్వ విప్ అభినందించారు.


వృద్ధులైన తల్లిదండ్రుల్లో చైతన్యం కోసం హరి ఆశోక్ కుమార్ ప్రత్యేకంగా వారి అసోసియేషన్ఆధ్వర్యంలో సీనియర్ సిటీజేన్స్ పిలుపు మాస పత్రికను ప్రారంభించడము,అవగాహన సదస్సులు నిర్వహించడంఆదర్శనీయమన్నారు.సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ రాష్ట్ర డిమాండ్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్,ఉపాధ్యక్షులు పి.హనుమంత రెడ్డి,ఎం.డి.యాకూబ్,కోరుట్ల అధ్యక్షుడు పబ్బా శివానందం,కార్యదర్శి గంటేడి రాజ్ మోహన్ , పుప్పాల ప్రభాకర్,టీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు మిర్యాల నాగేందర్ రెడ్డి,అసోసియేట్ అధ్యక్షుడు ఎండి.మహమూద్,సీనియర్ సిటీజేన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక

### ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి ఇద్దరు ఎంపిక

ఎండపల్లి, డిసెంబర్ 26 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామానికి చెందిన జైనపురం వంశీ ఆదివారం రోజున హ్యాండ్బాల్ అసోసియేషన్ తెలంగాణ ( హెచ్ ఏ ఐ ) ఆధ్వర్యం లో హైదరాబాద్ ఎల్ బి స్టేడియం లో జరిగిన సెలెక్షన్ ట్రయాల్స్ సీనియర్ పురుషుల లో అత్యంత ప్రతిభ కనబరిచి ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి ఇద్దరు 1 మెట్ పెల్లి లోని వార్షకొండ పాఠశాలకు చెందిన పిడి జెట్టిపెల్లి అశోక్ 2 జైనపురం వంశి గుల్లకోట లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆఫ్ కరీంనగర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వద్లూరి రాజేందర్ జిట్టబోయిన శ్రీను తెలిపారు వీరు ఈ నెల 26 నుండీ 29 వ తేదీ వరకు కేరళ రాష్ట్రం లో జరిగే 53 వ జాతీయస్థాయి సినియర్ పురుషుల హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొంటారు. వీరి ఎంపిక పట్ల మాజీ ఎంపీపీ పొనుగోటి శ్రీనివాసరావు మాజీ సైనికులు మూదుగంటి అనంతరెడ్డి ఫౌండేషన్ ఫౌండర్ వెంకట రమణారెడ్డి ఓజ్జల మహేష్ డివైఎస్ఓ రవికుమార్ ఎస్ జి ఎఫ్ సెక్రటరీ లక్ష్మిరం నాయక్ అసోసియేషన్ సభ్యులు పిడుగు భాస్కర్, జైనపురం సాయికుమార్ సీనియర్ క్రీడాకారులు మరియు ప్రజా ప్రతినిదులు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.





## సమ సమాజ స్థాపనే సిపిఐ ధ్యేయం

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి డిసెంబర్ 26 (ప్రజా కలం)శ్రమజీవుల హక్కుల రక్షణ అభ్యున్నత కోసం శక్తి వంచన లేకుండా సమసమాజ స్థాపనే దేంగా అనునిత్యం పేదల పక్షాన పోరాడింది కమ్యూనిస్టు పార్టీయేనని సిపిఐ జిల్లా నేత ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సుతారి రాములు అన్నారు. గురువారం రోజున భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ శత జయంతి ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా స్థానిక సిపిఐ కార్యాలయం సి ప్రభాకర్ భవన్లో సిపిఐ జెండాను ఎగరవేసి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా సిపిఐ నేతలు మాట్లాడుతూ భారతదేశంలో 26 డిసెంబర్ 1925 ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని కాన్పూర్ నగరంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాల లోకి అడుగుపెడుతున్న శతజయంతి ఉత్సవాలు జరుపుకుంటున్నారన్నారు. జాతీయ ఉద్యమంలో బ్రిటిష్ పాలకుల నుంచి భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని పోరాడిందని అన్నారు.హైదరాబాద్ నిజాం రాజు రజాకార్లకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిర్వహించి పేదల పక్షాన భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం దున్నిన వాడికి భూమి కావాలని జరిగిన ఉద్యమ పోరాటాలలో 4000 మంది కమ్యూనిస్టులు ప్రాణ త్యాగం చేశారని 5 వేల గ్రామాలు రాజరికం పాలన నుండి విముక్తి పొందాయని 10 లక్షల ఎకరాలు భూమి పేదలకు పంచిందన్నారు ఈ పోరాటగటం చరిత్రలో నిలిచిందన్నారు.1952లో మొదటిస్వాతంత్ర ఎన్నికలలో 61 మంది లోక్సభ స్థానంలోపోటీపడి గెలిచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ 23 స్థానాలలో గెలుపొంది ప్రధాన ప్రతిపక్ష పార్టీగా అవతరించిందన్నారు. పార్లమెంట్ బ్యాంక్ జాతీయమైనవని భూసంస్కరణల కార్మికుల అనుకూలమైన చట్టాలు రూపకల్పన తదుపరి కాలంలో ఉపాధి హామీ పథకం సమాచార హక్కు చట్టం గృహహింస చట్టం భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ఏర్పాటు ఇంకా అనేక సాధించబడిందన్నారు.నాటినుండి నేటి వరకు పేదల బడుగు బలహీన వర్గాల పక్షాన నిరంతరం పోరాడుతూనే ఉందన్నారు. ప్రభుత్వాలు పాలకులు మారిన పేద కార్మిక రైతుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఇలాంటి వాటిపై బలమైన ఉద్యమ పోరాటాలు చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సిపిఐ సీనియర్ నాయకులు ఎండి మౌలానా సిపిఐ జిల్లా నేతలు ఎండి ముక్రం,ఉస్మాన్,ఎన్నం రాధా,రామిల్ల రాంబాబు, సాంబార్ మహేశ్, సాంబార్ సంతోశ,కొక్కుల గంగాధర్, తిప్పర్తి రమేశ్, అందేవంశీకృష్ణ,సమీర్,గుండేటి పోశెట్టి,దాసరి మనోహర్, ఎస్ కే చాంద్ పాషా, తదితరులు పాల్గొన్నారు




## అయ్యప్ప పడిపూజ మహోత్సవ వేడుకలు

గొల్లపెల్లి డిసెంబర్ 26 ప్రజాకలం ప్రతినిధి మండలంలోని భీమ్ రాజ్ పల్లి గ్రామంలో బొమ్మెన కుమార్ నరేందర్ ముక్తామణి స్వగృహంలో నిర్వహించారు శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవం అత్యంత అంగరంగ వైభవంగా జరిగింది.శ్రీ గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, గౌరీ దేవి, శ్రీ చక్ర అర్చన, శ్రీ అయ్యప్ప స్వామి అభిషేకం, మెట్ల పూజ, జ్యోతి ప్రజ్వలన, కుంకుమార్చన పూజలు నిర్వహించారు.జగిత్యాలశేషు గురుస్వామి ఆర్కెస్ట్రా విభావరి, శ్రీ అయ్యప్ప స్వామి పేట తుల్లి ఆటలు,స్వాముల భజనలు నృత్యాలు, పాటలతో, అలరించారు అయ్యప్ప మహా పడిపూజ మహోత్సవానికి, పెద్దపల్లి, జగిత్యాల, వేములవాడ జిల్లాకు చెందిన స్వాములుపెద్ద ఎత్తున తరలివచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొని అయ్యప్ప భక్తి గీతాలు ఆలపించారు.ఈ కార్యక్రమంలో గురుస్వాములు బ్రహ్మ శ్రీ నాగుల మల్యాల విరాచారి కట్ట సత్యనారాయణ చారి గాందే వేణు గంధం పరందాములు రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ కందుకూరి కృష్ణారెడ్డి,గాన గంధర్వులు కిష్టంపేట రమేష్ రెడ్డి, గురుస్వాములు చొక్కా రెడ్డి, బొమ్మ రాజేశం,వడ్లకొండ శివ కుమార్, విజ్జతుల మహేష్, అంజయ్య. భీమ్ రాజు పల్లి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.













## మెట్ పల్లి లో ఘనంగా అయ్యప్ప పూజ

మెట్ పల్లి: ప్రతినిధి డిసెంబర్ 26 (ప్రజా కలం) పట్టణంలోని అయ్యప్ప ఆలయం కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. గూడెం ఆలయ గురుస్వాములు పురుషోత్తమచారి చేతుల మీదుగా అయ్యప్ప స్వామి పడిపూజ నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ శాశ్వత గౌరవ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పాల్గొన్నారు. అత్యధిక అయ్యప్ప స్వాములు భక్తులు మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మున్సిపల్ చైర్మన్ రానావేణు సుజాత సత్యనారాయణ ,బాపురెడ్డి, కల్వకుంట సుజిత్ రావు, ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్ సాములు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాకలం

శుక్రవారం, డిసెంబర్ 27, 2024

# సంభల్ రహస్యాలు

సంభల్‌లో వరుసగా పురాతన కట్టడాలు బయటపడుతున్నాయి. ఇటీవల, సంభల్ మసీదు వివాదంలో చెలరేగిన అల్లర్ల తర్వాత సంభల్ చర్చనీయాంశమయ్యింది. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో సంభల్ సంచలనాలకు వేదికయ్యింది. నగరవ్యాప్తంగా జరుగుతున్న పలు తనిఖీల్లో పాత కాలంనాటి విశేషాలు ఒకొక్కటిగా బయటపడుతున్నాయి. మొన్న శివాలయం.. ఇవాళ 1857 సిపాయిల తిరుగుబాటులో వాడుకున్న సొరంగ బావి.. ఇలా ఇంకెన్ని రహస్యాలను సంభల్ దాచుకుందో అనే ఆసక్తి పెరిగింది. ఉత్తర్ ప్రదేశ్‌లోని సంభల్ సంచలనాలకు వేదికయ్యింది. ఇటీవల, సంభల్ మసీదు వివాదంతో మొదలైన అలజడితో ఆ ప్రాంతంలో పురాతన కట్టడాల వ్యవహారం ఆసక్తిని రేపింది. గత కొన్ని రోజులుగా అధికారులు చేస్తున్న వేర్వేరు తనీఖీల్లో పాత కాలం నాటి దేవాలయాలు, బావులు బయటపడుతున్నాయి. మైనారిటీ వర్గాలు నివశిస్తున్న ప్రాంతంలోనే ఈ సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. సంభల్ భూమిని తవ్వుతుంటే.. మట్టిలో విగ్రహాలు, శివలింగాలు, బావులు, సొరంగాలు వెలుగు చూస్తున్నాయి. ఇప్పుడిదే అంశం దేశవ్యాప్తంగా అతిపెద్ద చర్చకు దారితీసింది. ఇటీవల, ఓ పురాతన ఆలయం బయటపడింది. ఆలయంలో హనుమాన్ విగ్రహం కనిపించింది. ఆ విగ్రహం కిందనే శివలింగం బయటపడింది. ఎదురుగా నందివిగ్రహాలు కూడా ఉన్నాయి. డిసెంబర్ 14న ఆలయం వెలుగులోకి రాగానే మరుసటి రోజునుంచి పురాతన శివాలయాన్ని దర్శించడానికి భక్తులు పోటెత్తారు. ఈ ఆలయాన్ని పునరుజ్జీవనం చేసి.. పూజలు, హోమాలు నిర్వహించారు. దీని తర్వాత, మరో చోట ఆరవై ఏళ్లకు ముందు నాటి సొరంగం మార్గం? ఓ మెట్ల బావి కూడా కనిపించాయి. ఈ పరిణామాల మధ్య, మరోసారి సంభల్‌లో హిందూ సాంస్కృతి ఆనవాళ్లపై చర్చ రాజుకుంది. వెలుగు చూసిన ఓ సొరంగ మార్గం? బ్రిటీష్ రాజ్‌కి వ్యతిరేకంగా 1857 తిరుగుబాటు సమయంలో ఉద్యమ కారులు తప్పించుకోడానికి వాడిన సొరంగంగా భావిస్తున్నారు. అలాగే, 150 సంవత్సరాల నాటిదని నమ్ముతున్న ఒక మెట్ల బావి కూడా ఇదే ప్రాంతంలో కనపించింది. సంభాల్‌లోని చందౌసిలోని లక్ష్మణ్ గంజ్ ప్రాంతంలో ఆక్రమణలపై చేస్తున్న డ్రైవ్‌లో ఇవి కనిపించాయి. అయితే, అక్కడ కనపించిన మెట్ల బావి పేరు రాణీకి బావ్డీగా చెబుతున్నారు. ఇది, బాంకే బిహారీ ఆలయానికి సమీపంలో ఉంది. శిథిలావస్థకు చేరుకున్న ఈ నిర్మాణం.. ఈ ప్రాంతంలోని చారిత్రక ప్రదేశాలను వెలికితీసే ప్రయత్నంలో భాగంగానే కనిపెట్టినట్లు తెలుస్తోంది. పురావస్తు శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న తాజా సర్చ్ ఆపరేషన్లలో.. ఈ ప్రాంతంలోని భద్రక్ ఆశ్రమం, స్వర్గదీప్, చక్రపాణి పేర్లతో ఉన్న ఐదు పుణ్యక్షేత్రాలు, 19 పాత బావులను కూడా పరిశీలించినట్లు తెలుస్తోంది. అయితే, ఇప్పటి వరకూ కొనుగొన్న ఆలయాలు, మెట్లబావి, సొరంగ మార్గాలు ప్లాన్డ్‌గా కనుక్కున్నవి కాదనీ.. ఆక్రమణలపై జరుగుతున్న డ్రైవ్‌లో భాగంగానే కనిపించాయని అధికారులు చెబుతున్నారు. అయితే, ఈ ఆలయం వివాదాస్పద షాహీ జామా మసీదు నుంచి సుమారుగా వంద మీటర్ల దూరంలో ఉంది. నవంబర్ 24న కోర్టు ఆదేశాలతో మసీదు సర్వేకి వెళ్లిన సమయంలో అల్లర్లు మొదలయ్యాయి. ఈ ఘటనలో ఐదుగురు వ్యక్తులు మరణించారు. దీంతో సంభల్ దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. ఈ పరిణామం తర్వాత నుంచి ఆ ప్రాంతంలో ఆక్రమణలపై యోగి సర్కార్ ఉక్కుపాదం మోపింది. ఈ సందర్భంగానే పురాతన కట్టడాలు వెలుగులోకి వస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ ఒక చిన్న పట్టణం. అయితే, ఈ ప్రాంతం చారిత్రకంగానూ ప్రఖ్యాతి చెందిన నగరం. ఆధ్యాత్మిక, పురాతన విశ్వాసాలతో నిండిన నగరం. ఇక్కడ మత విశ్వాసాలు కూడా అధికంగా కనిపిస్తాయి. మసీదులు, దేవాలయాలు ఎక్కువగా ఉంటాయి. వీటిలో ఇప్పటికీ కొన్ని స్మారక కట్టడాలు వందల సంవత్సరాల పాతవి, శతాబ్దాలుగా అవి అలాగే ఉండిపోయాయి. నారాయణుడు 24వ అవతారమైన కల్కి సంభాల్ లో అవతరిస్తారని శ్రీమద్ భగవత పురాణంలోని 12వ ఖండంలోని రెండవ అధ్యాయంలో ఉందని వేదపండితులు చెబుతుంటారు. కలియుగంలో దుష్టుల నాశనానికి ఈ అవతారం ఉండబోతోందని అందులో రాసినట్లు చెబుతారు. సంభాల్‌లో 68 తీర్థయాత్రలు, 19 బావులు, 36 పురాలు, 52 సత్రాలు ఉండేవని అంటారు. అయితే, అలాంటి ఆనవాళ్లు సంభాల్ నగరంలో ఇప్పటికీ ఉన్నాయి. మరోవైపు, సంభాల్‌లో నిర్మించిన మొట్టమొదటి బాబ్రీ మసీదు.. ఈ చిన్న నగరంలో మొఘలుల శాశ్వత ప్రభావం ఎలా ఉందో చెప్పడానికి నిజమైన నిదర్శనంగా ఉంది. బాబ్రీ మసీదు అని కూడా పిలుచుకునే.. జామా మసీదు సంభాల్‌లోని పురాతన స్మారక కట్టడాలలో ఒకటి. ప్రస్తుతం ఇది వారసత్వ ప్రదేశం. ఈ మసీదు 1528లో బాబర్ చక్రవర్తి ఆదేశాల మేరకు నిర్మించబడింది. అయితే, చరిత్ర మొత్తం తవ్వి చూస్తే? ఈ నగరంలో మొఘలులకు ముందున్న సంస్కృతి చాలా బయటపడుతుందని అనడంలో సందేహం లేదు. మతపరమైన స్వభావాన్ని వివాదాస్పదం చేసే కేసుల్లో మతపరమైన నిర్మాణాలు లేదా సర్వేలకు ఎలాంటి ఆదేశాలు జారీ చేయవద్దని దేశంలోని దిగువ కోర్టులకు సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రార్ధనా స్థలాల చట్టం 1991కు ఉన్న రాజ్యాంగబద్ధతపై సుప్రీంకోర్టు విచారిస్తోంది. ఈ విచారణ పూర్తయ్యేవరకు మతపరమైన నిర్మాణాలు, స్వభావానికి సంబంధించి కొత్త వాజ్యాలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు దిగువ కోర్టులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దిగువ కోర్టులు ఇష్టారాజ్యంగా ఆదేశాలు జారీ చేయవద్దని కోరింది. అసలు, సంభాల్ నుండి వారణాసి వరకు విస్తరించిన ఈ ఆలయాల పునఃస్థాపన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యానాథ్ చేపట్టిన భారీ ఆపరేషన్ అనే అభిప్రాయం కూడా లేకపోలేదు. ఇటీవల, సీఎం యోగీ మాటలు వింటే.. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పురాతన ఆలయాలను తిరిగి మనుగడలోకి తెస్తామని అన్నారు. ఇందులో భాగంగానే, ప్రస్తుతం, యూపీలోని చరిత్ర తవ్వి తీసే పనిలో పడినట్లు స్పష్టం అవుతుంది. డిసెంబర్ 23న కొత్తగా వెలికి తీసిన ఆలయ గోడలపై భక్తులు 'ఓం నమః శివాయ', 'హర్ హర మహాదేవ' నినాదాలను రాశారు. ఆలయ ప్రాంగణం అంతా శుద్ధి చేశారు. మరోవైపు, భద్రతను పెంచుతూ.. అధికారులు అలుం కెమెరాలను ఏర్పాటు చేశారు. విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే, భక్తులంతా ఆలయంలో పూజలు మొదలుపెట్టారు. ఇలా, సంభల్‌కు ఉన్న గొప్ప ఆధ్యాత్మిక, సాంస్కృతిక చరిత్రను వెలికితీస్తున్న తరుణంలో.. రాబోయే రోజుల్లో అక్కడ మతపరమైన అశాంతికి కారణమవుతుందేమో అనే ఆందోళన కూడా లేకపోలేదు

## ఘనంగా బార్ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

మెట్ పల్లి: ప్రతినిధి డిసెంబర్ 26 (ప్రజా కలం)మెట్‌పల్లిలోని జువ్వాడి భవన్‌లో మెట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల లింబాద్రి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలలో కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు పాల్గొన్నారు. వారితో పాటు కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.





## శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్.. ప్రతి కుటుంబానికి ధీమా

### - బాధిత కుటుంబానికి శ్రీరామ్ చెక్కు అందజేసిన ఏజీఎం సురేష్





కాల్వ శ్రీరాంపూర్,డిసెంబర్ 26:(ప్రజాకలం ప్రతినిధి)శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో ఇన్సూరెన్స్ పాలసీ తీసుకొని వివిధ కారణాలతో మృతి చెందిన కుటుంబాలకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆర్థిక భద్రత కల్పిస్తూ ధీమాగా ఉంటుందని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఏజీఎం అట్ల సురేష్, మాజీ సర్పంచులు ఓరుగంటి కొమురయ్య గౌడ్,శ్రీపతి మొగిలయ్య గౌడ్ లు అన్నారు. గురువారం కాల్వ శ్రీరాంపూర్ మండలం పెద్ద రాతుపల్లి గ్రామానికి చెందిన కత్తుల మల్లయ్య స్థానిక కంపెనీ ఏజెంట్ బుర్ర శ్రీలత చిరంజీవి,డెవలప్మెంట్ ఆఫీసర్ బాలే శివప్రసాద్,మేనేజర్ బుర్ర అఖిల్ ల వద్ద గత 11 నెలల క్రితం రూ 30 వేల పాలసీ తీసుకున్నారు. కాగా గత రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. మృతుని భార్య నామిని కత్తుల శ్రీలత కు రూ.5 లక్షల 37 వేల 448(5,37,444) రూపాయల శ్రీరామ్ భీమా చెక్కును స్థానిక మాజీ ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబంలో సంపాదించే వ్యక్తి అనుకోకుండా మృతిచెందితే ఆ కుటుంబం వీధిన పడకుండా లైఫ్ ఇన్సూరెన్స్ ఆర్థికంగా కాపాడుతుందన్నారు. పాలసీ కట్టిన వారికి ప్రమాదము జరగకుండా ఉంటే కట్టిన డబ్బులకు వడ్డీ,బోనస్ కలిపి వస్తాయని వెల్లడించారు. ప్రతి వ్యక్తి జీవిత బీమా పాలసీ చేయించుకుంటే ఆ కుటుంబానికి ఇన్సూరెన్స్ పాలసీ ఆపత్కాలంలో కొండంత అండగా నిలుస్తుందన్నారు. జీవిత బీమా లో వ్యక్తి పాలసీ తీసుకుంటే ఒకవేళ అనివార్య కారణాలవల్ల ఆయన మృతి చెందితే అతనిని తీసుకురాలేక పోవచ్చు కానీ ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా ఇన్సూరెన్స్ ద్వారానే లభిస్తుందన్నారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ గ్రామానికి చెందిన మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందగా నామినీకి రూ ఐదు లక్షల రూపాయలు బీమా అందజేయడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీఎం అట్ల సురేష్,మాజీ సర్పంచులు ఓరుగంటి కొమురయ్య గౌడ్,శ్రీపతి మొగిలయ్య గౌడ్,డి ఎం ఏ వెంకట్రాజం,మేనేజర్లు బాలసాని సతీష్,బుర్ర అఖిల్,డెవలప్మెంట్ ఆఫీసర్లు బాలే శివప్రసాద్,జనగామ రవీందర్,వడ్లకొండ వివేక్,గట్టు శ్రీధర్,నాయకులు బొజ్జం దుర్గయ్య,మహేష్, రవీందర్,గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆగని అక్రమ గ్యాస్ దందా..

### చీకటి మాటున సిలిండర్‌ల ఒప్పందం - జిల్లా లో అక్రమ గ్యాస్ దందా ఆగడం









జగిత్యాల డిసెంబర్ 26(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) : జిల్లా లో అక్రమ గ్యాస్ దందా ఆగడం లేదు. గ్యాస్ అవసరం పెరిగే కొద్దీ బ్లాక్ దందా విచ్చలవిడిగా చేస్తున్నారు. పేదలకు పోవాల్సిన డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు వెల్డింగ్, హొటళ్లు,టిఫిన్,ఫాస్ట్ ఫుడ్ సెంటర్స్ కు అక్రమంగా తరలిపోతున్నాయి. గృహావసరాలకు ఉపయోగించే సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను కమర్షియల్ వ్యాపారానికి జోరుగా ఉపయోగిస్తున్నారు. రాష్ట్ర సర్కారు పేదలకు గ్యాస్ సిలిండర్లు అందించాలని గట్టి సంకల్పంతో పని చేస్తుంటే సంబంధిత అధికారులే ప్రభుత్వ సంకల్పానికి తూట్లు పొడుస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులతో చీకటి ఒప్పందాలు చేసుకుని నెలనెల లక్షల రూపాయలు పోగు చేసుకుంటున్నారు. గ్యాస్ సిలిండర్లు పట్టపగలే కమర్షియల్ వ్యాపారానికి తరలిపోతున్న అధికారులు మాత్రం అటువైపు కూడా కన్నెత్తి చూడటం లేదు. అధికారుల కనుసన్నల్లోనే గ్యాస్ దందా జోరుగా జరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**గ్యాస్ బండ దింపితే నాకెంత...**

కొందరు వ్యక్తులు జిల్లా లో భారీగా వ్యాపారాలు చేస్తున్నారు. ఆ వ్యాపారానికి డొమిస్టిక్ గ్యాస్ సిలిండర్లు అవసరమౌవడంతో జిల్లా లోని జగిత్యాల, కోరుట్ల, మెట్ పల్లి డివిజన్ ప్రాంతాల్లోని మండలాలకు చెందిన గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులతో ఒప్పదం చేసుకుంటున్నారు. వ్యాపారాన్ని ఆసరాగా చేసుకొని ఆ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు వ్యాపారస్థులతో గ్యాస్ బండకు ఇంత ఇవ్వాలని డిమాండ్ చేసే విమర్శలు కూడా ఉన్నాయి. అధికారులు దాడులు చేస్తే అంత నేను చూసుకుంటాలే అని వ్యాపారస్తులకు కొంత మంది రాజకీయ నాయకులు అభయహస్తం కల్పించి దందాకు శ్రీకారం చూడుతున్నారు .అధికారులు దాడులు చేసి పట్టుకోవడం అంత శర మామూలేనని వ్యాపారస్థులతో చెప్పడం గమనార్హం. దీంతో అధికారులకు రాజకీయ నాయకులకు ఇద్దరి మధ్య చీకటి ఒప్పందం కుదరడంతో జిల్లా లో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు మార్కెట్ లో విచ్చలవిడిగా బ్లాక్ దందా చేస్తున్నారు. వ్యాపార స్థలాల వద్ద సిలిండర్లు దించాలని పని చేసే సిబ్బందికి ఆదేశించడంతో సిబ్బంది కూడా బహిరంగంగానే సిలిండర్లు దించడం గమనార్హం.

**పచ్చనోట్లకే పరిమితమైన స్థానిక పౌర సరఫరాల శాఖ అధికారులు ...?**

వ్యాపారానికి డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు ఉపయోగించడం చట్ట విరుద్ధమని అధికారులకి తెలుసు. కానీ ఆ అధికారుల కను సైగలతోనే గ్యాస్ దందా జరుగుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. గృహావసర సిలిండర్లు కమర్షియల్ వ్యాపారానికి ఉపయోగిస్తుంటే చర్యలు తీసుకోవాల్సిన స్థానిక పౌర సరఫరాల శాఖ అధికారులు ఏజెన్సీ నిర్వాహకులు ఇచ్చే పచ్చనోట్లకే పరిమితమవుతున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు కురిపిస్తున్నారు.

అక్రమార్కులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నాం అంటున్నారు తప్ప దందాను అరికట్టడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బ్లాక్ గ్యాస్ దందాను అరికట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

## ఎన్ ఎస్ యూ ఐ పోస్టర్ ఆవిష్కరణ



మెట్ పల్లి: ప్రతినిధి డిసెంబర్ 26 (ప్రజా కలం) పట్టణంలోని సుజిత్ రావు నివాసంలో జగిత్యాల జిల్లా ఎన్ ఎస్ యూ ఐ అధ్వర్యంలో జాయిన్ ఎన్ ఎస్ యూ ఐ పోస్టర్ ఆవిష్కరణ టీపీసీసీ డెలిగేట్ సుజిత్ రావు ఆవిష్కరించారు. సుజిత్ రావు మాట్లాడుతూ విద్యార్థులు ఇందులో భాగం అయి తెలంగాణలో విద్యార్థి సంఘం ను బలపర్చాలని విద్యార్థులు సమస్యలకై స్పందినచ్చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కూన గోవర్ధన్,పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కుతుబుద్దీన్ పాషా,జిల్లా సేవాదల్ అధ్యక్షుడు అందే మారుతి,జిల్లా యూత్ కాంగ్రెస్ మీడియా కోఆర్డినేటర్ కూన రాకేశ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బీర్కుల విజయ్ పటేల్, కోరుట్ల అసెంబ్లీ వర్కింగ్ ప్రెసిడెంట్ గద్దల భరత్ రాజ్,జగిత్యాల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ పోల్కం శివ, టౌన్ వైస్ ప్రెసిడెంట్ సమీర్,బైండ్ల శ్రీకాంత్,కోరే రాజు,జాఫర్, మోక్షిత్,మణిదీప్ తదితులు పాల్గొన్నారు.

## యువకుని ఆత్మహత్య

గొల్లపెల్లి డిసెంబర్ 26 ప్రజాకలం ప్రతినిధి మండలంలోని బీబీరాజ్ పల్లి గ్రామానికి చెందిన దొనకొండ గంగాధర్ వయస్సు 23 అనే యువకుడు గత చాలా సంవత్సరాలుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు జీవితం పై విరక్తి చెంది గురువారం మధ్యానం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు అతని తల్లి దొనకొండ లక్ష్మి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లపెల్లి ఎస్.ఐ సతీష్ తెలిపారు

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



కాల్వ శ్రీరాంపూర్,డిసెంబర్ 26:(ప్రజాకలం ప్రతినిధి) మండల కేంద్రంలోని వడ్లూరి నాగరాజు ఇటీవల మృతి చెందగా మృతుని కుటుంబాన్ని యూత్ కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు సొన్నాయిటెంకం శివరామకృష్ణ గురువారం పరామర్శించారు. మృతుని కుటుంబాన్ని ఓదార్చి 50 కిలోల బియ్యం అందజేసి సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దర్మల రాములు,బొబ్బిలి శ్రీనివాస్,బందెల శ్రీనివాస్,మెట్టు లక్ష్మయ్య,మెట్టు లక్ష్మణ్,మెట్టు వినయ్,తదితరులు పాల్గొన్నారు.

## ఏబీవీపీ రాష్ట్ర కమిటీలో జిల్లా వాసులకు సముచిత స్థానం

పెద్దపల్లి,డిసెంబర్ 26:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) ప్రపంచంలో అతిపెద్ద విద్యార్థి సంఘమైన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 43వ రాష్ట్ర మహాసభలు సిద్దిపేట జిల్లాలో ఈ నెల 23,24,25న నిర్వహించడం జరిగినది. ఈ మహాసభలో విద్యారంగం తోపాటు సామాజిక సమస్యలపై అనేక తీర్మానాలు చేయడం జరిగినది. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జానారెడ్డి రాష్ట్ర కమిటీని ప్రకటించడం జరిగింది. ఇందులో భాగంగా పెద్దపల్లి జిల్లా వాసులకు సంచితస్థానం దక్కినది. రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ గా పెద్దపల్లి మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన శ్రీపతి సాయి తేజ,స్టూడెంట్ ఫర్ డెవలప్మెంట్ రాష్ట్ర కో కన్వీనర్ గా పాలకుర్తి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మారం సందీప్, స్టూడెంట్ ఫర్ సేవ రాష్ట్ర కో కన్వీనర్ గా ఎలిగేడు మండలం దుళికట్ట గ్రామానికి చెందిన సందనవేణి ఓమేష్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కమాన్పూర్ పట్టణానికి చెందిన జంగపల్లి అరవింద్,పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి గ్రామానికి చెందిన యతిరాజు అజయ్ లను నియమించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాపై నమ్మకంతో మాకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తామని విద్య రంగ సమస్యలపై అరుపెరుగని పోరాటం చేస్తామని వారన్నారు. రాష్ట్ర శాఖకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## కుమ్మరి హస్తకళావృత్తి వారికి కేంద్ర ప్రభుత్వం చేయూత

### - కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దివ్య రావు

కాల్వ శ్రీరాంపూర్,డిసెంబర్26:(ప్రజాకలం ప్రతినిధి) చేతివృత్తుల వారికి కేంద్ర ప్రభుత్వం చేయూతనిచ్చే కార్యక్రమాలు చేపడుతున్నాయని హస్తకళ అభివృద్ధి అసిస్టెంట్ డైరెక్టర్ దివ్య రావు,డిజైనర్ రాజేష్ లు అన్నారు. గురువారం పెద్దపెల్లి జిల్లా పరిధిలోని కుమ్మర చేతి వృత్తి వారికి కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కుమ్మరి కులస్తులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ కేంద్ర జౌళి శాఖ అందించే పహేషాన్ హస్తకళ కార్డును ప్రతి ఒక్క కుమ్మర చేతి వృత్తి వచ్చే కళాకారుడు అప్లై చేసుకోవాలని అలాగే హస్తకళ కార్డు యొక్క ప్రాముఖ్యత ఇన్సూరెన్స్,పెన్షన్ తదితర విషయాల గురించి వారు వివరించారు. ఈ గుర్తింపు కార్డు ఉన్న ప్రతి ఒక కళాకారునికి జౌలీ మంత్రిత్వ శాఖ ద్వారా అందించే మట్టి పాత్రల తయారీ,కొత్త నమూనాలు,మార్కెట్ కు అనుగుణంగా శిక్షణ ఇస్తామని వారు అన్నారు. కావున పెద్దపెల్లి జిల్లాలోని ప్రతి ఒక్క కుమ్మరి హస్తకళ కళాకారుడు ఇట్టి ఐడి కార్డును అప్లై చేసుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల కుమ్మరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## అంబేడ్కర్ నేషనల్ సోషల్ సర్వీస్ ఎక్సలెన్సీ అవార్డుకు ఇబ్రహీం..

గోదావరిఖని, డిసెంబర్ 26 : (ప్రజా కలం ప్రతినిధి) రామగుండం నగరపాలక సంస్థ పరిధి జనగామ గ్రామానికి చెందిన ఇన్కమ్ టాక్స్ ఆడిటర్ ఎండి ఇబ్రహీం



జాతీయస్థాయి అవార్డు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేషనల్ సోషల్ సర్వీస్ ఎక్సలెన్సీ ఎంపికైనట్టు అంబేద్కర్ గ్లోబల్ ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ మనీష్ వాయి, ప్రియాంకసాతే తెలిపారు. వచ్చే నెల 3న క్రాంతి జ్యోతిసావిత్రిబాయిపూలే జన్మదిన వేడుకల సందర్భంగా అంబేద్కర్ గ్లోబల్ ఫౌండేషన్ ఇండియన్ గెలాక్సీ ఫౌండేషన్ న్యూఢిల్లీ సంయుక్త ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని న్యూ మహారాష్ట్ర సదన్ లో నిర్వహించే కార్యక్రమంలో ఈ అవార్డును ముఖ్యఅతిధులు కేంద్ర సామాజిక సాధికారిక శాఖ మంత్రి రాందాస్ హత్వాలే, నేషనల్ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా, నేషనల్ ఉమెన్ కమిషన్ చైర్మన్ విజయ కె. రహత్కర్ చేతులమీదుగా అవార్డు ప్రదానం చేయనున్నారు. ఇబ్రహీం గత కొంతకాలంగా సామాజిక సేవ చైతన్య కార్యక్రమంలో చురుకైన పాత్ర పోషిస్తున్నాడు. పర్సనాలిటీ డెవలప్మెంట్, స్కిల్ డెవలప్మెంట్ ట్రైనర్ గా యువతీ, యువకులకు ట్రైనింగ్ ఇచ్చి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో ఉపాధి కల్పించడానికి దోహదపడ్డారు. జాతీయస్థాయి అవార్డు రావడం పట్ల పలువురు ఎండి ఇబ్రహీంకు శుభాకాంక్షలు తెలిపారు.

## నెల్లిపాక లో పెసా గ్రామసభ



ప్రజాకలం ప్రతినిధి ఎటపాక డిసెంబర్ 26 :అల్లూరి సీతారామరాజు జిల్లా, ఎటపాక మండలం నెల్లిపాక పెసా ఎన్నికలలో పంచాయతీలో నెల్లిపాక రెవెన్యూ గ్రామాల్లో ఉపాధ్యక్షుడిగా కణితి ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శిగా కొర్స రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా గెలుపొందిన వారు మాట్లాడుతూ మా మీద నమ్మకంతో మమ్మల్ని ఏకగ్రీవంగా ఎన్నుకొనందకు ప్రతీ ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదములు తెలియజేస్తున్నామని, మీకు చట్టపరంగా ఏ రకమైన సమస్యలు వచ్చిన మాకున్న ఈ అర్హతలతో మీ సమస్యలకు పరిస్కారం చూపించే దిశగా పనిచేస్తామని, మన ప్రాంతంలో వలస రైతులు మన ఆదివాసీ మహిళలపై చూపిస్తున్న వివక్షతలకు, వలస విధానానికి వ్యతిరేకంగా, అటవీ సంరక్షణ కోసం, అటవీ అధికారులు వేధింపులు నుండి విముక్తి కలిగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెసా ఎలక్షన్ అధికారి సరియం. రాజులు, గంగరాజు, పంచాయతీ కార్యదర్శి అధ్యక్షుడిగా సర్పంచ్ కొర్స భద్రమ్మ , టీడీపీ మండల అధ్యక్షుడు పుట్టి రమేష్ , మరియు ఆదివాసీ గ్రామ సభ్యులు పెసా గ్రామ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## మంత్రి పొంగులేటిని మర్యాద పూర్వకంగా కలసిన టీఎన్టీయూసీ యూనిట్ సభ్యులు



ప్రజాకలం ప్రతినిధి బూర్గంపహాడ్ డిసెంబర్ 26 తెలంగాణా గృహ నిర్మాణ రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి ని వారి స్వగ్రామం నారాయణపురం కల్లూరి మండలం నందు గురువారం మర్యాదపూర్వకంగా కలిసిన ( ఐ టి సీ )టీ ఎన్ టీ యూ సీ యూనిట్ సభ్యులు. రానున్న గుర్తింపు సంఘ ఎన్నికల గురించి వారితో చర్చించిన ఎన్ టీ యూ సీ యూనిట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు మరియు ఐటీసీ పీ ఎస్ పీ డి యూనిట్ భద్రాచలం తిన్సుక్ టీ ఎన్ టీ యూ సీ ,,మిత్రపక్షాల అధ్యక్షులు కార్యదర్శులు కనకమేడల హరిప్రసాద్ ప్రధాన కార్యదర్శి, వైయస్సార్సీపి నాయకులు గాదె రామకోటి రెడ్డి మరియు కాంగ్రెస్ నాయకులు దుగ్గింపుడి శేశిరెడ్డి కలవడం జరిగింది.

## ఖని లో ఘనంగా సిపిఐ

# శత వార్షికోత్సవాలు

### - అరుణ పతాకాలను ఆవిష్కరించిన సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోషిక మోహన్, నగర కార్యదర్శి కే. కనకరాజ్



గోదావరిఖని, డిసెంబర్ 26: (ప్రజా కలం ప్రతినిధి) భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ శత ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో శత వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. శత వార్షికోత్సవాల ప్రారంభాన్ని పురస్కరించుకొని గురువారం భాస్కరరావు భవన్ లో సిపిఐ నగర కార్యదర్శి కే. కనకరాజ్ ప్రధాన చౌరస్తాలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కామ్రేడ్ గోషిక మోహన్ లు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సిపిఐ నగర కార్యదర్శి కే.కనక రాజ్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లా గౌడ్ కేంద్ర కార్యదర్శి కామ్రేడ్ కే.స్వామి లు మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్టు పార్టీ భారత గడ్డపై 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని వందవ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంలో నగర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ సిపిఐ పార్టీ 1925 డిసెంబర్ 26న ఉత్తరప్రదేశ్ లోని కాన్పూర్ లో ఆవిర్భవించిందని నాటి నుండి నేటి వరకు ప్రజా పోరాటంలో అలుపెరుగని పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. స్వతంత్రానికి పూర్వం ఆవిర్భవించిన కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ స్వతంత్రం కావాలని నినదించిందని నాటి స్వతంత్ర పోరాటం నుండి తెలంగాణ సాయుధ పోరాటం మలిదశ తెలంగాణ పోరాటం వరకు కమ్యూనిస్టు పార్టీ పోరాటం చరిత్రను నిలిచిపోతుందని పేర్కొన్నారు. భూమికోసం భుక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం పోరాడే ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో 4,500 మంది యువ కమ్యూనిస్టులను కోల్పోయిన మొక్కవోని ధైర్యంతో పోరాట జెండాను విడువని కమ్యూనిస్టు పార్టీ వేల గ్రామాల్లో 10 లక్షల ఎకరాల భూములను పేదలకు పంచిందని గుర్తు చేశారు రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ఐదు డివిజన్లో నుండి సిపిఐ బరిలో నిలవడం ఉందని ప్రజల ఆదరించి ఐదు డివిజన్లోనికి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. శత వార్షికోత్సవాలను పురస్కరించుకొని రామగుండం నగరంలో భాస్కరరావు భవన్, ప్రధాన చౌరస్తా, ఎల్బీనగర్, లెనిన్ నగర్, కస్తూరిబాయ్ నగర్, ఫైవ్ ఇంక్లైన్ కాలనీ, బస్టాండ్ కాలనీ, పవర్ హౌస్ కాలనీ, జనగామ, కొత్త కూరగాయల మార్కెట్ తో పాటు పలు డివిజన్లో సిపిఐ జెండాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ డబ్ల్యు బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, సిపిఐ నగర సహాయ కార్యదర్శి తాళ్లపల్లి మల్లయ్య, మడికొండ ఓదేమ్మ, మాటెటి శంకర్, మార్కపురి సూర్య, టీ.రమేష్ కుమార్, పడాల కనకరాజు, రేణిగుంట్ల ప్రీతం, శనిగరపు చంద్రశేఖర్ సిరిసిల్ల మల్లేష్ ,రేణుక,తిరుమల, బోడగుంట కనకయ్య గంగారపు చంద్రయ్య జగన్, అబ్దుల్ కరీం, ఆసాల నవీన్,రాజమ్మ, విజయ, నర్మద సంబోదు కొమరయ్య,లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వర్గ సంక్షేమం కోసం పోరాటాలు చేసిన చరిత్ర సిపిఐ దే..

### - పతాకావిష్కరణ చేసిన ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మడ్డి ఎల్లా గౌడ్

గోదావరిఖని, డిసెంబర్ 26: (ప్రజా కలం ప్రతినిధి) భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని 100 సంవత్సరాల్లో అడుగు పెడుతున్న సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు గురువారం జీడికె 1%ఉ%3 ఇంక్లైన్ లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు, అనంతరం ఆయన కార్మికుల నుద్దేశించి మాట్లాడుతూ దేశంలో ప్రజా, కార్మిక వర్గం సంక్షేమం కోసం, వారి హక్కుల సాధన కోసం పోరాటాలు, ఉద్యమాలు, ప్రాణ త్యాగా లు చేసిన చరిత్ర సిపిఐ పార్టీ అని ఆయ న పేర్కొన్నారు. దేశంలో, రాష్ట్రంలో ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న పాలక ప్రభుత్వాల ను ప్రజల పక్షాన, కార్మికుల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తున్న చరిత్ర సిపిఐ పార్టీ దని ఆయన అన్నారు. నేటి నుంచి 2025 డిసెంబర్ 26 వరకు శత వార్షికోత్సవ వేడుకలు జరుపాలని సిపిఐ పార్టీ పిలుపునిచ్చిందని ఆయన అన్నారు.



నిరంతరం సింగరేణి లో కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్న ఏఐటియుసి తల్లి సంఘం సిపిఐ పార్టీని రేపు రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ, ఏఐటియుసి నాయకులను సిపిఐ కార్పొరేటర్లు గా గెలిపించాలని, తద్వారా మరిన్ని సేవలు ప్రజలకు అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఏఐటియుసి వన్ ఇంక్లైన్ పిట్ సెక్రటరీ మానాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు సిర్ర మల్లికార్జున్, కొప్పుల లింగయ్య, శ్రీకాంత్, మహేందర్, దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర కార్య సమితి సభ్యునిగా ఎర్ధండి వాసి



మెట్ పల్లి: ప్రతినిధి డిసెంబర్ 26 (ప్రజా కలం) సిద్దిపేట లో జరిగిన 43 వ మహా సభలలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నూతనంగా రాష్ట్ర కార్యవర్గం ఎన్నుకున్నారు. 23, 24, 25 ఈ మహాసభలలో జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం, ఎర్ధండి గ్రామానికి చెందిన గన్నారపు అమృత్ చారి,రాష్ట్ర కార్యసమితి సభ్యునిగా ఎన్నుకున్నారు.వారు మెట్ పల్లి నగర సంయుక్త కార్యదర్శిగా,తెలంగాణ యూనివర్సిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు.

## సిపిఐ శత జయంతి ఉత్సవాలు




మంగపేట డిసెంబర్ 26(ప్రజాకలం ప్రతినిధి) భారత కమ్యూనిస్టు పార్టీ 1925 స్థాపించబడి 2025 కు 99 సంవత్సరాలు పూర్తి చేసుకొని 100 వ సంవత్సరం లో ప్రవేశిస్తున్న సందర్భంగా జిల్లా లోని అన్ని గ్రామ శాఖలు మండల పట్టణ శాఖలు జిల్లా కేంద్రాల్లో పండగ వాతావరణంలో జెండాలు ఎగుర వేయాలని దేశాలలో పేద ప్రజల పై జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించడంలో సీపీఐ పార్టీ ముందుండి పనిచేసిందని ఎన్ని ఆటుపోట్లు ఎదురైన ధైర్యంగా నిలబడి జైళ్లకు సైతం వెళ్ళటానికి వెనుకాడకుండా ఒక పక్క హత్యలు జరుగుతున్న వెనుకాడకుండా పాలకులను ఎదిరించి సాయుదులై అలుపెరుగని పోరాటం చేయటానికి ముందు కెళ్లిందేతప్పా వెనకడుగు వేయని సీపీఐ పార్టీ 100 సంవత్సరంలోకి అడుగిడి ముందుకు సాగుతోంది భవిష్యత్ లో కమ్యూనిస్టులదే విజయం సాధించి తీరుతుందని వెనకడుగు వేయదని ఈసందర్భంగా తెలియ జేశారు ఎరెర్రని తోరణాలుతో ముందుకు సాగాలని పార్టీ కార్యకర్తలకు నాయకులకు పిలుపునిచ్చిన సీపీఐ ములుగు జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు.

## ఖనిలో వాజ్ పాయ్ శతజయంతి ఉత్సవాలు..




గోదావరిఖని, డిసెంబర్ 26: (ప్రజా కలం ప్రతినిధి) మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ అటల్ బీహార్ వాజ్ పాయ్ శత జయంతి సందర్భంగా మహిళా మోర్చా నాయకురాలు, కోఆర్డినేటర్ సోమారపు లావణ్య ఆధ్వర్యం లో గురువారం అటల్ బీహార్ వాజ్ పాయ్ శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరిఖని, వీర్లపల్లి గ్రామం లోని ఈశ్వరకృప ఆశ్రమం లో వృద్ధులకు, అనాథలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పెద్దపల్లి జిల్లా ప్రోగ్రాం కోర్డినేటర్ కె. రాజగోపాల్, బిజెపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ పర్వతాలు పాల్గొని మాట్లడుతూ.. వాజ్ పాయ్ సేవలు మరువలేనివి అని, దేశం కోసం చీవరి శ్వాస వరకు పరితపించిన వ్యక్తి గొప్ప జాతీయ వాదులు అని వారి యొక్క అభివృద్ధి గ్రామ గ్రామాలో కానవస్తుంది అని, సర్వశిక్ష అభియాన్ ద్వారా పేద పిల్లలకు చదువు ని అందిచిన గొప్ప వ్యక్తి వాజ్ పాయ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మావాది రామన్న, ఎస్సీ మోర్చా స్టేట్ జనరల్ సెక్రటరీ కాసిపేట శివాజీ, పెద్దపల్లి రవీందర్, నవీన్ గౌడ్, నరహరి, దాసరి శ్రీనివాస్, మంజు, కుమారస్వామి సతీష్, అన్వేష్, కేవీ రావు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నా..

### - వరంగల్ పశ్చిమ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి

### - అట్టహాసంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ స్పోర్ట్స్ మీట్ 2024 ముగింపు కార్యక్రమం

### - ప్రెస్ క్లబ్ లో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ డిసెంబర్ 26 ప్రజా కలం ప్రతినిధి జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించేందుకు తాను కట్టుబడి ఉన్నానని,నిరంతరం అందరికీ అందుబాటులో ఉండి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నానని వరంగల్ పశ్చిమ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ 2024 ముగింపు కార్యక్రమం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా నాయిని రాజేందర్ రెడ్డి,పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి,మాజీ మేయర్,వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ హాజరయ్యారు. అనంతరం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టులు సమాజ అభ్యున్నతికి పాటుపడాలన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న మీడియా సమాజంలో జరుగుతున్న లోటుపాట్లను సరిదిద్దేందుకు నిరంతరం పనిచేస్తుందని అన్ని రంగాలతో పాటుగా మీడియాలో కూడా ఒక్కోసారి వింత




పోకడలు చూస్తున్నామని..అలాంటి వాటిని సరిదిద్దుకుంటూ ముందుకెళ్లడమే ప్రస్తుతం మన ముందున్న కర్తవ్యం అన్నారు.తాను 30 ఏళ్లుగా రాజకీయాల్లో రాణిస్తున్నానంటే అందుకు జర్నలిస్టుల సహకారం సంపూర్ణంగా ఉండటమే కారణమని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. మరో అతిథి ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ..తాను మేయర్ గా ఉన్న సమయంలో జర్నలిస్టులకు సొంత ఇంటి కలను నిజం చేసేందుకు ప్రకాష్ రెడ్డి పేటలో ఇందిరమ్మ కాలనీ పేరిట ఒక కాలనీని ఏర్పాటు చేసి అందులో ఆ రోజుకు వర్కింగ్ లో ఉన్న జర్నలిస్టులం దరికీ బీపీఎల్ కింద ఇంటి స్థలాన్ని అందించామని తెలిపారు. అందులో ఇప్పుడు చాలామంది ఇండ్లు కట్టుకొని నివసిస్తున్నారని..అది చూసి చాలా సంతోషిస్తున్నానని చెప్పారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ...ప్రెస్ క్లబ్ అభివృద్ధి పనులు కొనసాగుతూనే ఉంటాయని క్లబ్బు ప్రహరీ గోడకు 10 లక్షల రూపాయలు కేటాయించి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కి,కృతజ్ఞతలు తెలియజేశారు. కాజీపేట మీడియా పాయింటుకు సొంత భవన నిర్మాణం కోసం 500 గజాల స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణానికి సాయం అందించాలని కోరారు. జర్నలిస్టుల చిరకాల కోరిక సొంతింటి స్థలం అందించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే నాయినికి విజ్ఞప్తి చేశారు.ప్రెస్ క్లబ్ కు బొడ్రాయి లాంటివాడని.. తమకు ఏ సమస్య వచ్చినా ఎంఎల్ఏ తలుపు తడదామని ఈ సందర్భంగా చెప్పారు. జర్నలిస్టుల కుటుంబాల సంక్షేమం కోసం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కృషి చేస్తుందని ఈ సందర్భంగా అధ్యక్షులు వేముల నాగరాజు గుర్తు చేశారు. స్పోర్ట్స్ మీట్ లో భాగంగా విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో కళాకారుల ఆటపాటలు హైలెట్‌గా నిలిచాయి. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోల్ల అమర్, టీయూడబ్ల్యూజే (iju) రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, టియుడబ్ల్యూజె (H143) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ.ఆర్.లెనిన్,TWJF రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్, టియుడబ్ల్యూజె(iju) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, కార్యదర్శి తోట సుధాకర్,వరంగల్ జిల్లా కార్యదర్శి మట్ట దుర్గాప్రసాద్, టీయూడబ్ల్యూజే హెచ్ 143 హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మస్కపురి సుధాకర్,వరంగల్ జిల్లా అధ్యక్షుడు మెండ్ రవీందర్,కార్యదర్శి ఉమేందర్,ఐజేయు యూనియన్ రాష్ట్ర హౌసింగ్ అండ్ వెల్ఫేర్ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పి.వి. మదన్ మోహన్,పిన్నా శివకుమార్, గడ్డం కేశవమూర్తి,ప్రెస్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్లు గోకారం శ్యామ్, బొడిగె శ్రీను,కోడిపెల్లి దుర్గాప్రసాద్ రావు, అల్లం రాజేష్ వర్మ,యాంసాని శ్రీనివాస్,సహాయ కార్యదర్శిలు సంపేట సుధాకర్,పెద్దపల్లి వరప్రసాద్,వలిశెట్టి సుధాకర్,పొడిచెట్టి విష్ణువర్ధన్,కార్యవర్గ సభ్యులు దొమ్మటి శ్రీకాంత్,జనగాని ఆంజనేయులు, ఎం.డి.నయీం పాషా, కమటం వేణుగోపాల్, గుండెబోయిన దిలీప్ కుమార్,కందుకూరి సంజీవ్, డాక్టర్ నన్నపనేని భరత్ కుమార్, మంచాల రాజు,బాలవారి విజయ్ రాజ్,సీనియర్ జర్నలిస్టులు సంగోజు రవి,కంకణాల సంతోష్,పెండెం వేణుమాధవ్,గుంటి విద్యాసాగర్, ముగ్ధం,కొండం రవీందర్ రెడ్డి,మ్యాడం రజినీకుమార్,పొగాకుల అశోక్, పెద్దీష్,కృష్ణమోహన్,ప్రశాంత్, వెంకటరత్నం,రంజిత్,డెస్క్ జర్నలిస్ట్ నేతలు వర్దెల్లి లింగయ్య, సోమనర్సయ్య, మైదం సుధాకర్,జర్నలిస్టులు చెరుకు వేణుప్రసాద్,పబ్బ సతీష్,వేణు, తిరుపతి,తోట తిరుమల్,తదితరులు పాల్గొన్నారు.

## హరిదాసులను ఆదుకోండి

### సంప్రదాయాన్ని పరిరక్షించండి! - మల్లు ప్రసాద్

వైరా డిసెంబర్ 26 (ప్రజా కలం న్యూస్) పవిత్ర ధనుర్మాసంలో వేకువఝమునే లేచి, తిరువారాధన పూర్తి చేసుకుని, భుజాన తంబురాతో , నెత్తిన అక్షయపాత్రతో, చేతిలో చిరతలతో , కాలికి అందెలతో శరీరమంతా ద్వాదశోర్థ్వపుండ్రధారణతో సాక్షత్తు పరమ



భాగవతోత్తముడైన నారదుని స్వరూపంలో కనిపిస్తూ,హా శ్రీమద్ రమారమణ గోవిందో " అంటూ వీధులన్నీ హరినామస్మరణతో పునీతం చేసేవారే మాల దాసరి అయిన హరిదాసులు. ఈ ధనుర్మాస హరిదాసు సంప్రదాయం ద్వాపర యుగం నుండి వస్తున్నట్టుగా పురాణాలు చెబుతున్నాయి. అందరి గృహాలలో ధనధాన్యాలు క్షయం కాకుండా అక్షయమవ్వాలనే విశ్వాసంతో ప్రజలు అక్షయపాత్రలో కానుకలు సమర్పించి హరిదాసుల ఆశీర్వచనాలు తీసుకుంటారు తెలంగాణ మాల దాసరి రాష్ట్ర అధ్యక్షులు మల్లు ప్రసాద్ వెల్లడించారు.అలాంటి హరిదాసు నేడు కనుమరుగవుతున్నాడు. సంపాదన కోసం కాకుండా సంప్రదాయ పరిరక్షణ కోసం తపన పడే హరిదాసు నేడు ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నాడు. ఈ సంప్రదాయం కాపాడుకోవాలంటే హరిదాసులకు ప్రభుత్వాలు ఆర్థిక భరోసాను కల్పించాలి. హరిదాసులను కూడా కళాకారులుగా గుర్తించి పెన్షన్ మంజూరు చేయాలి. తెలంగాణ మాల దాసరి రాష్ట్ర అధ్యక్షులు మల్లు ప్రసాద్ కోరారు.

# ఎరుపెక్కిన భద్రగిరి



**ఘనంగా సిపిఐ శత వసంత వేడుక - అరుణ పతాకాలు ఎగురవేసిన నాయకులు..**

**- శతాబ్ది గుర్తుగా రెడ్ కేక్ కటింగ్ - భారీ మోటార్ సైకిల్ ర్యాలీ - క్యాడర్లో నయా జోష్**

ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం డిసెంబర్ 26: భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత వసంత ఉత్స వ వేడుక గురువారం భద్రాచలంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ముందురోజే పట్టణాన్ని ఎర్రజెండాలు, తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. పట్టణ ప్రధాన కూడళ్ల వద్ద భారీ ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేశారు. గురువారం నాడు తొలిపొద్దు పొడుస్తుండగానే సూర్యని లేలేత కిరణాలు ఎర్రజెండాలను తాకుతుండటంతో శత వసంత శోభకు మరింత వన్నె తెచ్చింది. ఎర్రజెండాలు, తోరణాలతో పట్టణ వీధులు అరుణ వర్ణమయ్యాయి. స్థానిక సిపిఐ కార్యాలయం ఆవరణం, అంబేద్కర్ సెంటర్లో ఏర్పాటు చేసిన దిమ్మెల వద్ద పార్టీ జెండాలను సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, భద్రాచలం డివిజన్ కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవికుమార్ ఎగురవేశారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద నూరేళ్ల త్యాగాలు, పోరాటాలకు గుర్తుగా కేక్ కట్ చేశారు. అనంతరం పట్టణంలో సుమారు 100 మోటార్ సైకిళ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సిపిఐ ఆఫీస్ నుండి అంబేద్కర్ సెంటర్ మీదుగా బస్టాడ్, పోలీస్ స్టేన్ రోడ్, యూబి రోడ్, సూపర్ వజార్ సెంటర్, తాతగుడి సెంటర్, కాలేజీ సెంటర్ మీదుగా పాత మార్కెట్ రోడ్. ఐటిడిఏ రోడ్ మీదుగా సాగి పార్టీ కార్యాలయం వరకు చేరుకుంది. ఈ ర్యాలీలో సిపిఐ జిందాబాద్ బాద్ అంటూ పెద్ద పెట్టున చేసిన నినాదాలు మిన్నంటాయి. నూరేళ్ల ఉత్సవ ర్యాలీ పలువురుని ఆకట్టు కుంది. పార్టీ ఆవిర్భవించి వందేళ్లయ్యిందా అంటూ ప్రజలు చర్చించుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నాయకులు కల్లూరి, రావులపల్లి మాట్లాడుతూ స్వాంతంత్ర్యానికి ముందు 1925వ సం.లో భారత కమ్యూనిస్టు పార్టీ కాన్పూర్లో ఆవిర్భవించిందన్నారు. సిపిఐ నూరేళ్ల పార్టీగా అవతరించడం ఆనందంగా ఉందని, ఈ నూరేళ్ల కాలంలో ఎన్నోకష్టాలు, నష్టాలను చవిచూసిందని, ఎర్రని రక్తాన్ని చెందింది. ఎందరో ప్రాణ త్యాగాలను చేశారని చెప్పారు. భూమి కోసం, బుక్తి కోసం, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎర్రజెండా నిరంతరం పనిచేస్తూనే ఉంటుందన్నారు. కమ్యూనిస్టులకు కాలం చెల్లిందన్న వారే దేశానికి ఎర్రజెండాల అవసరం ఉందంటూ బాహాటంగా ప్రకటించడం ఆ పార్టీ పోరాటాలకు ప్రతీక అని చెప్పారు. దేశంలో ఎన్నో రాజకీయ పార్టీలు కనుమరుగై పోయాయని, కానీ సిపిఐ నాటి నుండి నేటి వరకు అదే పంథాలో వంద నం. పూర్తి చేసుకుందని భావోద్వేగానికి లోనయ్యారు. దేశస్వాతంత్ర సమరంలో పార్టీ తనదైన పాత్ర పోషించి బ్రిటీష్ బానిస సంకెళ్ల నుండి విడిపించేందుకు పోరాటాలు చేశారని, దేశం సిద్ధించిన తర్వాత కూడా హైదరాబాద్ సంస్థాన్నాన్ని భారత్లో విలీనం చేసేందుకు నిజాం సైన్యానికి ముచ్చెమటలు పోయించి విజయం సాధించినట్లు చెప్పారు. ఈ భూమి ఉన్నంత వరకు, సూర్యుడు ఉదయించినంత కాలం ఎర్రజెండా రెపరెపలు మరింత వన్నెను సంతరించుకుంటాన్నారు. ఈ దేశానికి, దేశంలోని ప్రజలకు ఎర్రజెండా ఒక్కటే ప్రత్యామ్నాయం అని, కార్మికులు, కర్షకులు, బడుగు బలహీన వర్గాల నిరంతరం అండాగ ఉంటుందని, ప్రజా సమస్యల పరిష్కారాన్ని ప్రక్కదారి పట్టిస్తున్న రాజకీయ నాయకుల మెడలు వంచి సమ సమాజ స్థాపనకు పునరాంకితం అవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ నాయుడు, మారెడ్డి శివాజీ, ఏపూరి వెంకటేశ్వరరావు, కొండబాబు, త్రిరమూర్తులు, మహేష్, సాయిలి గంగాధర్, శోభన్, రామారావు, వెంకన్న, శ్రీనివాస్, కిలిమి ఎల్లారెడ్డి, వేణు, రమేష్, కరుణ కుమారి, ఉ మాదేవి, జ్యోతి, సుజాత, లక్ష్మీ, యామిని, రామలక్ష్మీ, రామచందర్, సురేష్, మైదిన్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింప చేయాలి

**టిఎస్ యుటిఎఫ్ నవాబుపేట మండల అధ్యక్షులు రవీందర్, ప్రధాన కార్య దర్శి పరమేశ్వర్ డిమాండ్...!!**





వికారాబాద్ డిసెంబర్ 26(ప్రజాకలం ప్రతినిధి )గత 18 రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని నిరవదిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి వెంటనే సమ్మె విరమింప చేయాలనీ నవాబుపేట టిఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షులు రవీందర్, ప్రధాన కార్యదర్శి పరమేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వారు సమ్మె లో ఉండడం వల్ల పేద విద్యార్థుల చదువులకు ఇబ్బంది కలుగుతుందని,అదేవిదంగా ఎంఆర్సి నిర్వహణ కుంటు పడిందని వాపోయారు... వారి ప్రధాన సమస్యలైన టైం స్కెలు రెగ్యులరైజే షన్,వంటి సమస్యలపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకొని సమ్మె విరమింప జేయాలనీ కోరారు.


## తెలంగాణ స్టైల్ లో భోజనం ప్రియులకు చేపల పులుసు తో స్పెషల్



ఖమ్మం డిసెంబర్ 26( ప్రజా కలం న్యూస్)ఖమ్మం నగరంలో గురువారం ఖానాపురం తాటి బెల్లం పక్కన ఆహా ఏమి రుచి అనే విధంగా మన ఖమ్మంలో తెలంగాణ చాపల పులుసు హెూటల్ ప్రారంభించడం జరిగినది . రుచికరమైన చాపల పులుసు , రొయ్యల ఫ్రై , చికెన్ కర్రీ , వెజ్ అండ నాన్వెజ్ కర్రీతో భోజనం హెూటల్ ప్రారంభించడం జరిగినది. తక్కువ ధరలో రుచికరమైన భోజన పదార్థాలు రండి రుచికరమైన భోజనాలు తినండి . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహాసేన ఖమ్మం జిల్లా అధ్యక్షులు మంద సంజీవరావు పాల్గొని ప్రారంభించారు . ఈ ప్రోపరేటర్ టి కళ్యాణి , కే అశోక్ , టి.దశరథ,కె.మోహన్,టీ.జోసెఫ్ నాయక్,ఏ.నరేష్,ఎం.శేషయ్య , ప్రవీణు, సాయి,అజయ్, శ్యామల, అభిమానులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు .

## రామన్నపేట నూతన ప్రెస్ క్లబ్ సభ్యులను సన్మానించిన ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట, డిసెంబర్ 26(ప్రజా కలం ప్రతినిధి) యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సీనియర్ జర్నలిస్టు గౌరవ అధ్యక్షులు ఎటెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కుకుడాల మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొండ మల్లేష్ గౌడ్, కోశాధికారి బత్తుల గణేష్ కమిటీ సభ్యులను స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారులు ఎండీ ఇబ్రహీం, కనతాల శశిదర్ రెడ్డి, ఉ పాధ్యక్షులు ఎండీ గౌస్, బోయపల్లి యాదయ్య, సహాయ కార్యదర్శులు మీర్జా హర్షద్ బెగ్, ముత్యాల రమేష్, సంయుక్త కార్యదర్శి మద్దెగల్ల నర్సింహ, నడిగొటి నాగేష్, కార్యవర్గ సభ్యులు ఎండీ తక్కివొద్దిన్, లవణం ఉపేందర్, ఎండీ నజీమ్, లవణం చంద్రశేఖర్, నాగటి యాదయ్య, నడిగోటి కృష్ణ, మాంద్ర సత్యం, బొడ్డు పరశరాములు తదితరులు పాల్గొన్నారు.



## 7వ ప్రపంచ మాదిగ దినోత్సవం జయప్రదం చేయండి

**- ప్రపంచ మాదిగ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ**





ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం డిసెంబర్ 26: ఈనెల 29న కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్ లో ఇంటలెక్చువల్ ఫోరం ఫర్ మాదిగాస్ ఇంటర్నేషనల్ ( ఇన్ఫామ్ ఇంటర్నేషనల్ ) ఆధ్వర్యంలో జరిగే ఏడవ ప్రపంచ మాదిగ దినోత్సవం జయప్రదం చేయాలని ఈరోజు భద్రాచలం అంబేద్కర్ సెంటర్లో ఏడవ ప్రపంచం మాదిగ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా దళిత సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ముద్దా పిచ్చయ్య మాట్లాడుతూ... 2018 నుండి ప్రతి సంవత్సరం డిసెంబర్ 29వ తేదీన ప్రపంచ మాదిగ దినోత్సవం జరుపుకోవడం జరుగుతుంది అని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మాదిగల అందరిని ఏకం చేస్తూ ఒకే వేదిక మీదకు తీసుకువస్తూ మాదిగల సమగ్ర అభివృద్ధికి ఇంటలెక్చువల్ ఫోరం ఫర్ మాదిగాస్ ఇంటర్నేషనల్ కృషి చేస్తుందని అన్నారు. ఏడవ ప్రపంచం మాదిగ దినోత్సవ సందర్భంగా మాదిగల అందరిని పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడానికి ఇంటర్నేషనల్ మాదిగ ఛాంబర్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ ని ఇంటలెక్చువల్ ఫోరం ఫర్ మాదిగాస్ ఇంటర్నేషనల్ నెలకొల్పటం జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఏడవ ప్రపంచ మాదిగ దినోత్సవానికి ప్రపంచంలో ఉన్న మాదిగ విద్యావంతులు, మేధావులు పాల్గొనే ప్రపంచ మాదిగ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షులు గురజాల వెంకటేశ్వర్లు, మాదిగ జాగృతి సంఘం నాయకులు కోటా కిషోర్, నడిపింటి నరేష్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కొమ్మ గిరి వెంకటేశ్వర్లు, బొక్క రాంబాబు, మాదిగ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు నంద్రురాజు, రాగా వెంకట్ , తెలంగాణ మాదిగ దండోరా మహిళా జిల్లా నాయకురాలు వలదాసి వెంకట నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.





## పాలకుడిలా కాకుండా సేవకుడిలా అభివృద్ధి చేస్తున్నా

**- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

హన్మకొండ : అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని సమయానూసారంగా ప్రతి కాలనీ అభివృద్ధి చేస్తానని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసారు. అనంతరం ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్ లో గెలిచినా మీడియా మిత్రులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకష్ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ 2024 బహుమతులు ప్రదానోత్సం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీ నాయకులు చేసింది ఏమి లేదని అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి కనపడుతుందని, పదేళ్లలో అభివృద్ధి చేయకుండా రాజకీయ పబ్బం గడిపి ఇప్పుడు అభివృద్ధి పట్ల మాట్లాడటం సిగ్గుచేటు అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీలలో ప్రతి ఒక్కటి అమలు చేస్తూ, అప్పుల ఉబీలో ఉన్న రాష్ట్రాన్ని మెరుగు పడే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు.

## ఘనంగా బయ్య మధు జన్మదిన వేడుకలు

వరంగల్ టౌన్ : వరంగల్ కాశీబుగ్గ మాజీ కార్పొరేటర్ బయ్య స్వామి కుమారుడు అమెరికాలో ఉంటున్న బయ్య మధు జన్మదిన వేడుకలను వరంగల్ లోని వారి స్వగృహంలో, స్థానిక ముదిరాజ్ నాయకులు, బయ్య యువసేన బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. "బయ్య యువసేన" తరపున జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో బయ్య యువసేన మిత్రులు సిలివేరు రాజు, గుజ్జుల రాకేష్ రెడ్డి, శేషు, చింటూ, వినయ్ గౌడ్, మరియు స్థానిక కాశీబుగ్గ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బిళ్ళ శివ ముదిరాజ్, నవీన్ ముదిరాజ్, దేవేందర్ ముదిరాజ్, తిరుపతి ముదిరాజ్, పవన్ ముదిరాజ్, చింటూ ముదిరాజ్, చంద్రశేఖర్ ముదిరాజ్, రాజు ముదిరాజ్, సాయి ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

## పాలేరు డివిజన్ ప్లీనంను విజయవంతం చేయండి

**- సిపిఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్**

పాలేరు డిసెంబర్ 26( ప్రజా కలం న్యూస్ ) ఈనెల 29న సిపిఎం పాలేరు డివిజన్ విస్తృత స్థాయి సమావేశం(ప్లినం) విజయవంతం చేయాలని సిపిఎం పాలే డివిజన్ కార్యదర్శి బండి రమేష్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని పద్మా రెడ్డి భవనంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.ఈనెల 29,ఉదయం 10 గంటలకు సిపిఎం జిల్లా కార్యాలయం సుందరయ్య భవనంలో సమావేశం జరుగుతుందని ఈ సమావేశానికి పార్టీ డివిజన్, మండల కమిటీ సభ్యులు శాఖ కార్యదర్శులు, ముఖ్యులు హాజరు కావాలని, ఈ సమావేశం లో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఐద్వా రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ పాల్గొంటారని తెలియజేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి ఇంతవరకు చేయలేదని ప్రభుత్వం వెంటనే ఆయా బ్యాంకులో ,సొసైటీల పరిధిలో రూ .2.లక్షల రైతు రుణమాఫీని వెంటనే మాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.యడవల్లి రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు మల్లెల సన్మతరావు, షేక్. బషీరుద్దీన్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు శీలం గురుమూర్తి ,బిక్కసాని గంగాధర్, కర్ణబాబు,గన్య నాయక్, వెంకటేశ్వరరావు, విజయ, మండల కమిటీ సభ్యులు రాధాకృష్ణ, శ్రీను, వెంగళరావు, నరసింహారావు, ఉపేందర్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్ట్ సరికాదు

**- వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాణోత్చంద్రావతి**





వైరా డిసెంబర్ 26 (ప్రజా కలం న్యూస్) బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్ట్ సరికాదని, అరెస్టును తాను ఖండిస్తున్నానని , బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేడాక్టర్ బాణోత్. చంద్రావతి అన్నారు. కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వకుండా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని అన్నారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమ నాయకుడిగా, దళిత, బహుజన వర్గాల హక్కుల కోసం నిస్వార్థంగా పని చేస్తున్న శ్రీనివాస్పై అక్రమ కేసులు పెట్టడం కా%శీ%గ్రేస్ పార్టీకి అలవాటుగా మారిందని అమె విమర్శించారు.ఎర్రోళ్ల శ్రీనివాస్ పై పెట్టిన కేసులను ఎత్తివేసి వెంటనే విడుదల చేయాలని ఆమె రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న జేసిబి, ట్రాక్టర్ సీజ్

**- అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవు....!!**

**- నవాబుపేట్ ఎస్సై కే. అరుణ్ కుమార్**

వికారాబాద్ డిసెంబర్ 26(ప్రజాకలం ప్రతినిధి ): ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో నుండి అక్రమంగా ఎర్రమట్టి తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్ ని నవాబ్ పేట్ పోలీసులు సీజ్ చేశారు. నవాబుపేట ఎస్సై కే.అరుణ్ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిట్టిగిద్ద గ్రామంలో గల ప్రభుత్వ భూమిలో నుండి అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్నారన్న పక్క సమాచారంతో ఘటన స్థలానికి నవాబ్ పేట్ ఎస్సై అరుణ్ కుమార్ చేరుకొని ఒక జేసీబీ, ఒక ట్రాక్టర్ సీజ్ చేసి పోలీస్ స్టేషనకు తరలించమని చెప్పారు. తదుపరి చర్యల నిమిత్తం మండల రెవిన్యూ అధికారి అయిన తహసీల్దార్ కి అప్పాజెప్పడం జరుగుతుందని తెలిపారు. ట్రాక్టర్ ఓనర్ కమ్ డ్రైవర్ చిట్టి గిద్ద గ్రామానికి చెందిన అయ్యగళ్ళ సత్యం, అదే గ్రామానికి చెందిన కొండారెడ్డి సుధాకర్ రెడ్డి కి సంబంధించిన జెసిబి కి డ్రైవర్ ఎండి పాషా అని తెలిపారు.



# విలేకరులు కావలెను

నిత్యనూతనంగా వెలువడుతూ,
పాఠకుల విశేష ప్రజాదరణ పొందుతూ
విజయవంతంగా రెండు తెలుగు రాష్ట్రాలలో నడపబడుతున్న
'ప్రజాకలం' తెలుగు దినపత్రికకు
జర్నలిజంపై ఆసక్తి, తెలుగు భాష పట్ల అవగాహన కలిగి
వ్రాయడం, చదవడంతో పాటు ప్రస్తుత సమాజం పట్ల బాధ్యత
కలిగిన విలేకరులు అన్ని జిల్లాల నుండి బ్యూరో ఇన్‌చార్జ్‌లు, స్టాప్
రిపోర్టర్లు మండలాల వారిగా కావలెను.

PRAJA KALAM Telugu Daily
తెలుగు దినపత్రిక

## తెలంగాణలో జిల్లాల వారిగా ఇంఛార్జ్ కావలెను



సంప్రదించాల్సిన నంబరు:

**+91 955535 39999**

## ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల వారిగా ఇంఛార్జ్ కావలెను

# ఎదురు తిరిగిన సుపారీ హత్య


కరీంనగర్: జగిత్యాల జిల్లాలో ముంబై గ్యాంగ్ స్టర్ రాహుల్ సూర్య ప్రకాష్ సింగ్ దారుణ హత్యకు గురయ్యాడు. మృతుడు స్వస్థలం ఉత్తర ప్రదేశ్. జగిత్యాల జిల్లా నేరెళ్ళకు చెందిన తోకల గంగాధర్ అనే వ్యక్తిని హత్య చేసేందుకు సుపారీ కుదుర్చుకున్నాడు. ఐదు లక్షలకు ఒప్పందం చేసుకున్నాడు. చివరి నిమిషంలో హత్య ప్లాన్ మారింది. హత్య అవసరం లేదన్నా ఒప్పందం ప్రకారం ఐదు లక్షలు ఇవ్వాల్సిందేనని గ్యాంగ్‌స్టర్ పట్టుబట్టాడు. లేకుంటే మీ అయ్యను చంపుతానని బెదిరించాడు. అనుకున్నంత పని చేస్తాడని భావించి సుపారీ తీసుకున్న వ్యక్తినే హత్య చేసి దహనం చేశాడు. చివరకు నిందితులు భయపడి పోలీసులకు లొంగిపోయడంతో హత్య దహనం వెలుగులోకి వచ్చింది. ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామానికి చెందిన మెరుగు లక్ష్మణ్, కమలాపూర్ గ్రామానికి చెందిన నేరెళ్ళ గోపాల్ ఇద్దరు మంచి స్నేహితులు. వీరు ముంబైలో కల్లు బిజినెస్ చేస్తున్నారు. ఇటీవల కొంతకాలం నుంచి మెరుగు లక్ష్మణ్ మరదల్ని నేరెళ్లకు చెందిన తోకల గంగాధర్ అనే వ్యక్తి వేధిస్తున్నాడు. ఈ క్రమంలో పలుమార్లు హెచ్చరించినా అతడి ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో గంగాధర్ ను ఎలాగైనా చంపేసి తన మరదలకు ప్రశాంత జీవనం అందించాలని అనుకున్నాడు. ఈ విషయాన్ని తన స్నేహితుడైన నేరెళ్ల గోపాల్ కు తెలిపి గంగాధర్ ను చంపడానికి ఎవరితోనైనా మాట్లాడాలని కోరాడు. గోపాల్ తనకు తెలిసిన యుపికి చెందిన రాహుల్ సూర్య ప్రకాష్ సింగ్ ముంబైలో గ్యాంగ్ స్టర్ అని, అతడికి సుపారీ ఇస్తేనే హత్య చేయడానికి ఒప్పు కుంటాడని గోపాల్, లక్ష్మణ్ తో చెప్పాడు. రూ.5 లక్షల సుపారీ ఇవ్వడానికి లక్ష్మణ్ ఒప్పుకోగా గోపాల్ ఈ విషయాన్ని గ్యాంగ్ స్టర్ రాహుల్ ప్రకాష్ సింగ్ కు వివరించగా ఆయన డీల్ ఒకే చేశారు. ఇంకేముంది మర్డర్ చేయడానికి డేట్, టైం అన్ని సెట్ చేసుకున్నారు. కాగా, ఇంతలోనే కథ అడ్డం తిరిగింది. గ్యాంగ్ స్టర్ సుపారీ డబ్బులు ఇవ్వాలని ఓ రోజు గోపాల్, లక్ష్మణ్ లకు ఫోన్ చేశాడు. ఎవరిని హత్య చేయాల్సిన అవసరం లేదు, డబ్బులు ఇవ్వాల్సిన పని లేదని ఇద్దరూ గ్యాంగ్ స్టర్ కు తేల్చి చెప్పారు. దీంతో గ్యాంగ్ స్టర్ రాహుల్ ప్రకాష్ సింగ్ సుపారీ మేరకు డబ్బులు ఇవ్వాలని గోపాల్ కు వార్నింగ్ ఇచ్చాడు. డబ్బులు ఇవ్వకపోతే మీ తండ్రి రమేష్ ను చంపుతా అంటూ బెదిరించాడు. దీంతో భయాందోళనకు గురైన గోపాల్ డీల్ ప్రకారం నీ సుపారీ ఇచ్చేస్తానని ఈనెల 12న నేరెళ్లకు రావాలని కోరగా రాహుల్ వచ్చాడు. ఈనెల 13న అర్ధరాత్రి సమయంలో గోపాల్ నేరెళ్లకు చెందిన గండికోట శేఖర్ తో కలిసి రాహుల్ ప్రకాష్ సింగ్‌ను నేరెళ్ల సాంబశివ గుడి వద్దకు తీసుకెళ్లి అందరూ కలిసి మద్యం సేవించారు. ఈ సమయంలో రాహుల్ కు శేఖర్ మాటల్లో పెట్టగా గోపాల్ పెద్ద బండరాయితో రాహుల్ సూర్య ప్రకాష్ సింగ్ తలపై మోదీ హత్య చేశాడు. ఈ విషయం వెలుగులోకి రావద్దనే ఆలోచనతో శవాన్ని సమీపంలో ఉన్న బట్టపెల్లి పోతారం అడవుల్లోకి తీసుకెళ్ళి, శవాన్ని పెట్రోల్ పోసి కాల్చి వేశారు. శవం పూర్తిగా కాలిందో, లేదోనని మరుసటి రోజు నిందితులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. సగం కాలిన శవాన్ని మళ్లీ కట్టెలు వేసి పూర్తిగా దగ్ధం అయ్యాక ఇంటికి వెళ్లారు. ఈ విషయం ఆ నోటా ఈ నోటా బయటకు పొక్కి పోలీసులకు తెలిసింది. నేరెళ్ళలో ముంబాయి గ్యాంగ్ స్టర్ హత్యకు గురి కావడంతో స్థానికంగా కలకలం సృష్టించింది. భయంతో నిందితులు ఇద్దరు నేరెళ్ళ గోపాల్, గండికోట శేఖర్ పోలీసులకు లొంగిపోయారు. రాహుల్ సూర్య ప్రకాష్ సింగ్ ను తామే హత్య చేశామని పోలీసులకు చెప్పారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు విచారణ చేపట్టారు. ఘటన స్థలాన్ని సందర్శించి హత్యకు గురై దహనమైన రాహుల్ చితాభస్మాన్ని సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్ కు పంపించారు. డీఎస్పీ రఘుచందర్, సీఐ రాంనరసింహారెడ్డి ఆధ్వర్యంలో హత్య సీన్ ను రీ కన్స్ట్రక్షన్ చేశారు. ఇద్దరిని అరెస్టు చేసి కటకటాల వెనక్కి పంపించారు. జగిత్యాల జిల్లాలో సుఫారీ ఇచ్చిన వారి చేతుల్లోనే గ్యాంగ్ స్టర్ హత్యకు గురి కావడం సంచలనం రేపింది. జరిగిన ఘటన గురించి తెలుసుకుని ఆందోళనకు గురయ్యారు. ప్రశాంతంగా పొలం పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్న పల్లె జనం సుఫారీ హత్య ఘటన వెలుగులోకి రావడంతో ఉలిక్కిపడ్డారు.

## ఘనంగా నరువి హాస్పిటల్స్ వ్యవస్థాపక దినోత్సవం

తిరుపతి : వేలూరు లోని నాణ్యమైన మెరుగైన నాణ్యమైన చికిత్సను అందించే నరువి హాస్పిటల్స్ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా జరిగింది. ఇందులో సహజ వనరులను పరిరక్షించడం, ప్రపంచ సామరస్యాన్ని పెంపొందిచడం, మతపరమైన సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడం, మత్తుపదార్థాలను వ్యతిరేకించడాన్ని వ్యవస్థాపక దినోత్సవంలో ప్రధాన అంశాలుగా నిలిచాయి. నరువి హాస్పిటల్స్ ఛైర్మెన్, వ్యవస్థాపకుడు డాక్టర్ జీవి సంపత్ ఈ సందర్భంగా పలు అంశాలకు సంబంధించి నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. తరువాత ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పు కోసం అవకాశం ఉన్నచోట్ల మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. దీంతో ప్రపంచ హానికరమైన ప్రభావాలను రివర్స్ చేయాల్సిన సమయం ఆసన్నమైందని, దీని వల్ల సహజ నీటివనరుల క్షీణతను తగ్గించవచ్చునని అన్నారు. దీనికిగాను తమిళనాడు ప్రభుత్వం కొన్ని కార్యక్రమాలు చేపడుతుండగా, నరువి హాస్పిటల్స్ తన వంతు సహకారం అందజేస్తూ నీటి వనరులను సంరక్షిస్తోందని తెలిపారు. దీంతో పాటు మత్తుపదార్థాలను ఉపయోగాన్ని అణిచివేత దిశగా చర్యలు తీసుకుంటోందని అన్నారు. కొన్ని వయస్సుల వారు డ్రగ్స్ కు బానిసలు కావడం వల్ల సమాజానికి హానికరంగా మారుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నరువి హాస్పిటల్స్ వైస్ ఛైర్ పర్సన్, అనితా సంపత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ పాల్, జనరల్ మెడిసన్ హెడ్ డాక్టర్ కురియన్ థామస్, ఈఎన్టీ హెడ్ డాక్టర్ మేరీ కురియన్, న్యూరాలజీ హెడ్ డాక్టర్ చిత్రాంబలం, జనరల్ మెడిసన్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ గుణశేఖరన్, ఇతర డాక్టర్లు, పారామెడికల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# అల్లు అర్జున్ విషయంలో ఏం జరుగుతోంది?

## కాంగ్రెస్ పార్టీ స్టాండ్ పై చర్చ



హైదరాబాద్ : అల్లుఅర్జున్ ఎపిసోడ్ రోజురోజుకూ అనేక మలుపులు తిరుగుతోంది. ఈ వ్యవహారాన్ని మీడియా సైతం భూతద్దంలో చూపించే ప్రయత్నం చేస్తోంది. జరుగుతున్న వ్యవహారాలను సీఎం రేవంత్‌రెడ్డి జాగ్రత్తగా ఎప్పటికప్పుడు గమనిస్తున్నారు. పోలీసులు, నేతలు ఎవరికి ఇష్టం వచ్చినట్టు వారు మాట్లాడడం, ఆపై మీడియాలో చర్చ దారితీయడం వంటి పరిణామాలు జరుగుతున్నాయి. దీనిపై ఇండస్ట్రీ సైలెంట్ కావడంతో.. నేతలు సైతం నోరు ఎత్తకుండా ఉంటేనే బెటరని అంచనాకు వచ్చినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో పీసీసీ మహేష్‌కుమార్ గౌడ్‌కు కీలక సూచనలు చేసినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ వ్యవహారానికి సంబంధించి మీడియా సమావేశాలు, చర్చలకు దూరంగా ఉండాలన్నది అందులోని సారాంశం. పార్టీ నాయకులు మాట్లాడకుండా చూడాలని పీసీసీని ఆదేశించినట్టు తెలుస్తోంది. అసెంబ్లీ సమావేశాల చివరిరోజు సంధ్య థియేటర్ ఘటన, ఆ తర్వాత జరిగిన పరిణామాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. ఇకపై ప్రత్యేక షోలు, టికెట్ల పెంపు ఉండదని ఓపెన్‌గా చెప్పేశారు. అదే రోజు సాయంత్రం నటుడు అల్లు అర్జున్ మీడియా సమావేశం ఏర్పాటు చేయడం, తన వ్యక్తిత్వాన్ని కించపరిచేలా అబద్దాలు ప్రచారం చేస్తున్నారని చెప్పుకొచ్చాడు. ఇటు పోలీసులు.. మంత్రులు, నేతలు కౌంటర్ ఎటాక్ ఇవ్వడం మొదలుపెట్టారు. పార్టీలోని నేతలంతా అల్లుఅర్జున్‌ను దుమ్మెత్తిపోశారు. ఈ వ్యవహారంపై జాతీయ మీడియాలో చర్చకు దారితీసింది. జరుగుతున్న పరిణామాలను గమనించిన సీఎం రేవంత్ రెడ్డి అప్రమత్తమై పీసీసీకి ఆదేశాలు జారీ చేసినట్టు పార్టీ వర్గాల మాట. మరోవైపు ఏఏ ఎపిసోడ్‌పై ఫిల్మ్ ఇండస్ట్రీలో పెద్దలు సైలెంట్ అయ్యారు. న్యాయస్థానంలో కేసు ఉండడంతో రకరకాలుగా మాట్లాడడం సరికాదని భావిస్తున్నారు. దీనికితోడు సంక్రాంతికి స్టార్ హీరోల సినిమాలు రిలీజ్ కానున్నాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రభుత్వంతో విబేధాలకు దిగడం కరెక్టుకాదని అంటున్నారు. సినీ వ్యాపారాల్లో ఏ ప్రభుత్వాలు జోక్యం చేసుకున్న సందర్భాలు లేవని చెబుతున్నారు. మనకు కావాల్సిన సదుపాయాలు ఇస్తున్నారని అంటున్నారు. ఈ క్రమంలో రేపో మాపో టాలీవుడ్‌కి చెందిన కొందరు ప్రముఖులు సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశం కావాలని నిర్ణయించుకున్నట్లు ఫిల్మ్ నగర్‌లో ఓ వార్త చక్కర్లు కొడుతోంది. సమావేశాలు, చర్చల ద్వారానే సమస్యకు ముగింపు పలకాలని, దయచేసి దీన్ని పెద్దది చేయడం కరెక్టు కాదనే నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. ఇక బన్నీ వ్యవహారంపై న్యాయస్థానమే నిర్ణయం తీసుకుంటుందని అంటున్నారు. మరోవైపు బెనిఫిట్ షోల రద్దు మంచిదేనని ఫిల్మ్ ఛాంబర్ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ నేతలు వెల్లడించారు. కొంతమంది ప్రొడ్యూసర్ల వల్లే ప్రేక్షకులకు ఇబ్బందని అంటున్నారు.

# పక్కా వ్యూహాలతో తమిళ బీజేపీ ప్లాన్

చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఇప్పటి నుంచే పక్కా వ్యూహాలతో ముందుకు వెళుతోంది. సార్వత్రిక ఎన్నికల్లో డీఎంకే, ఏడీఎంకేలకు ప్రత్యామ్నాయంగా తృతీయ కూటమిగా బరిలో నిలిచిన బీజేపీ.. అనుకున్న ఫలితాలను రాబట్టలేక చతికిలబడింది. తమిళనాడులో కొన్ని దశాబ్దాలుగా ద్రవిడ పార్టీలే అధికారాన్ని చేజిక్కించుకుంటున్నాయి. అందులోనూ డీఎంకే, ఏడీఎంకే ఈ రెండు ప్రధాన పార్టీలుగా కూటమిలుగా ఏర్పడి దశాబ్దాలుగా ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తున్నాయి. ఈ రెండు పార్టీలను కాదని మిగిలిన పార్టీలు కొన్ని కూటమిగా ఏర్పాటై అధికారాన్ని పొందాలని చూసినా అది సాధ్యపడలేదు. తమిళనాడులో అన్నాడీఎంకే బిజెపి 'బి' టీమ్ గా ఉందనేది పెద్ద చర్చ.. 2016-2021 మధ్య ఎడిఎంకే అధికారంలో ఉన్న ఐదేళ్లు బిజెపికి పూర్తి మద్దతుగా నిలిచింది. తమిళనాడులో ద్రవిడ పార్టీలను కాదని జాతీయ పార్టీలను ఆదరించిన పరిస్థితి గత నాలుగు దశాబ్దాల కాలంలో ఎన్నడూ లేదు. ఐదేళ్లపాటు బీజేపీకి దగ్గరగా ఉండన్న కారణంగా ఏడిఎంకేకి పెద్ద నష్టమే జరిగింది. లోక్‌సభ ఎన్నికల్లో అన్నా టీఎంకేకి బిజెపి దూరంగా జరిగి తృతీయ కూటమి ఏర్పాటుచేసినా ఏమాత్రం ఫలితం తగ్గలేదు. ఇటీవల నటుడు విజయ్ సొంత రాజకీయ పార్టీ(ంఎఐ)ని ఏర్పాటు చేసిన తర్వాత తమిళనాడులో రాజకీయ ముఖచిత్రం కొద్దికొద్దిగా మారుతోంది. విజయ్ పార్టీ విధానాలను ప్రకటించే క్రమంలో తమిళనాడులో ఇప్పటివరకు ప్రధాన రాజకీయ పార్టీలు మిత్రపక్షాలకు అధికార భాగస్వామి కల్పించలేదని తాము అధికారంలోకి వస్తే దాన్ని నెరవేరుస్తామని ప్రకటించడంతో రాజకీయంగా చర్చ మొదలైంది. అటు ప్రస్తుతం డీఎంకే కూటమిలో ఉన్న తిరుమావళవన్ సారధ్యంలోని విడుదలై చిరుత్తై కట్చి (ఎఅఐ) విజయ్ ప్రస్తావించిన అంశంపై ఆశగా ఉన్నట్టు తెలుస్తోంది. అలాగే మరికొన్ని రాజకీయ పార్టీలు విజేయ్ తో కలిసి నడిస్తే ఒకవేళ అధికారంలోకి వస్తే తమకు కూడా అధికార భాగస్వామ్యం ఉంటుందన్న అభిప్రాయంలో ఉన్నాయి. ఇక్కడే బిజెపి తన వ్యూహానికి పదును పెట్టినట్టు తెలుస్తోంది. దీంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేని ఓడించడమే లక్ష్యంగా పొత్తులు ఉంటాయని ఆ పార్టీ రాష్ట్రాధ్యక్షుడు కే. అన్నామలై ప్రకటిం చారు. ప్రస్తుతం డీఎంకేలో భాగస్వామిగా ఉన్న వీసీకే కార్యకర్తలు అధికారంలో తమ పార్టీ భాగస్వామ్యం కావాలని బలంగా ఆకాంక్షిస్తున్నారు. డీఎంకే ప్రభుత్వంలో వీసీకేకి కూడా ప్రతినిథ్య ంకల్పించాలన్న డిమాండ్ వినిపిస్తోంది. అధికారంలో తమకు భాగస్వామ్యం కల్పించాలని వీసీకే అధినేత తిరుమా వళవన్ స్వయంగా కోరినా ఫలితం లేకపోయింది. డీఎంకే మాత్రం ఈ డిమాండ్‌ను పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ఇటీవల వరకు డీఎంకే తీరును ఎండగడుతూ వచ్చిన వీసీకే కీలక నేత ఆదవ్ అర్జున.. ఆ పార్టీని వీడారు. ఆయన విజయ్‌కి సన్నిహి తుడని.. త్వరలోనే ఆ పార్టీలో చేరుతా రన్న ప్రచారం కూడా ఉంది. డీఎంకేలా కాకుండా అధికారంలో ఇతర పార్టీలకు భాగస్వామ్యం కల్పించే విషయంలో ఏడీఎంకే సానుకూలంగా ఉంది. అందుకే చిన్నాచితక పార్టీలు ఆ పార్టీ వైపు చూస్తున్నాయి. ప్రధాన ప్రతిపక్షమైన ఏడీఎంకే గురించి విజయ్ పెద్దగా ఎక్కడా మాట్లాడలేదు. దీంతో విజయ్ ఈసారి ఏడీటీఎంకేతో పొత్తు పెట్టుకోవడం దాదాపు ఖాయం అయిం దన్న సంకేతాలు కూడా ఉన్నాయి. అలాగే ఏడిఎంకే పార్టీకి దూరమైన దివంగత జయలలిత సన్నిహితురాలు శశికళ , శశికళ మేనల్లుడు దినకరన్, మరో బహిష్కృత నేత మాజీ సీఎం ఓ పన్నీర్ సెల్వం.. వీరందరిని మళ్లీ ఏడీటీఎంకు దగ్గర చేసేలా ప్రయత్నాలు ప్రచారం జరుగుతోంది. దీని వెనక బిజెపి ఉన్నట్టు తమిళనాడు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. నటుడు విజయ్ పార్టీ.. ఏడీఎంకేతో పాటు ఆ పార్టీకి దూరమైన ఈ ముగ్గురు నేతలు కలిస్తే డిఎంకేని కచ్చితంగా ఢీకొట్టడం సాధ్యపడుతుందని బీజేపీ అధిష్టానం భావిస్తోంది. ఈ దిశగా తెర వెనుక కమలనాథుల మంత్రాంగం నడుపుతున్నట్టు పొలిటికల్ సర్కిల్లో డిస్కషన్ జరుగుతోంది. బిజెపి నేరుగా డీఎంకేను ఢీకొట్టగలిగే పరిస్థితి లేనందున.. మూడో కూటమిగా వెళ్తే డీఎంకేకే మేలు జరుగుతుందని కమలనాథులు భావిస్తున్నారు. అందుకే డీఎంకేను కొట్టేందుకు బలమైన ప్రతిపక్ష కూటమికి సహకరించడం ద్వారా తాము అనుకున్నది సాధించొచ్చని కమలనాథులు భావిస్తున్నారు.

# 20 శాతం మంది లక్షాధికారులు

## 40 ఏళ్లలోపు వారే..

న్యూఢిల్లీ : భారతదేశంలోని 20 శాతం మంది మిలియనీర్‌లు 15 శాతం మంది అధిక నికర విలువ కలిగిన ఆర్ హెచ్‌ఎన్‌ఐలు 40 ఏళ్లలోపు వారేనని తాజా అధ్యయనం కనుగొంది. అనరాక్ ప్రాపర్టీ కన్సల్టెంట్స్ చేసిన అధ్యయనం ప్రకారం, ప్రస్తుతం 850,000గా ఉన్న భారతదేశ హెచ్‌ఎన్‌ఐ జనాభా 2027 నాటికి 1.65 మిలియన్లకు చేరుకుంటుంది. అయితే అల్ట్రా హై నెట్ వర్త్ వ్యక్తుల 0తీ యూహెచ్‌ఎన్‌ఐల సంఖ్య (వి30 మిలియన్ కంటే ఎక్కువ ఆస్తులు కలిగిన వ్యక్తులు) కూడా రాబోయే సంవత్సరాల్లో పెరుగుతుందని అధ్యయనం తేల్చి చెప్పింది. నివేదిక ప్రకారం, భారతదేశంలోని హెచ్‌ఎన్‌ఐ జనాభాలో 15 శాతానికి పైగా, వీరిలో ఎక్కువ మంది స్టార్టప్‌లు, యునికార్న్స్, ఐపిఓలు, టెక్-ఆధారిత వెంచర్‌లతో సంపాదిస్తున్నారు. 30 ఏళ్లలోపు వారు, దేశంలోని మిలియనీర్‌లలో 20 శాతం మంది 40 ఏళ్లలోపు ఉన్నారు. ఈ సంవత్సరాల వయస్సు 2030 నాటికి 25 శాతానికి పెరుగుతుందని అంచనా వేసింది అధ్యయనం. ఎందుకంటే యువ పారిశ్రామికవేత్తలు సంపద సృష్టిని పునర్నిర్వచించడాన్ని కొనసాగిస్తున్నారు. భారతదేశంలోని ధనవంతులు ప్రైమ్ రియల్ ఎస్టేట్‌లో భారీగా పెట్టుబడులు పెడుతున్నారని అనరాక్ అధ్యయనం కనుగొంది. మొత్తం ఆస్తి అమ్మకాలలో విలాసవంతమైన గృహాల వాటా, కోవిడ్-19 మహమ్మారికి ముందు ఇది 16%, 2024లో 28%కి పెరిగింది. చాలా విలాసవంతమైనదని అధ్యయనం పేర్కొంది. ముంబై, ఢిల్లీ, బెంగళూరు నగరాల్లో, గోవా, అలీబాగ్, జైపూర్‌లలో కూడా ఇళ్ల విక్రయాలు జరిగాయి. దాదాపు 14% యూహెచ్‌ఎన్‌ఐలు విదేశాల్లో ఆస్తిపై కూడా పెట్టుబడి పెట్టారు. దుబాయ్, లండన్, సింగపూర్ ప్రాపర్టీ కొనుగోలుకు అతిపెద్ద హాట్‌స్పాట్‌లుగా మారాయి. 2024లో విదేశీ ఆస్తులపై పెట్టుబడులు రూ.12 కోట్లు పెరిగాయని అధ్యయనం వెల్లడించింది. అధ్యయనం ప్రకారం, దాదాపు 30% మంది కొత్త హెచ్‌ఎన్‌ఐలు తమ సంపదను టెక్నాలజీ, ఫిన్‌టెక్, స్టార్టప్‌లకు ఆపాదించగా, స్థానిక తయారీని ప్రోత్సహించే 'మేక్-ఇన్-ఇండియా' ప్రచారం యూహెచ్‌ఎన్‌ఐల సంపదకు 21% దోహదపడింది. భారతదేశం పెరుగుతున్న హెచ్‌ఎన్‌ఐ జనాభాకు రియల్ ఎస్టేట్ సంపద సృష్టికి ప్రధాన మూలం అని చెప్పవచ్చు. దాదాపు 15% సహకరిస్తుంది. విలాసవంతమైన, వాణిజ్యపరమైన ఆస్తులు అతిపెద్ద వనరులుగా ఉన్నాయి. తయారీ, రియల్ ఎస్టేట్ కాకుండా, ఈక్విటీ మార్కెట్, స్టార్టప్‌లు భారతదేశంలోని ధనవంతుల సంపదకు మరో రెండు ప్రధాన వనరులు. అధ్యయనం ప్రకారం, స్టాక్ మార్కెట్ ఈక్విటీలపై సంవత్సరానికి 18% డివిడెండ్‌లను ఇచ్చింది. అయితే భారతదేశంలోని 30 ఏళ్లలోపు ఉన్న హెచ్‌ఎన్‌ఐలలో 15% శాతం మంది స్టార్టప్‌లు యునికార్న్‌లు, ఎఖూలు, టెక్ వెంచర్‌లతో సంబంధం కలిగి ఉన్నారు. 2024లో 37% హెచ్‌ఎన్‌ఐలు లంబోర్ఘిని, పోర్షే, రోల్స్ రాయిస్ వంటి ఖరీదైన బ్రాండ్‌లను కొనుగోలు చేయడంతో భారతదేశంలోని అత్యధిక మంది ధనవంతులు విలాసవంతమైన కార్ల కోసం విలాసవంతమైన మొత్తాన్ని ఖర్చు చేస్తున్నారని అధ్యయనం కనుగొంది. అదనంగా, భారతదేశంలోని యూహెచ్‌ఎన్‌ఐలు కస్టమ్ హాలిడేస్, లగ్జరీ క్రూయిజ్‌ల కోసం ఏటా దాదాపు రూ. 6 కోట్లు ఖర్చు చేస్తున్నాయని అధ్యయనం తెలిపింది. ఇది కాకుండా భారతదేశం కస్టమ్ ఆభరణాలు, గడియారాల కోసం అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌గా మారింది. ధనవంతులు ఈ వ్యానిటీ వస్తువులపై విపరీతంగా ఖర్చు చేస్తున్నారు. కస్టమ్ వాచీలు, ఆభరణాల కోసం భారతదేశం 5వ అతిపెద్ద మార్కెట్ అంటే నమ్ముతారా.

# మళ్లీ రంగంలోకి వీఆర్వోలు

హైదరాబాద్ : రెవెన్యూ శాఖకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో వీఆర్వో వ్యవస్థను పునరుద్ధించాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక వీఆర్వో అధికారిని నియమించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దాంతో పాత ఉద్యోగులను మళ్లీ ఎఖీలుగా విధుల్లోకి తీసుకునే దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ నెల 28 వరకు వీఆర్వోలు, వీఆర్ఏల పునరుద్ధరణకు గడువు విధిస్తూ తెలంగాణ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ధరణిని రద్దు చేస్తూ భూ భారతి చట్టం తీసుకొచ్చారు. ఈ చట్టంలో భాగంగా వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెవెన్యూ శాఖలో సంస్కరణల పేరిట వీఆర్ఏ, వీఆర్వో లాంటి కీలక వ్యవస్థను రద్దు చేసింది. వాటి స్థానంలో ధరణి పోర్టల్ తీసుకొచ్చి భూములకు సంబంధించిన అనుమతులు మంజూరు చేసి రిజిస్ట్రేషన్లు కొనసాగించారు. ఆ సమయంలో వీఆర్వోలు, వీఆర్ఏ లను ఇతర శాఖలకే కేటాయించారు. ఆ సమాచారాన్ని సేకరించి అర్హత ఉన్న ఉద్యోగులను తిరిగి వీఆర్ఏ, వీఆర్వోలుగా విధుల్లోకి తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డిసెంబర్ 28 నెలలోగా అందుకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి పెట్టాలని తెలంగాణ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్ సోమవారం నాడు ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణలో మొత్తం 10,911 వరకు రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించాలని నిర్ణయం తీసుకుంది. గతంలో ఉన్న వీఆర్ఏ, వీఆర్వోలను ఇతర శాఖల్లోకి బదిలీ చేశారు. వారిని తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకువచ్చేందుకు కసరత్తు మొదలైంది. వారికి తిరిగి వీఆర్ఏ, వీఆర్వోలుగా పోస్టింగ్ ఇచ్చే అవకాశం ఉంది. లేకపోతే రెవెన్యూ శాఖలో కాంగ్రెస్ ప్రభుత్వం వేరే ఏదైనా కొత్త పేరుతో వారికి తిరిగి రెవెన్యూ అధికారులుగా పోస్టింగ్ ఇవ్వనున్నారు. ఈ మేరకు భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్ కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. డిగ్రీ అర్హత ఉన్న మాజీ వీఆర్ఏ, వీఆర్వోలను రెవెన్యూ శాఖలో గతంలో నిర్వహించిన విధులు అప్పగించనున్నారు. వీఆర్వో, వీఆర్ఏలను తిరిగి అదే పోస్టుల్లోకి తీసుకోవడంతో పాటు రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేయనుంది. జూనియర్ రెవెన్యూ అధికారి పేరుతో ప్రతి గ్రామంలో విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తద్వారా భూమి సమస్యల పరిష్కారం అవుతాయని అధికారులు చెబుతున్నారు. ధరణి కారణంగా వేలాది మంది భూములు కోల్పోయారని, అందులో జరిగిన తప్పిదాలను గుర్తించి సమస్య పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి పలుమార్లు ప్రస్తావించార. ఈ క్రమంతో రాష్ట్ర ప్రభుత్వం ధరణిని తొలగించి భూ భారతి బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించారు. త్వరలోనే బిల్లును చట్టం చేసి దీని ద్వారా రెవెన్యూ అధికారులు మళ్లీ పాత శాఖలో బాధ్యతలు చేపట్టనున్నారు.

# మహిళల చేతికి సోలార్ పవర్ స్టేషన్

హైదరాబాద్, మహిళా సంఘాలకు ఉపాధి మార్గాలు కల్పించి వారిని మరింత శక్తమంతంగా చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా వారికి సోలార్ ప్రాజెక్టులు అందజేయనుంది. తెలంగాణ ప్రభుత్వం మరో సరికొత్త పథకాన్ని మహిళల కోసం తీసుకొస్తోంది. ఈ మధ్య కాలంలో ఎక్కువ ప్రాచుర్యం పొందిన సోలార్ పవర్ విస్తరణ బాధ్యతను మహిళా సంఘాలో చేతిలో పెట్టనుంది. అదే టైంలో కాలుష్యాన్ని తగ్గించే ఎలక్ట్రిక్ బస్‌లను కూడా వారికే ఇవ్వబోతోంది. ఈ రెండు విజయవంతమైతే దేశానికే తెలంగాణ మహిళా సంఘాలు ఆదర్శంకానున్నాయి. తెలంగాణ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కీలక ఆదేశాలు జారీ చేశారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మీటింగ్‌లో ప్రభుత్వం చేపట్టేబోయే పథకాల అమలు విధానంపై అధికారులతో చర్చించారు. తెలంగాణ వ్యాప్తంగా 231 ఎకాల సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటుకు సిద్ధమైనట్టు వివరించారు. వీటి బాధ్యతను మహిళా సంఘాలు ఇవ్వాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. మహిళాశక్తి కార్యక్రమంపై సమీక్ష నిర్వహించిన సీఎస్ సోలార్ ప్లాంట్లు, ఎలక్ట్రిక్ బస్‌లపై ఆదేశాలు జారీ చేశారు. మహిళా సంఘాల ద్వారానే 231 ఎకరాల్లో సోలార్ ప్లాంట్లు నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రయోగాత్మకంగా ఐదు జిల్లాల్లోని మహిళా సంఘాలకు ఇందుకు సిద్ధం చేయాలన్నారు. ఆరు నెలల్లోనే 231 ఎకరాల్లో సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వినియోగంలో లేని ఎండోమెంట్ భూములు వారికి కౌలుకు ఇచ్చి అక్కడే ప్లాంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మరోవైపు 150 ఎలక్ట్రిక్ బస్సులు మహిళా సంఘాలు కొనేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. వాటి నిర్వహణ బాధ్యత తెలంగాణ ఆర్టీసీ చూసుకుటుందన్నారు. దీనికి కూడా ప్రక్రియను వీలైనంత త్వరగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆసక్తి ఉన్న వారిని గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ఈ మధ్య కాలంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆర్టీసీలో ఇప్పటి వరకు డీజిల్‌తో నడుస్తున్న బస్‌ల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలు మాత్రమే తిరుగుతాయని చెప్పుకొచ్చారు. అందులో భాగంగానే ముందుగా హైదరాబాద్‌లో డీజిల్ బస్‌లు తిరగకుండా చేయాలని చూస్తున్నారు. అన్ని ఎలక్ట్రిక్ బస్‌లు నడిపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని రూట్‌లలో ఎలక్ట్రిక్ బస్‌లు తిరుగుతున్నాయి. ఆటోలు, ఇతర డీజిల్ వాహనాలను తగ్గిస్తామన్నారు. సమీప భవిష్యత్‌లో హైదరాబాద్‌లో డీజిల్ వాహనాలే ఉండబోవని ప్రకటించారు. ఇలాంటి సంస్కరణలు తీసుకురావాలంటే ప్రభుత్వమే ఎలక్ట్రిక్ వాహనాలు కొనడం బడ్జెట్‌కు మించిన భారం అవుతుంది. అందుకే ఇందులో ప్రజలను భాగస్వాములను చేయాలని ప్రభుత్వం చూస్తోంది. ఇందులో భాగంగానే మహిళలకు ముందుగా ఆ అవకాశం ఇవ్వబోతోంది. అది విజయవంతం అయితే మిగతా వారికి ఈ ఛాన్స్ ఇస్తారు. ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నం విజయవంతం అయితే మాత్రం మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా మారుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అందుకు తగ్గట్టుగానే అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు మహిళా సంఘాలను ప్రోత్సహించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

## నష్టపోయిన రైతును ప్రభుత్వం ఆదుకుంటుంది

### ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు భరోసా

వినుకొండ(ఈపూరు) : పంట నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు రైతులకు భరోసా ఇచ్చారు. గత శనివారం కురిసిన అకాల వర్షంతో ఈపూరు మండలం కొండ్రముట్ల గ్రామంలో దెబ్బతిన్న వరి పంటను ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ వ్యవసాయ అధికారులతో మరియు మక్కెన మల్లికార్జున రావు కలిసి పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులతో స్వయంగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అకాల వర్షంతో దెబ్బతిన్న పంట వివరాలను సమగ్రంగా ప్రభుత్వానికి నివేదించాలని చీఫ్ విప్ జీవి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రైతులు అధైర్య పడవద్దని నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో కన్సెల్టెన్సీల రాజ్యం

గుంటూరు : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యంత్రాంగం కన్సల్టెంట్ల గుప్పెట్లో చిక్కుకుందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నా, నైపుణ్యం పేరుతో లక్షలకు లక్షలు జీతాలు చెల్లించి స్టేట్ సర్వీస్ అధికారులపై పెత్తనం చేయడానికి కన్సల్టెంట్లను పాలనా వ్యవస్థలో చొప్పిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఆంధ్రప్రదేశ్ ప?రభుత్వంలో కొన్నేళ్లుగా ఈ తంతు యథేచ్ఛగా సాగుతోంది. పార్టీలు, ప్రభుత్వాలతో సంబంధం లేకుండా ప్రభుత్వ వ్యవస్థల్లో మధ్యవర్తుల చొరబాటు అంతకంతకు ఎక్కువైపోతోంది. ప్రభుత్వ విభాగాల్లో రకరకాల కారణాలతో కన్సల్టెంట్ల నియామకం కొన్నేళ్లుగా సాగుతోంది.రాష్ట్ర విభజన తర్వాత ఆలిండియా సర్వీస్ అధికారుల కంటే ఎక్కువ జీతాలు చెల్లించి మరీ కన్సల్టెంట్లను నియమించుకునే సాంప్రదాయం మొదలైంది. ప్రభుత్వ ఉద్యోగులపై పాలకులకు నమ్మకం లేకపోవడం, తాము చెప్పినట్టు చేయడం వంటి కారణాలతో కన్సల్టెంట్లకు పాలకులు మొగ్గు చూపుతున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, బ్యూరోక్రసీలో కన్సల్టెంట్ల హవా మాత్రం తగ్గడం లేదు. ముఖ్యమంత్రి ని ప్రసన్నం చేసుకునేందుకు అఖిల భారత స్థాయి అధికారులు అంతర్జాతీయ కన్సల్టెంట్లపై ఆధారపడటంతో ప్రభుత్వ డేటాను అందమైన ప్రెజెంటేషన్లుగా మార్చేసి అంకెల గరడీతో మభ్య పెట్టడం కొందరు అధికారులకు అలవాటుగా మారిపోయింది.పాలనలో సంస్కరణలు, ప్రజలకు మెరుగైన సేవలు, పారదర్శకత, ప్రజా ప్రయోజనాలు లక్ష్యంగా పనిచేయాల్సిన అధికార యంత్రాంగం లో కొత్త వ్యవస్థలు చొరబడటం, దానినే పాలనా సంస్కరణలుగా భ్రమింప చేయడటం కొన్నేళ్లుగా రివాజుగా మారింది. పార్టీలు ప్రభుత్వాలు మారినపుడల్లా అవే కన్సెల్టెన్సీ సరికొత్త ప్రతిపాదనలు ప్రణాళికలతో రంగురంగుల పవర్ పాయింట్ ప్రెజెంటేషన్లతో పాలనా యంత్రాంగంలోకి చేరిపోతున్నాయి.ఏపీలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసి కన్సల్టెన్సీల నియామకంపై ముఖ్యమంత్రి స్థాయిలో అమోదం లభించిన తర్వాత బయటి వ్యక్తులను ప్రభుత్వ వ్యవస్థలోకి కన్సల్టెంట్లుగా తీసుకునేలా జీవో నంబర్ 86ను ఆర్థిక శాఖ జారీ చేసింది.ప్రభుత్వ పాలనా వ్యవస్థలో కీలకమైన శాఖలకు అధిపతులుగా ఆలిండియా సర్వీస్ అధికారులు ఉంటే, వారి కింద వివిధ హోదాల్లో రాష్ట్ర సర్వీస్ అధికారులు పనిచేస్తుంటారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారుల్లో సర్వీస్‌తో పాటు పదోన్నతులతో జాయింట్ డైరెక్టర్లు, అడిషనల్ డైరెక్టర్ స్థాయి వరకు చేరుకుంటారు. సచివాలయాల్లో అయితే వివిధ హోదాల్లో సెక్రటరీలు ఉంటారు.ఈ క్రమంలో కొందరు ఆలిండియా సర్వీస్ అధికారులకు రాష్ట్ర స్థాయి అధికారులపై నమ్మకం లేకపోవడం, స్టేట్ సర్వీస్ అధికారుల్లో చాలామంది రిటైర్మెంట్ వయసుకు దగ్గర్లో ఉండటంతో శాఖాధిపతుల అంచనాలకు అనుగుణంగా నివేదికలు, రిపోర్టులు తయారు చేసే పరిస్థితులు లేవు.కొన్ని శాఖల్లో అధికారులకు పవర్ పాయింట్ తయారు చేయడం, ఎక్సెల్ షీట్లలో డాటాను విశ్లేషించడం వంటి నైపుణ్యాలు కూడా ఉండవు. సరిగ్గా ఈ పరిస్థితుల్ని అనువుగా మార్చుకుని కొన్నేళ్లుగా ప్రభుత్వ శాఖల్లో కన్సల్టెంట్లు చొరబడటం మొదలైంది.ప్రభుత్వ శాఖల్లో విధాన పరమైన నిర్ణయాలను తీసుకోవడం నుంచి వాటి అమలు వరకు క్షేత్ర స్థాయి నుంచి వచ్చే సమాచారాన్ని క్రోడీకరించి నివేదికలు తయారు చేసి, వాటిని అందమైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్లుగా మలచి కొత్త పథకాలకు రూపుదిద్దడంలో కన్సల్టెన్సీల పాత్ర మొదలవుతోంది. రాష్ట్ర సర్వీస్ అధికారులతో పనులు చేయించడం కంటే బయటి వారితో పనిచేయించడం, తాము కోరుకున్న విధంగా నివేదికలు రూపొందించడం శాఖాధిపతులకు సులువుగా మారింది.కన్సల్టెంట్లు సబ్జెక్ట్ నిపుణుడు అయితే ఫర్లేదు కానీ కొన్నేళ్లుగా కన్సల్టెన్సీల నియామకమే ఫార్సుగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. స్టేట్ సర్వీస్ అధికారులకు క్షేత్ర స్థాయి అవసరాలు, వనరులు, ప్రాక్టికల్‌గా ఉండే ఇబ్బందులపై అవగాహన ఉన్నా వారి సేవల్ని వినియోగించుకోవడం లేదు. స్టేట్ సర్వీస్ అధికారుల నివేదికలను అంగీకరించడానికి ఆలిండియా సర్వీస్ అధికారుల అహం అడ్డుగా మారుతోంది. సరిగ్గా ఇదే బలహీనతను అడ్డం పెట్టుకుని ప్రభుత్వ విభాగాల్లో కన్సల్టెన్సీ చొరబాటు అధికం అయ్యింది.ఇక కన్సల్టెన్సీల నియామకంలో కమిషన్ల పర్వం ఉంటుందనే ఆరోపణలు కూడా లేకపోలేదు. ఈ మొత్తం వ్యవహారంలో సంబంధిత శాఖల మంత్రుల ప్రమేయం కూడా ఉండదు. శాఖాధిపతులు, కమిషనర్ల నిర్ణయం మీదే వీటి నియామకాలు జరిగిపోతాయి. కన్సల్టెంట్లపై పర్యవేక్షణ బాధ్యతలు ఎవరివనే విషయంలో జవాబుదారీతనం తీసుకోడానికి అధికారులు సుముఖంగా ఉండరు. ఆ క్షణానికి ప్రభుత్వ అధినేతను మెప్పించడం, మార్కులు కొట్టేయడంపైనే శాఖాధిపతులైన అధికారుల దృష్టి ఉంటుంది.

# రేషన్ బియ్యం స్మగ్లింగ్ చేస్తుంది ఎవరు?

కాకినాడ: ఆంధ్రప్రదేశ్ లో కొన్ని రోజులుగా రేషన్ బియ్యం స్మగ్లింగ్ పై పెద్దయెత్తు చర్చ జరుగుతుంది. ఇంతకీ ఈ రేషన్ స్మగ్లింగ్ ఎలా జరుగుతుంది? ఎవరు చేస్తున్నారు? అన్నదానిపై అందరికీ అనుమానాలున్నాయి. కొన్నేళ్ల నుంచి ఈ తంతు జరుగుతుంది. చెప్పాలంటే గత ఐదేళ్ల నుంచి మాత్రమే కాదు.. కొన్ని దశాబ్దాల నుంచి కూడా ఈరేషన్ బియ్యం అక్రమంగా విదేశాలకు రవాణా అవుతున్నట్లు చెబుతున్నారు. కొన్ని వేల కోట్ల రూపాయల విలువైన రేషన్ బియ్యం ఏపీలోని వివిధ పోర్టుల నుంచి విదేశాలకు ఎగుమతి అయిందన్నది వాస్తవం. కేవలం ఏపీ నుంచి మాత్రమే కాదు ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఈ బియ్యం ఇక్కడకు తీసుకు వచ్చి విదేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు అధికారుల తనిఖీల్లో కనుగొన్నారు.పేదలు పట్టెడన్నం తిన్నాలన్న ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ బియ్యాన్ని నిరుపేదలకు అందిస్తున్నారు. రేషన్ దుకాణాల నుంచి తెలుపు రంగు కార్డు ఉన్న వారికి మాత్రమే రేషన్ బియ్యం అందిస్తారు. రాష్ట్రంలో 1.47 లక్షల మంది వరకూ రేషన్ కార్డుదారులున్నారు. వీరందరిలో కొత్తలో రేషన్ బియ్యం తాము ఇంట్లో వినియోగించుకోవడానికి తీసుకునే వారు. కానీ రాను రాను కొనుగోలు శక్తి పెరగడంతో పాటు రేషన్ బియ్యం నాసిరకమైనవిగా భావించడంతో దానిని తీసుకోవడం వృధా అన్న అభిప్రాయానికి వచ్చారు. కొందరు మాత్రంఇప్పటికీ రేషన్ బియ్యాన్ని తీసుకుంటున్నా స్వల్ప సంఖ్యలోనే అన్నది కాదనలేని వాస్తవం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలు కేవలం పేదలకు ఉచిత బియ్యం కోసం సంవత్సరానికి సగటున ఏడాదికి 16 వేల కోట్ల రూపాయల నిధులు వెచ్చిస్తున్నాయి.ప్రస్తుతం దాదాపు 10 వేల కోట్లు కేంద్రానికి, 6 వేల కోట్లు రాష్ట్రానికి ఉచిత బియ్యం కోసం వ్యయం అవుతుందన్నది వాస్తవం. గడచిన 5 సంవత్సరాలలో రమారమి మొత్తం 80 వేల కోట్లు ఖర్చు అయితే కేంద్ర ప్రభుత్వం 50 వేల కోట్లు మరియు రాష్ట్ర ప్రభుత్వానికి 30 వేల కోట్లు ఖర్చు అయిందని లెక్కలు చెబుతున్నాయి.కిలో బియ్యం 43.50 రూపాయలు ఖర్చు పెట్టి సివిల్ సప్లైస్ ద్వారా పేదలకు బియ్యం రెండు రూపాయలకే ఇస్తుంటే అందులో తక్కువ మంది తీసుకుంటున్నార. మిగిలిన బియ్యం రాష్ట్రంలోని మొత్తం కోటి 47లక్షల రేషన్ కార్డు దారుల్లో మూడో వంతు మంది కూడా ఆహారంగా వాడటం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. రేషన్ దుకాణాల్లో మిగిలిపోయిన బియ్యాన్ని స్మగ్లర్లు అధిక ధరకు కొనుగోలు చేస్తున్నారన్నది అంతే వాస్తవం.రేషన్ దుకాణాల నుంచి కిలో పది రూపాయల లెక్కన కొని వియాత్నం వంటి దేశాలకు 70 రూపాయలకు విక్రయిస్తున్నారు. ప్రత్యేకంగా కోస్తా, ఉభయగోదావరి, రాయలసీమ ప్రాంతానికి చెందిన నలుగురైదుగురు వ్యాపారుల చేతుల్లోనే ఈ దందా సాగుతున్నట్లు ప్రభుత్వ ప్రాథమిక దర్యాప్తులో వెల్లడయిందని సమాచారం.2019 – 24 మధ్య కాలంలో పేదలకు అందాల్సిన 80 వేల కోట్ల రూపాయల ఉచిత బియ్యంలో ఎక్కువ భాగం విదేశాలకు ఎగుమతి అయింది. ఇందుకు కాకినాడ పోర్టు అడ్డాగా మారింది. ఇక కరోనా వంటి సమయంలో కేంద్ర ప్రభుత్వం పేదలకు ఆకలి తీర్చాలని రెట్టింపు బియ్యం ఇస్తే దానిని కూడా విదేశాలకు తరలించారంటున్నారు. ఒక్క విశాఖ పోర్టు నుంచే పన్నెండు వేల కోట్ల రూపాయల విలువైన రేషన్ బియ్యం 70 వేల మెట్రిక్ టన్నుల ఎగుమతి అయిందని సాక్షాత్తూ నాదెండ్ల మనోహర్ తెలిపారు. మరి ఈ దశాబ్దాల కాలంలో ఎంత బియ్యం దారిమళ్లిదన్నది ఊహకందనివిషయం. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ నిజానిజాలను వెలుగులోకి తెచ్చిస్మగ్లర్లను జైల్లో పెట్టాలని జనం కోరుకుంటున్నారు. మరో వైపు మాజీ మంత్రి పేర్ని నాని కుటుంబం కూ?డా రేషన్ బియ్యం మాయం చేసిన కేసుల్లో చిక్కుకోవడంపై అనేక అనుమానాలు కలుగుతున్నాయి.

# షర్మిళ పొలిటికల్ రిటైర్మెంట్ బెటరా?



విజయవాడ : వైఎస్ షర్మిల ఏపీ రాజకీయాలకు వచ్చి తప్పు చేశారా? అన్న కామెంట్స్ కాంగ్రెస్ పార్టీ నుంచే వినపడుతున్నాయి. 2024 ఎన్నికలకు ముందు తెలంగాణ వైఎస్సార కాంగ్రెస్ పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేసిన అనంతరం ఆమె నేరుగా టీపీసీసీ చీఫ్ అయ్యారు. అయితే వైసీపీ అధినేత జగన్ కు చెక్ పెట్టడానికే ఆమెను అంత పెద్ద పదవిని అప్పగించారని భావించిన సీనియర్ నేతలు ఆమెకు సహకరించడం మానేశారు. ప్రజలు కూడా మొన్నటి ఎన్నికల్లో పట్టించుకోలేదు. ఫలితంగా ఒక్కటంటే ఒక్కసీటు కూడా గెలుచుకో లేకపోయింది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనయగా పార్టీని బలోపేతం చేస్తారని భావించినా హైకమాండ్ అంచనాలు తప్పయ్యాయి. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు దాటుతున్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ కోలుకోలేదన్న దానికి మొన్నటి ఎన్నికలే నిదర్శనమని చెప్పక తప్పదు. షర్మిల రాకతో ఒరిగిందేమీ లేదన్న అభిప్రాయానికి హైకమాండ్ వచ్చినట్లు తెలిసింది. దీంతో ఆమెను పార్టీ చీఫ్ పదవి నుంచి తప్పించాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. సామాజికవర్గం పరంగా కూడా పార్టీకి ఇబ్బంది కరంగా మారడంతో ఆమెను తప్పించి మరొకరికి ఈ పదవి అప్పగించాలన్న యోచనలో ఉన్నట్లు సమాచారం. వైఎస్ షర్మిల పనితీరుపైన కూడా సీనియర్ నేతల నుంచి కిందిస్థాయి క్యాడర్ వరకూ అసహనంతో ఉన్నట్లు ఢిల్లీ పెద్దలు గుర్తించారు. పార్టీ కార్యక్రమాలను చేపట్టినా ఎవరికీ సమాచారం ఇవ్వకుండా అంతా సోలోగానే చేస్తున్నారని, కేవలం తన చుట్టూ ఉన్న కోటరీ నేతలతోనే ఆమె మాట్లాడి కార్యక్రమాలను రూపొందిస్తు న్నారని పార్టీ హైకమాండ్ కు పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందడంతో షర్మిలకు పదవి కంటిన్యూ చేయడంపై పార్టీ అధినాయకత్వం పునరాలోచనలో పడిందంటు న్నారు. అందుకే కార్యక్రమాలకు కూడా సీనియర్ నేతలు ఎవరూ హాజరు కావడం లేదంటున్నారు. వైఎస్ జగన్ పైన చేసే విమర్శలు కూటమి ప్రభుత్వంపై చేయకపోవడం కూడా వైఎస్ షర్మిలకు మైనస్ అని, బీజేపీతో పొత్తుతో ఉన్న చంద్రబాబు సర్కార్ పట్ల షర్మిల కొంత సానుకూల ధోరణిని కొనసాగించడం పార్టీకి దీర్ఘకాలంలో నష్టమని కొందరు హైకమాండ్ పెద్దలకు సూచించినట్లు తెలిసింది. దీంతో ఆమెను ఆ ప్లేస్ నుంచి తప్పించి కొత్త వారిని ఎంపిక చేయాలన్న ఉద్దేశ్యంతో ఉన్నట్లు ఢిల్లీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. అయితే ఎవరిని ఎంపిక చేయాలన్న దానిపై మాత్రం ఇంకా స్పష్టత రాకపోవడంతో ఇకొంత కాలం వెయిట్ చేసి కొత్త పీసీసీ చీఫ్ నేతను ఎంపిక చేస్తారంటున్నారు.మరోవైపు ఇండి కూటమి వైపు జగన్ చూ?డాలన్నా ఆ ప్లేస్ లో షర్మిల ఉండకూడదన్న అభిప్రాయం ఎక్కువ మందిలో వ్యక్తమవుతుందని తెలిసింది. చంద్రబాబు ఎటూ బీజేపీని వదిలి బయటకు రారు. ఈ నేపథ్యంలో ఏపీలో కనీస స్థానాలను కైవసం చేసుకోవాలంటే జగన్ ను మంచి చేసుకోవడం మంచిదన్న అభిప్రాయంలోనూ కాంగ్రెస్ అధినాయకత్వం ఉంది. షర్మిలను తప్పించి ఆ పదవిలో జగన్ కు కొంత సానుకూలమైన ఉన్న నేతను పెడితే కొంత వరకూ తమ దారికి తెచ్చుకోవచ్చన్న అభిప్రాయం కూడా ఉంది. జగన్ కుటుంబంలో విభేదాలు తారా స్థాయికి చేరడంతో పాటు అవి ఆస్తి తగాదాలు కావడంతో అన్నా చెల్లెల్లు భవిష్యత్ లో ఒక్కటి కావడం కష్టమేనని, అందుకే మరో నేతకు పగ్గాలు అప్పగిస్తే ఇటు జగన్ తో సఖ్యతను కొనసాగించి వచ్చే ఎన్నికల నాటికి జగన్ పార్టీతో పొత్తుకు అవకాశం కల్పించేలా హైకమాండ్ అడుగులు వేస్తుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నసమయంలో ఆయనకు అత్యంత సన్నిహితులైన కాంగ్రెస్ నేతల పేర్లను అదినాయకత్వం పరిశీలిస్తుందని చెబుతున్నారు. అదే జరిగితే ఈసారి కాపు సామాజికవర్గానికి పీసీసీ చీప్ పదవి దక్కే అవకాశాలున్నాయన్న లెక్కలు వినపడుతున్నాయి. ఇప్పటి వరకూ బీసీ, ఎస్సీ,బ్రాహ్మణ, రెడ్డి సామాజికవర్గాలకు మాత్రమే పీసీసీ చీఫ్ పదవి అప్పగించారు.తొలి ఏడాది రఘువీరారెడ్డి, తర్వాత సాకే శైలజానాథ్, తర్వాత గిడుగు రుద్రరాజు అనంతరం వైఎస్ షర్మిలను నియమించారు. ఈసారి కాపు సామాజికవర్గానికి ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో ఉన్నట్లు తెలిసింది. కాపుల్లో సీనియర్ నేతలకు పీసీసీ చీఫ్ పదవి అప్పగిస్తే ఆ ఓటుబ్యాంకు కోసమైనా జగన్ పొత్తుకు ముందుకు వచ్చే అవకాశముందని కూడా హస్తం పార్టీ ఎత్తుగడగా వినిపిస్తుంది. అయితే కాపు సామాజికవర్గంలో అంత బలమైన నేత ఉభయ గోదావరి జిల్లా నుంచే ఎంపిక చేయాలన్న ఉద్దేశ్యంతో కూడకా ఉంది. ఈ పరిస్థితుల్లో వైఎస్ షర్మిలకు త్వరలోనే పదవీ గండం తప్పదన్న కామెంట్స్ సొంత పార్టీ నుంచి వినిపిస్తున్నాయి.

వైఎస్ షర్మిలకు అవసరమైతే ఏఐసీసీలో ఒక పదవి అప్పగించి పీసీసీ చీఫ్ పదవి నుంచి తప్పించాలన్న యోచనలో కూడా నాయకత్వం ఉన్నట్లు సమాచారం.

మొత్తం మీద వైఎస్ షర్మిల సోదరుడిపై పోరాటంలో విఫలం కావడంతో ఆమెను తప్పించాలన్న నిర్ణయానికి కాంగ్రెస్ ఢిల్లీ నాయకత్వం ఒక నిర్ణయానికి వచ్చిందంటున్నారు. మరి ఏం జరుగుతుందోచూడాలి.

# కడపలో కుర్చీలాట

కడప : కడప మున్సిపల్ కార్పొరేషన్ సర్వ సభ్య సమావేశంలో మళ్లీ కుర్చీ కోసం రసాభాస జరిగింది. టీడీపీ ఎమ్మెల్యే మాధవీ రెడ్డి ప్రొటోకాల్ పాటించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కడప మున్సిపల్ కార్పొరేషన్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాధవీరెడ్డికి వేదికపై మరోసారి కుర్చీ వేయలేదు. ఈ విషయంపై వైసీపీ మేయర్‌ను ఎమ్మెల్యే నిలదీయడంతో కార్పొరేషన్ సమావేశం రసాభాసగా మారింది. తనకు కుర్చీ వేసేంత వరకు నిలబడే ఉంటానని ఎమ్మెల్యే మాధవీ రెడ్డి కడప మేయర్ పోడియం వద్ద నిరసన తెలిపారు. మహిళలను అవమానిస్తే మీ పార్టీ అధినేతకు సంతోషం కలుగుతుందా అని ఎమ్మె?ల్యే ప్రశ్నించారు.మేయర్ సీటు పక్కన తనకు కుర్చీ వేయాలని ఎమ్మెల్యే మాధవీ రెడ్డి ఆందోళనకు దిగడంతో కార్పొరేషన్ సమావేశం రణరంగంగా మారింది. సమావేశాన్ని మధ్యాహ్నానికి వాయిదా వేసినా పరిస్థితి కుదుటపడకపోవడంతో.... వైసీపీ సభ్యులు బాయికాట్ చేశారు. అనంతరం మేయర్ సురేష్ బాబు బయటకు వెళ్లిపోయారు. దీంతో ఉదయం నుంచి సీటు జరిగిన ఫైట్ ముగిసింది. అంతకు ముందు టీడీపీ–వైసీపీ కార్పొరేటర్ల ఘర్షణతో కార్పొరేషన్‌లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయిసమావేశం అనంతరం ఎమ్మెల్యే మాధవీ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కడప కార్పొరేషన్ నేటి సమావేశంచరిత్రలో నిలిచిపోతుందన్నారు. అజెండాపై చర్చ జరపకుండానే బిల్లులు ఆమోదించారని మండిపడ్డారు. ఈ సమావేశంతో ప్రజాధనం దుర్వినియోగం చేశారన్నారు. మేయర్ ఓ నియంతలా వ్యవహరిస్తు?న్నారని ఆరోపించారు. మహిళ ఎమ్మెల్యే అంటే గౌరవం లేదని, కడప కార్పొరేషన్ రాయించుకున్నట్ల వ్యవహారిస్తున్నారన్నారు. సమావేశంలో వైసీపీ కార్పొరేటర్లు హంగామా చేశారన్నారు. కొందరు కార్పొరేటర్లు టీడీపీలో చేరారని జీర్ణించుకోలేక కుర్చీ డ్రామా ఆడుతున్నారని ఆరోపించారు. కార్పొరేషన్ లో కనీసం వీధి కుక్కలను కూడా అరికట్టలేని పరిస్థితి ఉందన్నారుఎమ్మెల్యే మాధవీరెడ్డి నియంతలా వ్యవహరిస్తున్నారని కడప మేయర్ సురేష్ బాబు ఆరోపించారు. కడప మునిసిపల్ కార్పొరేషన్ సర్వ సభ్య సమావేశంలో ఎమ్మెల్యే గలాటా చేశారన్నారు. తనకు కుర్చీ వేయలేదని ఎమ్మెల్యే సమావేశాన్ని అడ్డుకున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే దౌర్జన్యానికి పాల్పడి సమావేశ అజెండా పేపర్లను చించివేశారన్నారు. ఎమ్మెల్యేకు ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి లేదన్నారు. మిగిలిన కార్పొరేషన్లలో ఎమ్మెల్యేలు, మంత్రులు ఎక్కడ కూర్చుంటున్నారో చెప్పాలన్నారు. మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచారని గౌరవిస్తే తన ఇంటిపైనే చెత్త వేయించారని ఆరోపించారు.వందలాది మంది కార్యకర్తలతో కార్పొరేషన్ పై దండయాత్ర చేశారని మేయర్ విమర్శించారు. కార్పొరేటర్లపై నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే, ఫిరాయింపు కార్పొరేటర్లను సస్పెండ్ చేసినా సమావేశం నుంచి బయటకు వెళ్లలేదన్నారు.నవంబర్ 7న జరిగిన కడప కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో కూడా కుర్చీ వివాదం నెలకొంది. ఈ సమావేశంలో మేయర్ పక్కన తనకు కుర్చీ వేయలేదని ఎమ్మెల్యే మాధవీ రెడ్డి మండిపడ్డారు. మేయర్ ఛాంబర్‌లో ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలకు కుర్చీలు తీసేశారని, ప్రొటోకాల్ పాటించాలని ఎమ్మెల్యే ఆరోపించారు. దీంతో కుర్చీల వివాదం నెలకొంది.

# మూడేళ్లలో అమరావతి పూర్తి

విజయవాడ : మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధి పనులు పూర్తి చేయడానికి టీడీపీ కూటమి ప్రభుత్వం సంకల్పించింది. రాజధాని అభివృద్ధికి అయ్యే వ్యయ భారాన్ని ప్రజలపై ఒక్క పైసా కూడా వేయమని, అమరావతి భూములు అమ్మగా వచ్చే సొమ్మునే రుణాలు తీర్చేందుకు ఉపయోగిస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు.రాజధాని అమరావతి అభివృద్ధి పనులకు, టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన నారాయణ రాష్ట్ర రాజధాని అమరావతి జోన్7, 10 లే అవుట్ల రోడ్ల నిర్మాణ పనులను రూ.2,723 కోట్లతో చేపట్టేందుకు సీఆర్డీఏ ఆమోదం లభించిందని మంత్రి తెలిపారు. రాజధాని అమరావతి అభివృద్ధికై ఇప్పటి వరకూ రూ.47,288 కోట్ల విలువైన పనులకు సీఆర్డీఏ సమావేశంలో ఆమోదం తెలిపడం జరిగిందన్నారు. మిగిలిన అభివృద్ధి పనుల్లో కొన్నింటికి ఈ నెలాఖరు లోపు, మిగిలిన వాటికి వచ్చేనెలలోపు ఆమోదం తెల్పి, జనవరి15 లోగా అన్ని పనులకు టెండర్లు పిలిచి పనులు చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు.‘ ఏ దేశానికైనా, రాష్ట్రానికి కైనా ఒక రాజధాని తప్పని సరిగా ఉంటుంది. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌కు అమరావతిని రాజధానిగా ఎంపిక చేయడం జరిగింది. అమరావతిని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి పర్చేందుకు మా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అమరావతి అభివృద్ధికి అయ్యే వ్యయ భారాన్ని ప్రజలపై ఒక్క పైసా కూడా వేయడం లేదు. పూలింగ్ ద్వారా రైతుల నుంచి సేకరించిన భూములు అమ్మగా వచ్చే సొమ్ముతోనే అమరావతి అభివృద్ధికై తీసుకున్న రుణాలు తీర్చేందుకు చర్యలు చేపడుతాం. ఈ విషయంలో ఎటువంట అపోహలకు తావులేదు. ఎవరు ఎటువంటి విమర్శలు చేసిన ప్రజలు నమ్మవద్దు. రాష్ట్రంలోని 26 జిల్లాల సమాన అభివృద్ధికి 2014–19 మధ్య కాలంలోనే తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకున్నాం.రాష్ట్ర పునర్విభజనలో భాగంగా రాష్ట్రానికి వచ్చిన పలు కేంద్ర సంస్థలను సమానంగా అన్ని జిల్లాలకు కేటాయించడం జరిగింది. విజయనగం జిల్లాకు గిరిజన విశ్వవిద్యాలయాన్ని, విశాఖపట్నం జిల్లాకు ఐఐఎం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీని, కాకినాడకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్‌ను, తాడేపల్లిగూడెంకు నిట్‌ను, మంగళగిరికి ఎయిమ్స్‌ను, విజయవాడకు నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, తిరుపతికి ఐఐటి, ఐజర్ లను, కర్నూలుకు ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్, మ్యాన్యుఫ్రాక్చరింగ్ సంస్థను, అనంతపురానికి సెంట్రల్ యూనివర్సిటీని కేటాయించడం జరిగిందిఇదే విధంగా విశాఖపట్నంలో టీసీఎస్, గూగూల్ వంటి సంస్థలతో పాటు గత ప్రభుత్వం తరమేసిన లూలూ గ్రూప్‌ను మళ్లీ వెనక్కు తీసుకొస్తున్నాం. కర్నూలులో 350 ఎకరాల్లో డ్రోన్ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నాం. రాయలసీమ జిల్లాల్లో మ్యాన్యుప్యాక్చరింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తాం. అవకాశం ఉన్న చోటల్లా పోర్టులను అభివృద్ధి పర్చేందుకు చర్యలు చేపడుతాం. పోర్టులు అభివృద్ధి అయ్యే ప్రతి చోటా అమరావతి తరహాలో ల్యాండ్ పూలింగ్ ద్వారా శాటిలైట్ సిటీలను అభివృద్ధి పర్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం’ అని నారాయణ మీడియాకు వెల్లడించారు.‘ రాజధాని అమరావతిపై వైసీపీ నేతలకు ఇంకా కక్ష తీరలేదా? అమరావతిపై వైసీపీ నేతలు కక్ష కట్టారు. అందుకే ఐదేళ్లూ రాజధాని ఊసులేకుండానే పాలించారు. ఇంత త్వరగా అమరావతి అభివృద్ధి పనులు చేపడతామని ఎవరూ ఊహించలేదు. ముఖ్యంగా వైసీపీ నేతలు అసలే నమ్మలేదు. ల్యాండ్ పూలింగ్ ప్రక్రియలో భాగంగా రైతుల భాగస్వామ్యంతోనే రాజధాని నిర్మాణాలు చేపడుతున్నాం. ముఖ్యంగా రాజధాని ప్రాంతానికి వరద తాకిడి వచ్చినా తట్టుకునే స్థాయి నిర్మాణాలు చేపడుతున్నాం. కృష్ణా కరకట్టలను కట్టుదిట్టంగా నిర్మిస్తున్నాం. భవిష్యత్తులో ఎంత పెద్ద వర్షాలు, వరదలొచ్చినా తట్టుకుని నిలబడేలా రాజధాని నిర్మాణం చేపట్టబోతున్నాం.ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అమరావతి రూపుదిద్దుకోనుంది. ఐకానిక్ బిల్డింగ్స్‌తో హైకోర్టు, అసెంబ్లీ బిల్డింగ్స్‌కు, ఎలక్ట్రానిక్ అండర్ గ్రౌండ్స్ నిర్మాణాలకు 47 వేల కోట్లకు పైగా పనులకు ఆమోదం లభించింది. రాజధాని నిర్మాణం, దాని నాణ్యతపై ఎవరికీ ఎలాంటి అపోహలు వద్దు. రాష్ట్రంలో ఉన్న అన్ని పోర్టుల ప్రక్షాళన ప్రారంభమైంది. రాబోయే రోజుల్లో పర్యాటకంగా పోర్టులను, సముద్ర తీర ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం’ అని మంత్రి నారాయణ తెలిపారు. వచ్చే ఏడాది జూన్ 12 కల్లా 1.18 లక్షల టిడ్కో గృహ నిర్మాణాలను పూర్తి చేసి, ప్రారంభిస్తాం. ఇప్పటికే బ్యాంకు రుణాలు తీసుకుని నాన్ పెర్ఫార్మింగ్ అస్సెట్స్‌గా మిగిలి పోయిన టిడ్కో గృహాలను పూర్తి చేయడానికి రూ.102 కోట్లను చెల్లించేందుకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. 2014–19 మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వంచే 7,01,481 టిడ్కో గృహాలను మంజూరు చేయించి, వాటిలో 5.00 లక్షల గృహాలకు పరిపాలనాపరమైన అనుమతులను కూడా మంజూరు ప్రక్రియ కూడా పూర్తయ్యింది. వాటిలో 4,54,706 గృహాలను గ్రౌండ్ చేయడం జరిగింది. ఇందులో 2019 నాటి 3,13,832 గృహ నిర్మాణాలను ప్రారంభించాం.ప్రతి యూనిట్ నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి మొత్తం రూ.3.90 లక్షలు ఇచ్చేందుకు నిర్ణయించాం. ఇందులో రూ.1.90 లక్షలు కేంద్ర ప్రభుత్వం, మిగిలిన సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేలా నిర్ణయించడం జరిగింది. అదే విధంగా లబ్దిదారుని వాటాగా చెల్లించాల్సిన సొమ్మును బ్యాంకు రుణంగా ఇప్పించేందుకు చర్యలు చేపట్టాం. కానీ, ప్రభుత్వం మారడంతో ఈ ప్రక్రియను అంతా గందరగోళమైంది. టీడీపీ ప్రభుత్వం టెండర్లు పిలిచి నిర్మాణానికి చేపట్టిన 4,54,706 గృహాలలో కేవలం 2,61,640 గృహాలను మాత్రమే గత ప్రభుత్వం చేపట్టి మిగిలిన వాటిని రద్దు చేయడం జరిగింది. ఆ చేపట్టిన గృహాలను కూడా గత ప్రభుత్వం పూర్తి చేయలేదు.ఈ గృహాలలో దాదాపు 77 వేల గృహాలను మా ప్రభుత్వమే పూర్తి చేయడం జరిగింది. లబ్దిదారులకు మంజూరు చేసిన గృహాలపై గత ప్రభుత్వం బ్యాంకు రుణాలను తీసుకొని, ఆ సొమ్మును డైవర్ట్ చేసింది. ఫలితంగా ఆయా గృహాలు నాన్ పెర్ఫార్మింగ్ అసెట్స్‌గా మిగిలిపోయాయి. ఈ సమస్య నుంచి బయటపడాలంటే రూ.102 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఆ సొమ్మును ప్రభుత్వం చెల్లించేందుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. వీటిలో దాదాపు 1.18 లక్షల గృహ నిర్మాణాలను వచ్చే ఏడాది జూన్ 12 కల్లా పూర్తిచేసి ప్రారంభించేందుకు చర్యలు చేపడుతాం’ అని మంత్రి నారాయణ వెల్లడించారు.ఆచార్య నాగార్జున వర్సిటీలో రాష్ట్రస్థాయి కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 123 మంది పురపాలక కమిషనర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భవన నిర్మాణాల కోసం ఐదు అంతస్తుల వరకు ఎలాంటి అనుమతులు అవసరం లేదన్నారు. ‘ భవన నిర్మాణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే సరిపోతుంది. లేఅవుట్, భవనాలకు సంబంధించి మున్సిపాలిటీకి రుసుము చెల్లిస్తే అనుమతులన్నీ ఇస్తాం. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పట్టణాల్లో రోడ్లు, తాగునీరు, వీధిదీపాలు, వరదనీరు, ఘనవ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై 15 రోజుల్లో డీపీఆర్ రూపొందించాలని అధికారులను ఆదేశించాం. పాతపన్ను బకాయిల వసూళ్లకు చర్యలు తీసుకోవాలి. నెల్లూరు, కాకినాడ, రాజమండ్రిలో ఘనవ్యర్థాల నిర్వహణకు అనుమతి వచ్చింది. ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో చెత్త సమస్య పరిష్కారమవుతోంది’ అని మంత్రి తెలిపారు.బీసీలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ సందర్భంగా నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించారు. బీసీ హాస్టళ్లలో వసతుల కల్పన, బాలికల హాస్టళ్ల తక్షణ మరమ్మతులకు ముఖ్యమంత్రి ఆదేశించారు. బీసీల రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వం మంత్రుల కమిటీని ఏర్పాటు చేసింది. మంత్రుల కమిటీ ప్రాథమికంగా ఇచ్చిన సూచనలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మరికొంత కసరత్తు తరువాత సాంకేతిక, న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఈ చట్టాన్ని తీసుకురావాలని అధికారులకు సూచించారు. నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్న హామీకి కట్టుబడి ఉన్నామని, దీనికి కూడా చట్టబద్ధత తెస్తామన్నారు. బీసీ సంక్షేమ హాస్టళ్లలో వసతుల కల్పనపైనా సమీక్షించిన సీఎం బాలికల హాస్టళు తక్షణమే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో త్వరలో ఎన్ఆర్ శంకరన్ నాలెడ్జ్ సెంటర్లను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. సామాజిక పింఛన్ల తనిఖీ జరపాలని, అర్హులకే పింఛన్లు అందాలని చంద్రబాబు చెప్పారు.అర్హులకు అందరికీ పింఛన్లు, పథకాలు అందాలన్నది తమ ఉద్దేశమని, ఇదే సమయంలో అనర్హులకు ఫించన్లు ఇవ్వడం సరికాదన్నారు. పింఛన్ల తనిఖీ కార్యక్రమాన్ని కొందరు పింఛన్ల తొలగింపు అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీనిపై అర్హులైన వారు ఆందోళన పడాల్సిన పనిలేదని సీఎం భరోసా ఇచ్చారు.

# గులాబీ ఆనవాళ్లను చెరిపేస్తున్న కాంగ్రెస్

హైదరాబాద్ : మొత్తంగా గులాబీ ఆనవాళ్లు లేకుండా మూడు రంగుల ముచ్చట్లే వినిపించాలని తహతహలాడుతున్న హస్తం అధిష్టానం, శ్రేణుల ఆరాటం ఎంత వరకు సఫలీకృతం అయ్యేది రానున్న రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశముంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో కొలువుదీరిన టీఆర్ఎస్ (బీఆర్ ఎస్) ప్రభుత్వం దాదాపు దశాబ్దం పాటు రెండు పర్యాయాలు కొనసాగింది. పదేళ్ల పాలనలో కేసీఆర్ తనదయిన మార్కు చూపారు. రైతులు, సంక్షేమంపై ఫోకస్ పెంచారు. అన్నదాతకు ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతు బీమా తో పాటు ధరణి వెబ్సైట్ ను అందుబాటులోకి తెచ్చారు. ఆసరా పేరట వృద్దులు, వితంతువులు, దివ్యంగులు, బీడీ కార్మికులకు పింఛన్లను దశల వారీగా పెంచుతూ నెలకు రూ. 2వేల నుంచి 4వేల వరకు అందించారు.సీన్ కట్ చేస్తే ఏడాది క్రితం గత డిసెంబర్ లో ఆరు గ్యారంటీల హామీతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పవర్ లోకి వచ్చీ రాగానే రేవంత్ సర్కారు మూడు రంగుల మార్పు కనిపించేలా ఆరోగ్య శ్రీ పరిమితి పెంపుతో పాటు మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం అందుబాటులోకి తెచ్చింది. తర్వాత 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 లకే గ్యాస్ సిలిండర్, రైతు రుణమాఫీ వంటివి ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. మూసి ప్రక్షాళన పేరిట హైడ్రాకు తెరలేపింది. ప్రస్తుత ఇందిరమ్మ ఇళ్లపై దృష్టి సారించింది. ఇదంతా నాణేనికి ఒకవైపు.. మరోవైపు బీఆర్ఎస్ ఆనవాళ్లు కనిపించకుండా ఒక్కో అడుగు వేస్తోంది. ముందు చెప్పినట్లుగానే ఈ అసెంబ్లీ సమావేశాల్లో ధరణి ని రద్దు చేస్తూ భూ భారతిగా పేరు మార్చింది. రెవెన్యూ మంత్రి స్వయంగా శాసనసభలో ధరణి ని బంగాళాఖాతంలో కలిపామంటూ పేర్కొనడం చూస్తే మిగతా పథకాలు కూడా ఇదే జాబితాలో చేరవచ్చనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే కేసీఆర్ కిట్ కనుమరుగవగా.. వీఆర్వో వ్యవస్థ తిరిగి తీసుకురావడం, రైతు బంధు ప్రక్షాళన వంటివి సంకేతాలుగా కనిపిస్తున్నాయి.కారు పార్టీ రెండు పర్యాయాల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో అంతా అవినీతి,అక్రమాలే అంటూ కాంగ్రెస్ పార్టీ ముందు నుంచీ ఆరోపణలు చేస్తూనే ఉంది. కుటుంబ పాలనలో 'ఆ నలుగురు' మాత్రమే బాగుపడ్డారని.. వందల ఎకరాల్లో ఫామ్ హౌస్ లు.. వేల కోట్లు వెనుకేసుకున్నారని రేవంత్ వర్గీయుల నుంచి నిత్యం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సహజంగానే ప్రత్యర్థి పార్టీలు చేసే పని ఇదే అయినా..ప్రతీ దానికి అవినీతి మరకలను అంటిస్తూ కమిటీల పేరిట విచారణకు ఆదేశిస్తోంది. ఇప్పటికే కాళేశ్వరంపై జుడీషియల్ కమిషన్ ఇందుకు తార్కాణం. అలాగే ఫార్ములా వన్, తాజాగా ధరణి లో చోటు చేసుకున్న అక్రమాలపై విచారణకు ఆదేశించడం వంటివి ఇందులో భాగమేనవి తెలుస్తోంది. గతంలో నిత్యం వార్తల్లో కనిపించిన కేసీఆర్ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వరుస ఓటమి తర్వాత ఫార్మ్ హౌస్ కె పరిమితమయ్యారు. విపక్షాలపై తన పదునైన మాటలతో ఎదురుదాడి చేసే గులాబీ బాస్ మౌనం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర అంశమే. ఈ క్రమంలో మాజీ ముఖ్యమంత్రిపై సానుభూతి రాకుండా పూర్తిగా నెగటివ్ తీసుకు రావాలనే లక్ష్యంగా పావులు కదుపుతోంది కాంగ్రెస్ పార్టీ. రానున్న స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో చర్చ జరగాలని ముందుకు సాగుతోంది. మొత్తంగా గులాబీ ఆనవాళ్లు లేకుండా మూడు రంగుల ముచ్చట్లే వినిపించాలని తహతహలాడుతున్న హస్తం అధిష్టానం, శ్రేణుల ఆరాటం ఎంత వరకు సఫలీకృతం అయ్యేది రానున్న రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశముంది.

# గ్రామాల్లో మారనున్న రాజకీయం

నల్గొండ : రాష్ట్రంలో పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించడంతో ఇక మీదట పంచాయతీల్లో రాజకీయ ముఖ చిత్రం మారబోతోంది. రాబోయే పంచాయతీ ఎన్నికల కోసం పలు సంస్కరణలను కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా ముగిసిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపాదించగా ఆ చట్ట సవరణ బిల్లు ఉభయ సభల్లో ఆమోదం పొందింది. దీంతో గవర్నర్ ఆమోదముద్ర వేసిన తర్వాత చట్టం అమల్లోకి రాబో తోంది. ఈ చట్టం లో పలు కీలకాంశాలను ప్రతిపాదించడం ద్వారా పంచాయతీ ఎన్నికల నాటికి రాజకీయంగా పలు ప్రాధాన్యతలు చోటు చేసుకోనున్నాయి. ముఖ్యం గా రిజర్వేషన్ల అంశంపై గ్రామ స్థాయి నుంచి పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. గత ప్రభుత్వం 2018 లో పదేళ్ల పాటు ఇదే రిజర్వేషన్లు కొనసాగేలా చేసిన చట్టాన్ని ఇప్పుడు సవరించడం వల్ల రిజర్వేషన్ల అంశం మళ్లీ తెరమీదకు వచ్చింది.కొత్త చట్ట సవరణ వల్ల పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లలో రిజర్వేషన్లు తారుమారు కాబోతున్నా యి. స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్లు మారనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో పోటీ చేసేందుకు ఎప్పటినుంచో రంగం సిద్ధం చేసుకుంటున్న ఆశావహులు ఇప్పుడు డైలమాలో పడిపోయారు. పదేండ్లపాటు రిజర్వేషన్లు అమలులో ఉం డేలా గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుని మంత్రివర్గ ఆమోదం తెలిపింది. ఆ రిజర్వేషన్ల ప్రకారమే ఈసారి కూడా రిజర్వేషన్లు అమలవుతాయని, మ ళ్లీ గెలిచి అధికారంలోకి రావచ్చనే ఆశావాహుల ఆశయాలకు గండిపడింది. ఆశావహులు వారు పోటీ చేయదల చుకున్న స్థానాలపై దృష్టి సారించి పలు అభివృద్ధి పనులు చేశారు.






# గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

## దుబ్బాక సిఐ పాలేపు శ్రీనివాస్



సిద్దిపేట జిల్లా ప్రజాకలం ప్రతినిధి డిసెంబర్ 26. నేటి సమాజంలో గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత బానిసలై, వారి జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్నారని, మాదకద్రవ్యాలను ఎవరైనా విక్రయించినా, రవాణా చేసిన కఠిన చర్యలు తప్పవని దుబ్బాక సీఐ పాలెపు శ్రీనివాస్ హెచ్చరించారు. సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ అనురాధ ఆదేశాల మేరకు గురువారం దుబ్బాక పట్టణంతో పాటు హబ్సిపూర్ గ్రామంలోని పలు పాన్ షాప్లు, కిరాణా దుకాణాల్లో మాదకద్రవ్యాల నివారనే లక్ష్యంగా డాగ్ స్క్వాడ్ సిబ్బందితో కలిసి ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏవైనా దుకాణాలలో గాని, పాన్ షాపుల్లో గాని డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే, పోలీసులకు సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రస్తుత సమాజంలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలను తరిమి కొట్టాల్సిన సామాజిక బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సమాజంలో నేటి యువత చెడు అలవాట్లకు బానిసలు కాకుండా, క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివి, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఉన్నత రంగాల్లో స్థిరపడాలని కోరారు. ఆయన వెంట దుబ్బాక పోలీస్ సిబ్బంది, డాగ్ స్క్వాడ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



# ఉద్యమ నాయకుని అరెస్టు సిగ్గుచేటు

## కొండపాక బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు నూనె కుమార్

సిద్ధిపేట జిల్లా ప్రజాకలం ప్రతినిధి డిసెంబర్ 26. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించి సమైక్యాంధ్రుల పాలనలో ఎన్నో కేసులను ఎదుర్కొని అలుపెరుగని పోరాటం చేసిన పేద బడుగు బలహీన వర్గాల నేత, ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని, ఇది కాంగ్రెస్ పార్టీ అరాచక పాలనకు నిదర్శనమని బారాస కొండపాక మండల అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్ అన్నారు. కొండపాక మండలం దుద్దెడ గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నూనె కుమార్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేక డైవర్షన్ రాజకీయాలు చేస్తూ,

పది రోజులకు ఒకరిని అరెస్టు చేస్తున్నారే తప్ప ప్రజల కోసం చేసిందేమీ లేదనీ ధ్వజమెత్తారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణానికి సైతం తెగించి పోరాడిన నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ అని అలాంటి వ్యక్తిని అక్రమ కేసులతో అరెస్టు చేస్తే భయపడే వ్యక్తిత్వం ఆయనది కాదని, కెసిఆర్ అప్పగించిన ఏ పని అయినా సమర్థవంతంగా నిర్వహించడంలో శ్రీనివాస్ ముందుంటారనీ, ఓర్వలేకనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయించి అక్రమంగా అరెస్టులు చేస్తోందని అన్నారు.

ఇకనైనా అక్రమ కేసులతో నాయకులను అరెస్టు చేయడం మానేసి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేకుంటే ప్రజాస్వామ్యంలో ప్రజలతో శిక్ష తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో యువజన విభాగం అధ్యక్షులు చిక్కుడు భాను, ఎస్సీ సెల్ అధ్యక్షులు పల్లె బాబు, ఎస్టీ సెల్ అధ్యక్షులు కెమ్మసారం శ్యామ్, మైనార్టీ నాయకులు ముగ్దుమ్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ వారాహి డ్రైవ్ ఇన్ ఫుడ్ కోర్ట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్ పల్లి, డిసెంబర్ 26, ప్రజా కలం ప్రతినిధి:

కూకట్ పల్లి నియోజకవర్గం బాలాజీనగర్ డివిజన్ 15 వ ఫేస్ లో శ్రీ వారాహి డ్రైవ్ ఇన్ ఫుడ్ కోర్ట్ ను ప్రారంబించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ వినియోగదారులకు సరసమైన ధరలకు స్వచ్ఛమైన, నాణ్యమైన, రుచి తో కూడిన తినుబండరాలను అందించాలని అన్నారు. ఈ సందర్భంగా ఫుడ్ కోర్టు నిర్వాహకుల ను అభినందించి, వ్యాపారం లో రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆత్మహత్యలకు ఫుల్‌స్టాప్ ఎప్పుడు?

హైదరాబాద్ : ఏడో తరగతి విద్యార్థి ఆత్మహత్య... పదో తరగతి విద్యార్థి ఆత్మ హత్య...ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య... ఫుడ్ పాయిజన్ తో విద్యార్థిని మృతి తెలంగాణలో ఇటీవల చోటుచేసుకున్న కొన్ని ఘటనలు. ఓ ప్రముఖ విద్యా సంస్థకు చెందిన ప్రైవేట్ కాలేజీలు, హాస్టళ్లలో విద్యార్థులు ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహ త్యలకు పాల్పడుతున్న ఘటనలు చూస్తు న్నాం. ఈ ఘటనలు జరిగిన కొద్ది రోజు లు కాస్త హడావుడి చేస్తున్నారు. ఆ తర్వాత షరామామూలే. బిడ్డను కోల్పోయిన ఆ తల్లిదండ్రులకు తప్ప..ఈ బాధ ఏ ఒక్కరికీ అర్థం కావడంలేదు. విద్యార్థుల ఆత్మహ త్యలు ప్రభుత్వ హత్యలే అంటూ ప్రతిప క్షాల విమర్శలు, అందుకు అధికార పార్టీ నేతల కౌంటర్లతో అసలు విషయం పక్కదారి పడుతుంది. ఈ ఏడాది పదుల సంఖ్యలో విద్యార్థులు ఆయువు తీసుకున్నది వాస్తవం. ఏదో సంచలనం జరిగితే తప్ప.. విద్యార్థుల ఆత్మహత్యలను ప్రభు త్వాలు పట్టించుకోవడంలేదని సామాజిక వేత్తలు, పలువురు నేతలు అభిప్రాయప డుతున్నారు.సంధ్య థియేటర్ తొక్కిసలాటపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు భేష్... కానీ విద్యార్థుల ఆత్మహత్యలు, రైతుల ఆత్మహత్యలు, ఫుడ్ పాయిజన్ ఘటనలు, హైడ్రా మరణాలపై అసెంబ్లీ లో చర్చించేందుకు సమయం లేదా? అని తెలంగాణ టీడీపీ మహిళా నేత తిరునగరి జోత్స్న ప్రశ్నించారు.

ప్రభుత్వ హాస్టల్స్‌లో ఫుడ్ పాయిజన్ తో చనిపోయిన పిల్లల చావులకి ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. రుణమాఫీ అవ్వక చనిపోయిన రైతుల ప్రాణాలకు ఎవరు బాధ్యులు? హైడ్రా భయంతో ప్రాణాలు కోల్పోయిన వారి మరణాలకు కారణం ఎవరు? సిరిసిల్ల చేనేత సోదరుల ఆత్మహత్యలు కారణం ఎవరు? ఇక్కడ చనిపోయింది సామాన్యులు కాదా? వారి కుటుంబాలకు ఏం సమాధానం చెప్తారని ఆమె ప్రశ్నించారు. ఇదీ వాస్తవమే కదా అని పలువురు పెదవి విరుస్తున్నారు.

# అడ్డగూడూరు మండల కేంద్రంలో సిపిఐ పార్టీ శతాబ్ది ఉత్సవాలు



**అడ్డగూడూర్/డిసెంబర్ 26 (ప్రజాకలం ప్రతినిధి)**

అడ్డగూడూర్ మండల కేంద్రములోని అంబేద్కర్ చౌరస్తాలో సిపిఐ పార్టీ అడ్డ గూడూర్ మండల కార్యదర్శి రేఖల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిపిఐ పార్టీ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమం సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఉప్పుల శాంతి కుమార్ అధ్యక్షతన జరగగా సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ చెడే చంద్రయ్య పార్టీ జెండా ను ఆవిష్కరించడం జరిగినది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెడే చంద్రయ్య మాట్లాడుతూ అక్టోబర్ సోషలిస్ట్ విప్లవం(రష్యన్) కాంతిరేఖలు ప్రపంచ నలుదిశలకు ప్రసరించినట్లు బ్రిటిష్ వలన పాలనలో మగ్గుతున్న మన దేశంలోకి ప్రవేశించాయి బొంబాయి, మద్రాస్, కలకత్తా తదితర నగరాలలో అభ్యుదయ యువకులు కొందరు బృందాలుగా ఏర్పడి రహస్యంగా పనిచేస్తూ కార్మికులను సంఘాలుగా ఆర్గనైజ్ చేయసాగారు. అరుదుగా లభించే మార్క్సిస్ట్ సాహిత్యాన్ని అధ్యయనం చేస్తూ కమ్యూనిస్టు సిద్ధాంతం పట్ల నిబద్ధతను పెంచుకున్నారు. కమ్యూనిస్టు ఒక వైపు జాతీయోద్యమంలో భాగంగా పనిచేస్తూ మరోవైపు రైతులు, కార్మికుల్ని సంఘటితం చేయసాగారు. విద్యార్థులుగా, విప్లకారులుగా విదేశాలకు వెళ్లి పలువురు అక్కడ కమ్యూనిస్టులుగా మారారు. అటువంటి వారిలో కొందరు 1920 లో సమావేశమై కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కాగా 1925 డిసెంబర్ ఆఖరి వారంలో ఉత్తర ప్రదేశ్ కాన్పూర్ లో భారత జాతీయ కాంగ్రెస్ వార్షిక మహాసభ సందర్భంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో నీ కమ్యూనిస్టు గ్రూపులగా వారు అక్కడికి చేరుకున్నారు. 1925 డిసెంబర్ 25 నుంచి 29 వరకు కాన్పూర్ లో పెండాల్లో ప్రత్యేక తొలిసారి సమావేశమైనారు. 26వ తేదీ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సి.పి.ఐ) ఏర్పార్టును అధికారికంగా ప్రకటించారు. మనదేశంలో కమ్యూనిస్టు పార్టీ శాస్త్రీయ సోషలిజం సిద్ధాంతాన్ని మన దేశంలోకి తెచ్చింది. ప్రాచుర్యం కలిగించింది. ఆ సిద్ధాంతం వెలుగులోనే కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన, వ్యవసాయ కార్మిక, అభ్యుదయ రచయితలు, ప్రజానాట్య మండలి, మహిళా సంఘాలను ఏర్పాటు చేసిందని తెలియజేశారు. తెలంగాణ ప్రాంతంలో రజాకారులకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అని అన్నారు .

ఈ అడ్డగూడూరు మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో 500 ఎకరాల పెద్ద రేగడి భూమిని పేదలకు పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీని ఆ పోరాటానికి బాలెంల నరసయ్య వడకాల చంద్రారెడ్డి నాయకత్వం వహించారన్నారు

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మండల సహాయ కార్యదర్శి కందుకూరి వెంకన్న రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చెడిపల్లి రవీందర్, వివిధ గ్రామ శాఖ కార్యదర్శి బొనుగా సుదర్శన్ రెడ్డి, సోలిపురం నాగిరెడ్డి, చెడే నాగేష్, బెల్లి శ్రీకాంత్, ఎడ్ల వెంకటయ్య, చుక్క అంజయ్య, మొగులయ్య, సిపిఐ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## నాలుగు రోజుల పాటు ఏపీజీ వీజీ బ్యాంక్ సేవలు బంద్

వలిగొండ డిసెంబర్ 26 ప్రజాకలం:ఏపీజీవీబీ బ్యాంకు తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మారుతున్న నేపథ్యంలో ఈ నెల 28వ తేదీ నుంచి 31 తేదీ వరకు బ్యాంకు సేవల్లో అంతరాయం కలుగుతుందని,గోకారం శాఖ మేనేజర్ అశోక్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.గూగుల్ పే,ఫోన్ పే తదితర ఆన్లైన్ సేవలు సైతం అంతరాయం ఏర్పడుతుందని,ఈ నాలుగు రోజులు వినియోగదారులు సహకరించాలని కోరారు.తిరిగి 2025 జనవరి 1వ తేదీ నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా పూర్తి స్థాయి సేవలు అందు బాటులోకి వస్తాయని తెలిపారు.ఖాతాదారులు సహకరించాలని కోరారు.

## వలిగొండలో సిపిఐ శతజయంతి ఉత్సవాలు

వలిగొండ డిసెంబర్ 26 ప్రజాకలం:

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆవిర్భవించి,100 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వలిగొండ మండల కేంద్రంలో ఎర్రజెండాను ఆవిష్కరించారు.సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్ పాల్గొన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ 1917లో రష్యాలో జరిగిన మహా



విప్లవం స్ఫూర్తితో మన దేశంలోని యువకులు ఆకర్షతులై కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటుకు నిర్ణయించి,1925 డిసెంబర్ 26న మన దేశంలో కమ్యూనిస్టు అభిప్రాయాలు కలిగిన వారు దేశ నలుమూలల నుండి కాన్పూర్ లో సమావేశమై,భారత కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేశారు.ఆనాటి నుండి నేటి వరకు దోపిడి వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలబడి ఎన్నో త్యాగాలు చేసి కార్మిక,కర్షక,శ్రమజీవుల కొరకు ఎన్నో పోరాటాలతో స్వతంత్ర తర్వాత ప్రధాన ప్రతిపక్షంగా పార్లమెంట్లో పనిచేసిందని, తెలంగాణ సాయుధ పోరాటం ద్వారా హైదరాబాద్ సంస్థాన రాచరిక ఫ్యూడల్ పాలన బద్దలుకొట్టి భారత యూనియన్ లో వీలినం చేయటంలో ప్రధాన పాత్ర వహించిందన్నారు.ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలపాక యాదయ్య,సిపిఐ మండల సహాయ కార్యదర్శి బాలగోని సత్యనారాయణ,సీనియర్ నాయకులు ఎలగందుల అంజయ్య,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంజి వీరస్వామి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్,ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు అభిలాష్, వలిగొండ పట్టణ కార్యదర్శి సుద్దాల సాయికుమార్, మండల కౌన్సిల్ సభ్యులు నరిగే యాదయ్య,సల్వద్రి రవీందర్,లక్ష్మీనారాయణ, దేవేందర్,మచ్చగిరి,బిక్షపతి, మల్లేశం,వీరయ్య,తదితరులు పాల్గొన్నారు

# యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని కాంగ్రెస్ పార్టీ ఆలయంగా మారుస్తున్నారు

### - యాదగిరిగుట్ట పట్టణ జనరల్ సెక్రటరీ పాపట్ల నరహరి

**యాదగిరిగుట్ట, అక్టోబర్ 26 ( ప్రజా కలం ప్రతినిధి)**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని కాంగ్రెస్ పార్టీ ఆలయంగా మారుస్తున్నా రు. క్షేత్రానికి వచ్చే భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా కాంగ్రెస్ పార్టీ, ఆలయ ఈవో వ్యవహారిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాతనే గిరి ప్రదక్షిణ ప్రారంభించినట్లుగా ఈవో, స్థానిక ఎమ్మెల్యే వ్యవహారిస్తున్నారు. ఎన్నో ఏళ్ళుగా యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కొండ చుట్టు ఎన్నో ఏళ్ళుగా భక్తులు ప్రతి స్వాతి నక్షత్రం రోజున గిరి ప్రదక్షిణ చేస్తున్నారు. దేవాలయ ఈవో కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా పని చేస్తూ, స్థానిక ఎమ్మెల్యే వచ్చే సమయం వరకు భక్తులను గిరి ప్రదక్షిణ చేయకుండా ఆపుతున్నారని స్థానిక భక్తులు అంటున్నారు. స్వాతి నక్షత్రం పురస్కరించుకొని బుధవారం రాత్రి



కొండపై ప్రొటోకాల్ కార్యాలయాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం మాధిరిగా ఎంపీ, తన అనుచరులు వినియోగించారు. ఎంపీతో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు ఈ ప్రొటోకాల్ కార్యాలయంలో రాత్రి బస చేయడం ఏమిటని ప్రశ్నించారు.

గతంలో ఎప్పుడు వీఐపీలు వచ్చిన ప్రెసిడెన్షియల్ సూట్‌లోనే నిద్ర చేసేవా రని, కానీ ఇప్పుడు కొత్తగా ప్రొటోకాల్ కార్యాలయంలోని పక్క గదుల్లో ఎంపీ, అనుచరులు నిద్రించడం ఏమిటన్నారు. స్వాతి నక్షత్రం పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆలయ నిబంధనలు తుంగలో తొక్కి సంప్రదాయ దుస్తులు లేకుండా గర్భాలయంలోకి వెళ్లారు. నిబంధనలు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు, కార్యకర్తలు, నాయకులకు వర్తించవా.. భక్తులకేనా నిబంధనలు అన్నారు. ఈ విషయమై ఆలయాధికారులు సీసీ పుటేజీ పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఆరె శ్రీధర్‌గౌడ్, పేరబోయిన సత్యనారా యణ యాదవ్, ఆవుల సాయి యాదవ్, దావూద్, యాకూబ్ తదితరులున్నారు.



## సీఎం పి ఆర్ ఓ వెమిడి నరేందర్ రెడ్డిని కలిసిన దృశ్యం

### యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానానికి మదర్ డైరీ నెయ్యి, పాలు సరఫరా కై విన్నపం

యాదగిరిగుట్ట, డిసెంబర్ 26 ( ప్రజా కలం ప్రతినిధి)

యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానానికి అవసరమైన నెయ్యి పాలు మదర్ డైరీ నుండి అందించాలని సీఎం పిఆర్ఓ వెమిడి నరేందర్ రెడ్డి ని బుధవారం కలిసి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి డైరెక్టర్లు కోరారు. ఈ విషయంపై వెమిడి నరేందర్ రెడ్డి సానుకూలంగా స్పందించి త్వరలోనే యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానానికి మదర్ డైరీ నుండి పాలు నెయి సరఫరా అయ్యేట్లుగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మదర్ డైరీ డైరెక్టర్లు గొల్లపల్లి రాంరెడ్డి, మందడి ప్రభాకర్ రెడ్డి కల్లేపల్లినర్సింలు, నర్సిములు తదితరులు ఉన్నారు. మదర్ డైరీ పరిస్థితులను ఈ సందర్భంగా సీఎం పి. ఆర్. ఓ కు వివరించారు. మదర్ డైరీ సమస్యలను త్వరలో పరిష్కరించేందుకు సీఎం దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు పిఆర్ఓ చెప్పారు.



## యాదగిరిగుట్టలో శ్రీ స్వామివారి జన్మ నక్షత్రం స్వాతి వేడుకలు గిరి ప్రదక్షణలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల, ఎంపీ చామల

యాదగిరిగుట్ట, డిసెంబర్ 26 ( ప్రజా కలం ప్రతినిధి)

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా గురువారం శ్రీ స్వామి వారికి లక్ష పుష్పార్చన గావించారు. స్వయంభులకు శతకడ అభిషేకం నిర్వహించి విశేష పూజలు జరిపారు. ఆలయ ఈవో భాస్కరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ప్రధానార్చకులు నల్లన్ తీఘల్ లక్ష్మీ నరసింహాచార్యులు ఇతర అర్చక బృందం పూజలు జరిపారు.


గిరిప్రదక్షిణ అంగరంగ వైభోవీతంగా కోలాహలంగా భక్తులు లక్ష్మీ నరసింహుడి నామస్మరణలతో కొనసాగింది. గురువారం ఉదయం గిరిప్రదక్షిణ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ,భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి లు సామూహిక గిరిప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మాణం చేసిన యధారుషి,ప్రహ్లాద మండలపాలను ప్రారంభించారు. అనంతరం భక్తుల తో కలసి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేశారు, ఆలయ అధికారులు స్వామి లడ్డుప్రసాదం అందజేశారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధిని వినియోగించుకోవాలి

### -మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

మల్కాజిగిరి,డిసెంబర్26, (ప్రజా కలం ప్రతినిధి)

పేద ప్రజలకు వైద్యం కోసం అందజేస్తున్న సీఎం సహాయ నిధిని అవసరమున్నవారు వినియోగించుకోవాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి



హనుమంతరావు అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ట్రీట్మెంట్ కోసం సీఎం రిలీఫ్ ఫండ్ కు వినాయక్ నగర్ చెందిన మల్లయ్యకు,ఎల్లమ్మ లు అప్లై చేసుకోగా,మల్లయ్య కు 60 వేలు,ఎల్లమ్మ 48 వేలు సాంక్షన్ అయిన సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసి పత్రాలను గురువారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో యాదవ్, జి ఎన్ వి సతీష్ కుమార్,లక్ష్మి కాంత్ రెడ్డి,సానాది శంకర్, బాల రాజ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు

## మధుర బాంక్వ్యాట్స్ పేరుతో ఏర్పాటు చేసిన హాల్ ను ప్రారంభించిన మైనంపల్లి

మల్కాజిగిరి,డిసెంబర్26, (ప్రజా కలం ప్రతినిధి)

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని సఫీల్ గూడ జైన్స్ బాలాజీ బిగ్ టౌన్ లో గురువారం మధుర బాంక్వ్యాట్స్ ను పెరుతో ఏర్పాటు చేసిన మినీ ఫంక్షన్




హాల్ లను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ హైదరాబాద్ సిటీలో ఇప్పటికే మూడు బ్రాంచ్ లు ఉన్నాయని, నాలుగవ బ్రాంచ్ గా మన మల్కాజిగిరిలో ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందని,రానున్న కాలంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో విస్తృతం గా ఏర్పాటు చేసుకునేలా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వెంకటరావు,అవినాష్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జి ఎన్ వి సతీష్ కుమార్,పిట్టల శ్రీనివాస్,బి కే శ్రీనివాస్, మబ్బు,నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి దేవాలయంలో మండల పడిపూజలో డిప్యూటీ మేయర్

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాప్రా మండల్ ప్రజా కలం ప్రతినిధి**

జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో మండల పడిపూజ కార్యక్రమం జరిగిందిప్రధాన అర్చకులు చంద్రశేఖర్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ ఆలయ ప్రధాన కార్యదర్శి జమాల్పూర్ నవీన్ కుమార్ ముఖ్యఅతిథిగా మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ శాంతి కోటేష్ గౌడ్ మరియు మాజీ సర్పంచ్ కరింగులశంకర్ గౌడ్ మల్లెపూల శ్రీకాంత్ కిరణ్ దేవేందర్ రెడ్డి గుండ బిక్షపతి రెడ్డి శెట్టి మహేష్ సింగన్న గారి బాలరాజ్ శ్రీనాథ్ కార్పొరేటర్లు శ్రీనివాస్ రెడ్డి లలిత యాదవ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కోట్ల చెన్నా రెడ్డి రంగా శ్రీమన్నారాయణ సిద్దేశ్వర గురుస్వామి శ్రీశైలం స్వామి నరేష్ స్వామి సంతోష్ గౌడ్ గురు స్వామి సుధాకర్ గౌడ్ స్వామి రాజశేఖర్ స్వామి ఉడుత సంతోష్ గుప్తా గురుస్వామి భజన బృందం సదా గురుస్వామి మరియు బ్రహ్మచారి గురుస్వామి అధిక సంఖ్యలో మహిళలు మరియు భక్తులు పాల్గొనడం జరిగింది



# టీయూడబ్ల్యూజే సహకారాన్ని మరచిపోం

## - హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌజింగ్ సొసైటీ నూతన బాధ్యుల కృతజ్ఞతలు



హైదరాబాద్, డిసెంబర్ 26 (ప్రజాకలం ప్రతినిధి):

వారం రోజుల క్రితం హోరా హోరీగా జరిగిన సొసైటీ కార్యవర్గ ఎన్నికల్లో తమ ప్యానల్ కు సంపూర్ణ మద్దతునిచ్చి, గెలుపుకు కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘంకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్ కో-ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ నూతన బాధ్యులు పేర్కొన్నారు.

గురువారం ఆ సొసైటీ నూతన అధ్యక్ష, కార్యదర్శులు గోవరాజు, రవీంద్రబాబులు బషీర్ బాగ్ లోని టీయూడబ్ల్యూజే కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీని మర్యాదపూర్వకంగా కలుసుకొని కృతజ్ఞతలు తెలిపారు. తమపై సంఘం ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేయకుండా సొసైటీ సభ్యులకు న్యాయం చేసేందుకు అవిశ్రాంతంగా శ్రమిస్తామని హామీ ఇచ్చారు.

తమకు యూనియన్ సలహాలు, సహకారం అవసరమని వారు కోరగా, ట్రేడ్ యూనియన్ స్ఫూర్తితో పనిచేస్తూ ముందుకెళ్లాలని విరాహత్ అలీ వారిని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్.యూ.జే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్ కూడా పాల్గొన్నారు.

# చలానాలపై ఎలాంటి డిస్కౌంట్ లేదు..!



హైదరాబాద్, డిసెంబర్ 26 (ప్రజాకలం ప్రతినిధి):

పెండింగ్ ట్రాఫిక్ చలానాలను డిస్కౌంట్ మళ్లీ వచ్చిందంటూ వస్తున్న వార్తలు ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలో డిస్కౌంట్ ఇచ్చిన విధంగానే మళ్లీ ఆఫర్ ఇచ్చినట్లు వార్త సర్క్యులేట్ అవుతోంది. ఇందులో కార్లపై 60శాతం వరకు, ద్విచక్ర వాహనాలపై 60 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తున్నట్లుగా ఉంది. ఈ డిస్కౌంట్ వచ్చే నెల 10 వరకు ఉందని అందులో ఉంది. చాలామంది తమకొచ్చిన మెసేజ్లు చూసి ఈ న్యూస్ నిజమేనని నమ్మారు కూడా. అయితే ట్రాఫిక్ విభాగం ఈ మెసేజ్ లపైహా స్పందించి స్పష్టత ఇచ్చింది.

తాము ఎలాంటి రాయితీ ప్రకటించలేదని స్పష్టం చేసింది. పెండింగ్ ట్రాఫిక్ చలానాలపై ఎలాంటి రాయితీ ఇవ్వలేదని, వాహనదారులు ఎవరూ నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ తరహా తప్పుడు ప్రచారాలు చేసిన వారి పై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డిసౌంట్లకు సంబంధించి అధికారిక సమాచారాన్ని ట్రాఫిక్ విభాగం నిర్వహిస్తున్న echallan.tspolice.gov.in వెబ్సైట్ ద్వారా మాత్రమే తెలుసుకునే వీలుంటుందన్నారు. ఎవరికైనా అనుమానాలుంటే హెల్ప్లైన్ నెంబర్లు 040 27852772, 27852721 కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చని తెలిపారు.

# ఆలేర అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తా

## -ప్రభుత్వ విప్ బిర్లా ఐలయ్య




యాదాద్రి భువనగిరి డిసెంబర్ 26 ప్రజా కలం ప్రతినిధి

గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండల కేంద్రంలో వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన భవనం ప్రారంభోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బిర్లా ఐలయ్య భువనగిరి పార్లమెంట్ సభ్యులు సామల కిరణ్ కుమార్ రెడ్డి విచ్చేసి నూతన భవనమును రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేసినారు ఈ సందర్భంగా ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ఇప్పటికే ఆలేరు నియోజకవర్గం లో 120 చెరువులను నీళ్లు నింపి ప్రజా ప్రభుత్వంలో రైతులకు 54 వేల కోట్ల లబ్ధి జరిగిందని సంక్రాంతి నుండి రైతు భరోసా వస్తుందన్నారు సన్నబడ్లకు బోనస్ రైతులకు ఎకరానికి 12000 లబ్ధి చేకూరిందని వ్యవసాయ యాంత్రికరణ పథకం పునరుద్ధరణ చేయడం జరుగుతుందని 15 రోజుల్లో 21 వేల కోట్ల రూపాయలతో రుణమాఫీ వానాకాలం సీజన్లో 8.84 లక్షల మంది రైతులు నుంచి 10. 903 కోట్ల బోనస్ అందిందని అన్నారు అభివృద్ధి చేయడమే తన ఏకైక లక్ష్యమని లక్ష్మీ నరసింహ స్వామి దీవెనతో నియోజకవర్గ ప్రజలు ఈ ప్రాంతం రైతులు పూర్తిగా వ్యవసాయం మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారు రైతులకు సాగునీరు నియోజకవర్గంలో అన్ని చెరువులు నీళ్లతో నింపి రైతులకు వ్యవసాయ యోగ్యంగా చేశానని ఆయన తెలిపారు రాబోయే కాలంలో రైతులకు అండగా పెద్దపీట వేసి రాష్ట్రంలోనే ఆలేరును అభివృద్ధిలో ముందు ఇస్తానని ఆయన చెప్పారు

ఈ కార్యక్రమంలో నల్లగొండ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి ఆలేరు మార్కెట్ కమిటీ అయినాల చైతన్య పి ఏ సి. ఎస్ చైర్మన్ ఇమిడి రామిరెడ్డి యారిగుట్ట మాజీ ఎంపీపీ శ్రీ శైలం మాజీ చైర్మన్ మాజీ సర్పంచులు మాజీ ఎంపిటిసిలు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఎరుకల ఎమేందర్ గౌడ్ మాజీ ఉపసర్పంచ్ భరత్ కుమార్ గౌడ్ రైతులు గజం లక్ష్మీ నరసయ్య బండ కింద కృష్ణ కళ్లెం బాబురావు తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికు వినతి



వలిగొండ డిసెంబర్ 26 ప్రజాకలం: మండలంలోని టేకుల సోమారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు చెగురి మల్లేష్ ఆద్వర్యంలో గురువారం స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించి గ్రామానికి వచ్చే బునాదిగాని కాలువను అభివృద్ధి పేర్చి పూర్తి స్థాయిలో రైతులకు నీరు అందించాలని,

గ్రామాభివృద్ధికి సహకరించి నిధులు కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందించి గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేగూరి జంగయ్య,వెలిమినేటి సురేష్, గణేష్ రెడ్డి,బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### ఆస్పత్రిలో రోగులను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు....

ఎల్లారెడ్డి డిసెంబర్ 26 ప్రజా కలం ప్రతినిధి : ఎల్లారెడ్డి పట్టణంలోని ఎస్ వి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని మౌలాన్ ఖేడ్, లక్ష్మాపూర్ గ్రామాలకు చెందిన ఇరువురు రోగులను గురువారం ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా పరామర్శించారు. ఈ మేరకు ఆయన ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న మౌలాన్ ఖేడ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు గుట్టమీది పోచయ్య, లక్ష్మాపూర్ అంగన్వాడి టీచర్ హారిక భర్తతో మాట్లాడి ధైర్యం కల్పించారు. వారికి అందుతున్న చికిత్స గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.



### మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ...

ఎల్లారెడ్డి డిసెంబర్ 26 ప్రజా కలం ప్రతినిధి : ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన సయ్యద్ సలీం కుటుంబాన్ని గురువారం మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల



సత్యనారాయణ పరామర్శించారు. సలీం గుండెపోటుతో మరణించారు. ఈ సందర్భంగా ఆయన సలీం కుటుంబ సభ్యులతో మాట్లాడి మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట మాజీ జెడ్పిటిసి సామెల్, తిమ్మారెడ్డి మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ షేకావత్ అలీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆరీఫ్, హఫీజ్ పటేల్ ఉన్నారు.

### వృద్ధి బ్యాంకేట్ హాల్ ప్రారంభోత్సవం

కూకట్ పల్లి, డిసెంబర్ 26, ప్రజా కలం ప్రతినిధి:

కూకట్ పల్లి డివిజన్ లోని బాలకృష్ణ నగర్ లో వృద్ధి బ్యాంకేట్ హాల్ ను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ మరియు కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర్ రావు. వారు పూజ కార్యక్రమంలో పాల్గొని నిర్వాహకులు గొట్టిముక్కల గౌతమ్, గుత్తికొండ శంకర్ రావు, గుత్తికొండ మురళి లకు అభినందనలు తెలిపారు. అనంతరం జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ నేటి యువత ప్రభుత్వం పై, ప్రభుత్వ ఉద్యోగాల పై ఆదార పడకుండా స్వయం ఉపాధిని పెంపొందించుకోవాలని అన్నారు.



# గురుకుల పాఠశాలలో కొత్తమెను సరే - అమలేది

## - మీడియా కు ప్రవేశం లేదు కానీ కొరియర్ బాయ్స్ కి అనుమతి

## - నాణ్యత లేని ఆహారం వడ్డీస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం



సిద్దిపేట జిల్లా ప్రజాకలం ప్రతినిధి డిసెంబర్ 26.

నిరుపేద విద్యార్థులు చదువుకొని గురుకుల పాఠశాలల్లో ప్రభుత్వం పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో నలభై శాతం మెస్ చార్జీలు పెంచింది. ఈ నెల 14న అన్ని గురుకుల పాఠశాలలో కామన్ మెను అమలు కార్యక్రమం ఘనంగా ప్రారంభించారు. కానీ దాని అమలు ఏం జరుగుతుంది అనేది మాత్రం బయటకు తెలియనివ్వడం ఇవ్వడం లేదు. పాఠశాల పరిశీలనకు వెళ్లిన మీడియా ప్రతినిధులను అనుమతి లేదని గేటు వద్ద ఆపివేసిన గురుకుల పాఠశాల యాజమాన్యం కొరియర్స్ బాయ్స్ ను మాత్రం యాదేచ్చగా పాఠశాలలోకి అనుమతించడం గమనార్హం. ఈ ఘటన దౌల్తాబాద్ మండలం పరిధిలో లింగరాజుపల్లి మహాత్మా జ్యోతి రావు గురుకుల పాఠశాలలో చోటు చేసుకుంది. ప్రభుత్వం నూతన మెనూ ప్రారంభించిన తర్వాత దాని అమలు ఎలా ఉందో తెలుసుకోవాలని నాలుగు రోజుల క్రితం ప్రముఖ దినపత్రికలలో పనిచేసే కొంతమంది విలేకరులు పాఠశాల సందర్శనకు వెళ్లారు. పై అధికారుల ఆదేశాలు ఉన్నాయని వారిని నిలిపివేసిన పాఠశాల ప్రిన్సిపాల్, అదే సమయంలో ప్రైవేట్ కొరియర్ బాయ్ అక్కడికి రాగా ఎలాంటి సమాచారం అడక్కుండానే లోపలికి అనుమతించడం గమనార్హం. ఇదే విషయాన్ని ప్రిన్సిపల్ వివరణ కోరగా మీడియా ప్రతినిధుల అనుమతి లేదని జిల్లా స్థాయి అధికారులతో అనుమతి తీసుకొని మాత్రమే లోపలికి రావలసి ఉంటుందని సమాధానం చెప్పారు. అయితే సుమారు 40% పెంచిన ఇప్పటికీ పాత మెను నే వడ్డిస్తున్నారని, అప్పటికి ఇప్పటికీ తేడా లేదని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించడం గమనార్హం. దానికి తోడు మరుగుదొడ్ల నిర్వహణ, శిథిలావస్థలో ఉన్న భవనాలు, పరిసరాల పరిశుభ్రత మొదలైన విషయాలు బట్టబయలవుతాయని భయంతోనే మీడియా ప్రతినిధులను అనుమతించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గురుకులాల పౌష్టికాహార విషయంలో ఈ మధ్య రాష్ట్ర వ్యాప్తంగా చర్చ నడుస్తున్నగా ప్రభుత్వం కూడా ఈ విషయాన్ని సీరియస్ గా పరిగనిస్తుంది. ఇదే విషయాన్ని చూద్దామని వెళ్లిన మీడియా ప్రతినిధులను పాఠశాలల్లోకి అనుమతించకపోవడం పట్ల మండల వ్యాప్తంగా చర్చ నడుస్తుంది.




### పిఆర్టియుటిఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

కూకట్ పల్లి, డిసెంబర్ 26, ప్రజా కలం ప్రతినిధి:

కూకట్ పల్లి మండల శాఖ పి ఆర్ టి యు టి ఎస్ క్యాలెండర్ ను ఆవిష్కరించిన



మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రామేశ్వర్ గౌడ్ మరియు ప్రధాన కార్యదర్శి ఆనంద్ రెడ్డి. కూకట్ పల్లి మండల పి ఆర్ టి యు టి ఎస్ అధ్యక్షులు వెంకట్, మండల ప్రధాన కార్యదర్శి విట్టల్ ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ నరేందర్ గౌడ్, మండల అసోసియేట్ ప్రెసిడెంట్ నాయని చంద్రశేఖర్, మండల వైస్ ప్రెసిడెంట్ వీరేందర్ మరియు జిల్లా కార్యదర్శి ప్రదీప్ సింగ్ పాల్గొన్నారు.

### కూకట్ పల్లి ఆర్ టి సి డిపోను పరిశీలించిన ఆర్ ఎం రాజశేఖర్

కూకట్ పల్లి, డిసెంబర్ 26, ప్రజా కలం ప్రతినిధి:

టిజిఎస్ఆర్టిసి కూకట్ పల్లి డిపోకు సందర్శించిన సికింద్రాబాద్ రీజనల్ మేనేజర్ రాజశేఖర్. ఈ సందర్భంగా కూకట్ పల్లి డిపో మేనేజర్ డి హరి ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆర్ఎం మాట్లాడుతూ డిపోలో కార్మికుల పనితీరు, వసతులు మరియు మెయింటెనెన్స్ చాలా బాగుందని సంతోషం వ్యక్తం చేశారు. అలాగే కార్మికులందరూ సమిష్టి కృషితో పనిచేసి కూకట్ పల్లి డిపో ని అభివృద్ధిలోకి తీసుకురావాలని, అలాగే సికింద్రాబాద్ రీజనల్ లో కుకట్ పల్లి డిపోని మొదటి స్థానం లో ఉండేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సనత్ నగర్ డిప్యూటీ ఆర్ ఎం కవిత, కూకట్ పల్లి డిపో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, ఎం ఎఫ్ రాజేశ్వరి మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **Kalakonda Ramakrishna**, Printed at M/s. Swetha Offset Printers, H.No. 2-10-92, Weekly Bazar, Boigally, Nizamabad-503001, Telangana State and Published from H.No. 2-10-92, Weekly Bazar, Boigally, Nizamabad-503001, Telangana State, Editor: **Kalakonda Ramakrishna**, RNI. Regn.No. TELTEL/2010/33275, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com